www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బతుకు బండికి ఆమే డ్రైవర్!

ఆర్టీసీ బస్సు నడిపిన తొలి మహిళ

రిపబ్లిక్ డే వేడుకల్లో స్టీరింగ్ పట్టిన విశ్వవాణి

ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఆర్టీసీలో శిక్షణ

రాష్ట్రంలో భారీ వాహన డ్రైవింగ్ శిక్షణ పూర్తిచేసిన తొలి ఎస్సీ యువతిగా కర్నూలు వాసి రికార్డు

11



ఆర్టీసీ బస్సు నడుపుతున్న విశ్వవాణి

మంగళవారం | 3-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 328 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: విదియ రా.12:41 తదుపరి తదియ, నక్షత్రం: మఖ రా.10:11 తదుపరి పుబ్బ, వర్జ్యం: ఉ.10:29-12:03, తె.6:11 మొదలు, దుర్ముహూర్తం: ఉ.9:05-9:51, రా.10:18-11:07, అమృతఘడియలు: రా.7:50-9:24, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:50, సూర్యాస్తమయం:6:07 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సుంకాలు తగ్గాయ్

భారత్‌పై టారిఫ్‌లను 18 శాతానికి తగ్గించిన ట్రంప్

ప్రధాని మోదీతో ఫోన్‌లో చర్చలు

అనంతరం ట్రూత్ సోషల్‌లో సుంకాల తగ్గింపు సమాచారం

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారు!.. ఉక్రెయిన్‌పైనా మోదీతో మాట్లాడా..

రష్యా చమురు ఇక కొనబోమన్నారు.. అమెరికా, వెనెజువెలా నుంచి కొంటామన్నారు

వీలైనంత భారీగా అమెరికా ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటామని హామీ ఇచ్చారు

భారత్ రూ.45.5 లక్షల కోట్ల విలువైన అమెరికా ఉత్పత్తుల్ని దిగుమతి చేసుకుంటుంది

సుంకాలను భారత్ క్రమంగా సున్నాకు తగ్గించనుంది.. ట్రంప్ వెల్లడి

సుంకాల తగ్గింపుపై ప్రధాని మోదీ హర్షం.. ప్రజల తరపున ట్రంప్‌కు ధన్యవాదాలు

ప్రపంచ శాంతికి ట్రంప్ సారథ్యం అవసరమని వ్యాఖ్య.. అమెరికాలో జైశంకర్







న్యూయార్క్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం కుదిరింది. భారత్‌పై ప్రతీకార సుంకాలను 25శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ప్రకటించారు. ఒప్పందం వెంటనే అమల్లోకి వస్తుందని ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. బదులుగా రష్యా చమురు కొనుగోళ్లు ఆపేస్తామని, అమెరికా చమురు ఉత్పత్తులను భారీగా కొనుగోలు చేస్తామని ప్రధాని మోదీ చెప్పారని వెల్లడించారు. అమెరికా ఉత్పత్తులపై భారత్ వసూలు చేస్తున్న టారిఫ్‌లను దశలవారీగా సున్నాకు తగ్గిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తోందంటూ భారత్‌పై వేసిన అదనపు 25శాతం సుంకాల అంశాన్ని ట్రంప్ ప్రస్తావించలేదు. కానీ భారత్‌లోని అమెరికా

మిగతా 2వ పేజీలో...

140 కోట్ల మంది తరపున ప్రెసిడెంట్ ట్రంప్‌కు ధన్యవాదాలు

నా మిత్రుడు ట్రంప్‌తో మాట్లాడాను. భారత ఉత్పత్తులపై సుంకాలను 18శాతానికి తగ్గించడం హర్షణీయం. దీనిపై 140 కోట్ల మంది భారతీయుల తరపున ట్రంప్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నాను. ప్రపంచంలో రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థలు, పెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పని చేస్తే.. మన ప్రజలకు మేలు జరుగుతుంది. పరస్పర ప్రయోజనాలకు, అద్భుతమైన అవకాశాలకు మార్గం సుగమం చేస్తుంది. ప్రపంచ శాంతి కోసం ట్రంప్ నాయకత్వం ఎంతో అవసరం. శాంతి కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలకు భారత్ సంపూర్ణంగా మద్దతు ఇస్తోంది. ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లేందుకు ట్రంప్‌తో కలిసి పనిచేస్తాం.

\- ప్రధాని నరేంద్ర మోదీ



మద్యం పాలసీ మార్చడమే నేరమని తేల్చి... నాడు ఢిల్లీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసింది!

మరి... నెయ్యి టెండర్ల పాలసీని మార్చి, నెయ్యి పేరిట 'రసాయన మిశ్రమం' సరఫరాకు ఆస్కారం కల్పించిన నాటి టీటీడీ పాలక మండలి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఎందుకు వదిలేసింది?

'అవకాశముండీ అడ్డుకోలేకపోయారు' అంటూ ఐఏఎస్ అధికారి సింఘాల్‌పై చర్యలకు సిఫారసు చేసిన సీబీఐ 'సిట్'... ఆ తీర్మానంపై సంతకం చేసిన వైవీ సుబ్బారెడ్డిని మాత్రం ఎందుకు ఉపేక్షించింది?

వైవీ పీఏ చిన్న అప్పన్న ఖాతాలో కోట్లు పడ్డాయని, కల్తీ నెయ్యి సరఫరాలో ఆయన పాత్ర కీలకమని తేల్చిన 'సిట్'... అసలు సూత్రధారులు, అంతిమ లబ్ధిదారులెవరో ఎందుకు తేల్చలేదు?



వైవీని వదిలేస్తారా!?

సంతకం సుబ్బారెడ్డిది.. శిక్ష సింఘాల్‌కు!

దేవదాయ చట్ట ప్రకారం టీటీడీ బోర్డుకే సర్వాధికారాలు

పాలక మండలి అధ్యక్షుడే సుప్రీం

ఆదేశాల అమలే అధికారుల బాధ్యత

నెయ్యి నిబంధనల సడలింపు నిర్ణయం బోర్డుదే

తీర్మానంపై వైవీ సుబ్బారెడ్డి సంతకం

సడలింపే కల్తీకి మూల కారణమని తేల్చిన సిట్

కానీ.. సంతకం చేసిన వైవీపై చర్యలు ఏవీ?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

దేవదాయ శాఖ చట్టం ప్రకారం టీటీడీకి సంబంధించి, అక్కడ తీసుకునే ప్రతి నిర్ణయానికీ పాలక మండలి అధ్యక్షుడే బాధ్యుడు! అవును.. టీటీడీ వ్యవహారాల్లో పాలకమండలి అధ్యక్షుడే సుప్రీం! ఈ కీలకమైన అంశం సీబీఐ దృష్టికి రాకపోవడం అతిపెద్ద విచిత్రం! కూటమి ప్రభుత్వం కూడా 'సిట్' సిఫారసు మేరకు ఈవో అనిల్ సింఘాల్‌పై బదిలీ వేటు వేసింది. కానీ, అసలు వైవీ సుబ్బారెడ్డి మాటేమిటని

మిగతా 13వ పేజీలో...

"Recommended to approve the proposals without the empanelment clause."

7. Hence, the recommendations of the Purchase Committee are therefore placed before the TTD Board for approval.

Res.No.371, dated 29.02.2020.

Resolved to approve the recommendations of the Purchase Committee. Also expedite such exercise in procurement of other major commodities like cashew, dried grapes, cardamom, B.G. Dhall and put up to Board with the recommendations of Purchase Committee.

Sd/- Y.V. Subba Reddy,
Chairman, TTD Board.

టెండర్ల నిబంధనల సడలింపు సిఫారసులను ఆమోదిస్తూ వైవీ సుబ్బారెడ్డి చేసిన తీర్మానం ఇది.

జగన్ పాపాలకు మరో అధికారి బలి!

నాడు అక్రమాస్తుల కేసుల్లో ఎందరో జైలుకు

నేడు కల్తీ నెయ్యి పాపానికి సింఘాల్‌పై వేటు

కల్తీని అడ్డుకోగలిగీ మౌనమే ఆయన పాపం

13



కల్తీ నెయ్యిలో జగన్ జైలుకే.. వదిలే ప్రసక్తే లేదు

మా వద్ద సిట్ దర్యాప్తును మించిన ఆధారాలు.. వాటితో సుప్రీంలో అప్పీల్

రూ.251 కోట్లకు కక్కుర్తిపడి నెయ్యి లేకుండా అపవిత్ర ప్రసాదాలు

వైవీ, ధర్మారెడ్డి, భూమనదీ కీలక పాత్రే: టీటీడీ సభ్యుడు జ్యోతుల నెహ్రూ



బులియన్ 'బేర్'

మూడు రోజుల్లో వెండి రూ. 1.44 లక్షలు డౌన్

17 % నష్టపోయిన పసిడి ధర

10



రాహుల్ 'చైనా' వ్యాఖ్యలపై రచ్చ

రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో లోక్‌సభలో తీవ్ర గందరగోళం

ఆర్మీ మాజీ చీఫ్ నరవణె పుస్తకంలోని అంశాలను ప్రస్తావించిన ప్రతిపక్ష నేత

రాజ్‌నాథ్, అమిత్‌షా తీవ్ర అభ్యంతరం

అదింకా ప్రచురితం కాలేదని స్పష్టీకరణ

ఆ అంశాల్ని ప్రస్తావించొద్దన్న స్పీకర్

అయినా వినిపించుకోని రాహుల్

అధికార పక్షం ఫైర్.. విపక్షం నిరసన

2

అది నెయ్యే కాదు!

రసాయనాలు, పామాయిల్‌తో లడ్డూలు: డిప్యూటీ సీఎం

కాసుల కక్కుర్తితో నాడు వైసీపీ నేతల అపచారం

ఇప్పుడేమో బొంకుతున్నారు

వారంటే వ్యక్తిగత వైరం లేదు

వాళ్ల భాష, క్రిమినాలిటీతోనే సమస్య

మళ్లీ మేమొస్తే అంటూ బెదిరిస్తున్నారు

11 స్థానాలకు పడిపోయినా.. వాళ్ల ప్రవర్తనలో మార్పు రాలేదు

నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నందుకే ఇవాళ దాడులు

అయితే హింసను ఏ పార్టీ సమర్థించదు

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని చంద్రబాబు కూడా చెబుతున్నారు

జనసేన జనరల్ బాడీ భేటీలో పవన్

అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో తిరుమల లడ్డూ ప్రసాదంలో ఉపయోగించిన నెయ్యి అసలు నెయ్యే కాదని సిట్ తేల్చిందని జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రసాయనాలు, పామాయిల్ ఉపయోగించి తయారుచేసిన మిశ్రమంతో లడ్డూలుచేసి శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాష్ట్ర కమిటీ సభ్యులతో

మిగతా 12వ పేజీలో...



అన్నిటిపైనా నేనే మాట్లాడాలా?

అలాగైతే ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎందుకు: పవన్

ఎమ్మెల్సీ నాగబాబుపైనా సీరియస్



వైసీపీ బాటలో వెళ్లొద్దు

చట్టాన్ని గౌరవించి, సంయమనం పాటించండి

అలజడులు రేపే కుట్రల్లో భాగంగానే వైసీపీ బూతులు

కవ్వింపు చర్యల పట్ల అప్రమత్తంగా ఉండండి

చంద్రబాబు ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పమన్నారు

పార్టీ నేతలతో పల్లా, అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్

రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి 10,134 కోట్లు



గతేడాది కంటే 717 కోట్లు అదనం: రైల్వే మంత్రి

2014 నుంచి ఏపీలో కొత్తగా 1,700 కి.మీ ట్రాక్

3,418 కోట్లతో 73 'అమృత్ స్టేషన్ల' అభివృద్ధి

హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలుతో రాష్ట్రానికి మేలు

అతిపెద్ద ఎకనామిక్ కారిడార్ అవుతుంది

ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్-చెన్నై మధ్య ప్రయాణ సమయం 2.55 గంటలే

ఫాస్ట్ ట్రాక్‌లో విశాఖ రైల్వే జోన్

అపోహలొద్దు.. పనులు వేగంగా జరుగుతున్నాయ్.. గత జోన్లలా 3-4 ఏళ్లు పట్టదు

అతి త్వరలోనే కార్యాలయ నిర్మాణ పనులు

పరిపాలనా భవన నిర్మాణానికీ సన్నాహాలు: వైష్ణవ్



అమరావతి-బెంగళూరు బుల్లెట్ రైలు!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రైల్వేలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం దక్కింది. గతేడాది బడ్జెట్‌లో రాష్ట్రానికి రూ.9,417 కోట్లు ఇవ్వగా.. ఈసారి దానికి అదనంగా రూ.717 కోట్లు కేటాయించింది. ఈ దఫా ఏపీలోని రైల్వే ప్రాజెక్టుల కోసం రికార్డు స్థాయిలో రూ.10,134 కోట్లు కేటాయించినట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. 2009-14 మధ్య ఉమ్మడి రాష్ట్రానికి కలిపి సగటున ఏడాదికి

మిగతా 14వ పేజీలో...

వైద్య సేవ ట్రస్ట్‌లో డేటా చోరీ!

20 వేల మందికి పైగా వైద్యుల సమాచారం బయటకు

ఏపీఎంసీ ఎన్నికల ప్రచారం కోసమే

పోటీలో ఉన్న అభ్యర్థుల చేతికి డేటా

దాని ఆధారంగా 'పర్సనల్' ప్రచారం

ట్రస్ట్ ఉద్యోగుల సహకారంతోనే చౌర్యం

వ్యక్తిగత డేటా చౌర్యంపై వైద్యుల ఆందోళన

3

డా. ఎన్.టి.ఆర్ వైద్యసేవ



ఉద్యోగి ఏకపక్ష తొలగింపు

చట్టవిరుద్ధం

12

సహజ న్యాయసూత్రాల ప్రకారం నోటీసులివ్వాలి

అందుకు విరుద్ధంగా ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవు

ఇంటర్ బోర్డుకు హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులకు సమర్థన

ఉన్నత విద్యలో మళ్లీ 'ఫీజుల కమిటీ'!

కీలక మార్పులకు ప్రభుత్వం చర్యలు

'ఫీజుల నియంత్రణ కమిటీ'గా మారనున్న ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్.. పరిమిత అధికారాలతో నూతన విధానం

పారదర్శకత పెంచే దిశగా మార్పులు

12

చిన్న, మధ్యతరహా వ్యాపారుల కోసం 'పిల్లా ఏఐ'

కొత్త యాప్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

ఇన్వాయిస్, బిల్లింగ్, అకౌంటింగ్ ఇక సులభం

పాక్‌లో రక్తపుటేరులు

- బలోచ్ లిబరేషన్ ఆర్మీ భీకర ఆత్మాహుతి దాడులు
- 200 మంది పాక్ సైనికులు, పోలీసులను చంపినట్లు ప్రకటన
- 177 మంది బలోచ్ తిరుగుబాటుదారులను చంపాం: పాక్


పాక్ సైన్యంపై ఆత్మాహుతి దాడులకు పాల్పడిన బీఎల్ఏ ఆత్మాహుతి దళ సభ్యులు హవా బలోచ్, అసీఫా మెంగల్

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 2: పాకిస్థాన్‌లో రక్తపుటేరులు పారుతున్నాయి. దేశంలోని అతిపెద్ద ప్రావిన్స్ అయిన బలోచిస్థాన్‌లో బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)కి, పాకిస్థాన్ సైన్యానికి మధ్య గత శుక్రవారం నుంచి జరుగుతున్న భీకర పోరాటంలో వందల మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. బలోచిస్థాన్ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న బీఎల్ఏ.. ఏకకాలంలో దాదాపు ఐదు జిల్లాల్లో 'హీరోఫ్-2 పేరుతో భీకర దాడులు చేసింది. తమ దాడిలో 200 మంది పాక్ సైనికులు, పోలీసులు, పారామిలిటరీ సైనికులు చనిపోయినట్లు బీఎల్ఏ ప్రతినిధి జీయండ్ బలోచ్ సోమవారం ప్రకటించారు. గ్వాదర్‌లో సైనిక, పోలీస్ క్యాంపులపై విరుచుకుపడి తీవ్ర నష్టం కలిగించిన ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్ల ఫొటోలను విడుదల చేశారు. వారు హవా బలోచ్, అసీఫా మెంగల్ అని తెలిపారు. మరోవైపు బీఎల్ఏ దాడులను తిప్పికొట్టినట్లు పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. తమ బలగాల దాడిలో ఆదివారం నాటికి 177 మంది తిరుగుబాటుదారులు చనిపోయినట్లు తెలిపింది. బీఎల్ఏను భారతదేశమే హింసకు ప్రేరేపిస్తోందని ఆరోపించింది. ఈ ఆరోపణలను భారత ప్రభుత్వం ఖండించింది. తన అంతర్గత వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు భారత్‌పై నిరాధార ఆరోపణలు చేయటం పాకిస్థాన్‌కు అలవాటేనని విదేశాంగ శాఖ విమర్శించింది. కాగా ఇద్దరు మహిళలతోపాటు 11 మంది తమ ఆత్మాహుతి బాంబర్లు పాక్ సైన్యంపై దాడిచేసినట్లు బీఎల్ఏ ప్రకటించింది. మహిళా ఫిదాయీ హవా బలోచ్ ఆత్మాహుతి దాడికి ముందు పాక్ సైనికులతో పోరాడుతూ, మాట్లాడిన వీడియోను విడుదల చేసింది. మొబైల్‌లో చిత్రీకరించిన ఆ వీడియోలో పాక్ సైనికులు తమను ఎదుర్కోలేక తోక ముడిచారని ఆమె నవ్వుతూ చెప్పటం కనిపిస్తోంది.

సింధు జలాలపై తగ్గేదే లేదు : భారత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: సింధు నది జలాల విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గేది లేదని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కోర్టుకు భారత్ స్పష్టం చేసింది. సింధు జలాల ఒప్పందం నిలిపివేతపై ఇప్పటికే స్వతంత్ర నిపుణుడితో పరిశీలన ప్రక్రియ కొనసాగుతుండగా ఆర్బిట్రేషన్ కోర్టు విచారణ కోరడం పాకిస్థాన్ చేసిన 'ఫోరం షాపింగ్' కిందకే వస్తుందని స్పష్టం చేసింది. ఈ అంశంలో ఆర్బిట్రేషన్ కోర్టు విచారణను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోబోమని పేర్కొంది. 'క్షేత్రస్థాయిలో వాస్తవాలకు అతీతంగా ఒప్పందాలు కొనసాగవు' అని తేల్చిచెప్పింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌తో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టుగా భారత్ ప్రకటించిన విషయం తెలిసిందే. భారత్ నుంచి దిగువకు పారే సింధు నది, దాని ఉప నదుల నీరే పాకిస్థాన్‌లో 80శాతానికిపైగా వ్యవసాయానికి ఆధారం. ఈ క్రమంలో భారత్ ఏకపక్షంగా సింధు ఒప్పందాన్ని నిలిపివేసిందంటూ.. నెదర్లాండ్స్‌లోని హేగ్‌లో ఉన్న అంతర్జాతీయ న్యాయస్థానంలో పాకిస్థాన్ పిటిషన్ వేసింది. దానిపై ఏర్పాటైన ఆర్బిట్రేషన్ కోర్టు.. సింధు, దాని ఉప నదులపై ఉన్న మూడు జల విద్యుత్ కేంద్రాల్లో నీటి వినియోగానికి సంబంధించిన లాగ్ బుక్స్‌ను అందజేయాలని భారత్‌ను కోరింది. ఫిబ్రవరి 2, 3 తేదీల్లో వాదనలు కొనసాగిస్తామని పేర్కొంది. కానీ భారత్ ఆ ఆదేశాలను పట్టించుకోలేదు. ఎలాంటి స్పందనా తెలియజేయలేదు. దీనితో పాకిస్థాన్ వాదనలను విని నిర్ణయం తీసుకుంటామని ఆర్బిట్రేషన్ కోర్టు ప్రకటించింది.

ప్రసంగాలతో యువతను రెచ్చగొట్టారు

- అందుకే ముందస్తు అరెస్టు
- సోనమ్ వాంగ్‌చుక్ బెయిల్ విచారణపై సుప్రీంలో కేంద్రం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు, శాస్త్రవేత్త సోనమ్ వాంగ్‌చుక్ లద్దాఖ్ యువతను తన ఉపన్యాసాలతో రెచ్చగొట్టి.. ఆ ప్రాంతంలో నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక తరహా పరిస్థితులు సృష్టించాలనుకున్నారని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. సోనమ్ చర్యలు దేశ భద్రతకు విఘాతం కలిగిస్తాయని తెలిపింది. గతేడాది సెప్టెంబరులో లద్దాఖ్‌లో జరిగిన హింసాకాండ తర్వాత జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద సోనమ్‌ను పోలీసులు అరెస్టు చేసి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. ఎన్ఎస్ఏ కింద ఏడాది పాటు విచారణ లేకుండా జైలులో నిర్బంధించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, సోనమ్‌కు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన భార్య గీతాంజలి అంగ్మో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ప్రసన్న వరాలే సోమవారం విచారణ జరిపారు. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. పాకిస్థాన్, చైనా సరిహద్దుల్లో ఉన్న లద్దాఖ్ వంటి సున్నిత ప్రాంతంలో యువతను రెచ్చగొట్టేలా సోనమ్ ప్రసంగాలు చేయటం ప్రమాదకరమన్నారు. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకల్లో యువత తిరుగుబాటు చేసి రాజకీయ అస్థిరతను సృష్టించినట్లుగా ఉద్యమించాలంటూ లద్దాఖ్ యువతను సోనమ్ రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారన్నారు. సోనమ్ ప్రసంగాల వీడియోలను చూశాకే ఆయన ముందస్తు అరెస్టుకు.. స్థానిక కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. తుషార్ మెహతా వాదనలను వ్యతిరేకిస్తూ గీతాంజలి తరఫున సీనియర్ న్యాయవాది కపిల్‌సిబల్ వాదనలు వినిపిస్తూ ఊహలతో కూడిన ఆరోపణలతో అరెస్టు చేశారన్నారు. ఇది పూర్తిగా అధికార దుర్వినియోగమని పేర్కొన్నారు.

అజిత్ పవార్ మృతిపై అనుమానాలు

- శివసేన యూబీటీ నేత సంజయ్ రౌత్

ముంబై, ఫిబ్రవరి 2: అవిభక్త శివసేనతో కలిసి 1995-99 మధ్య అధికారాన్ని పంచుకున్న బీజేపీ కుంభకోణాల చిట్టా తన వద్ద ఉందని ప్రకటించిన మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మృతిపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఆయన మృతి తర్వాత జరిగిన ఘటనల్లో ఏదో రహస్యం దాగి ఉందని ముంబైలో మీడియాకు చెప్పారు. గత నెల 15న జరిగిన రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార సభలో 1995-99 మధ్య బీజేపీ అవినీతిపై తన వద్ద చిట్టా ఉందని అజిత్ పవార్ చెప్పిన కొద్ది రోజులకే విమాన ప్రమాదంలో మరణించారని సంజయ్ రౌత్ గుర్తు చేశారు. జనవరి 28న ఎన్నికల ప్రచారం కోసం ముంబై నుంచి బారామతికి బయలు దేరిన అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. అజిత్‌ది ప్రమాదమేనని, రాజకీయాల్లేవని ఎన్సీపీ-ఎస్పీ అధినేత శరద్ పవార్ చెప్పినా.. ఈ ఘటనను కొట్టి పారేయలేమన్నారు.

ఒరాకిల్‌లో 30,000 ఉద్యోగాలు కోత!

- ఏఐ డేటా సెంటర్ల విస్తరణకు నిధుల వేట

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: ఏఐ రంగంలో అగ్రగామిగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్న ప్రముఖ టెక్ సంస్థ ఒరాకిల్ మరోసారి భారీ స్థాయిలో ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఏఐ డేటా సెంటర్ల విస్తరణకు భారీగా నిధులు సమీకరించుకునే ప్రయత్నాల్లో ఉన్న ఒరాకిల్ దాదాపు 30వేల మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించినట్టు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ టీడీ కోవెన్ నివేదిక ప్రకారం ఒరాకిల్.. ఏఐ మౌలిక సదుపాయాల కల్పన కోసం సుమారు రూ.14.27 లక్షల కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఈ స్థాయిలో అప్పులు ఇవ్వడానికి అమెరికాలోని బ్యాంకులు వెనుకడుగు వేస్తుండడంతో ఆ సంస్థ తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో లేఆఫ్స్ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. సుమారు 20,000 నుంచి 30,000 వేల మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించినట్టు తెలిసింది. లేఆఫ్స్‌తో ఒరాకిల్‌కు రూ.73వేల కోట్లు నుంచి రూ.91వేల కోట్ల వరకూ ఖర్చు తగ్గే అవకాశం ఉందని టీడీ కోవెన్ నివేదిక అంచనా వేసింది. కాగా, నిధుల సమీకరణ కోసం ఒరాకిల్... హెల్త్‌కేర్ ఐటీ కంపెనీ 'సెర్నర్'ను కూడా విక్రయించే ఆలోచనలో ఉంది.


రాహుల్ చైనా వ్యాఖ్యలపై రచ్చ

రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో లోక్‌సభలో తీవ్ర గందరగోళం

- ఆర్మీ మాజీ చీఫ్ నరవణె పుస్తకంలోని అంశాలను ప్రస్తావించిన ప్రతిపక్ష నేత
- రాజ్‌నాథ్, అమిత్‌షా తీవ్ర అభ్యంతరం


లోక్‌సభలో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం లోక్‌సభలో చర్చ సందర్భంగా తీవ్ర గందరగోళం చెలరేగింది. 2020లో భారత్-చైనా సంక్షోభానికి సంబంధించి భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రాసిన పుస్తకంలోని అంశాలను ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రస్తావించడంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అధికార, విపక్షాల నడుమ వాగ్యుద్ధం, గందరగోళం నడుమ సభ మంగళవారానికి వాయిదాపడింది. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ దేశభక్తిని ప్రశ్నిస్తూ తీవ్రంగా విమర్శించారు. తర్వాత మాట్లాడిన రాహుల్.. తొలుత ఆయన విమర్శలకు స్పందిస్తానంటూ భారత్-చైనా సంక్షోభంపై జనరల్ నరవణె తన పుస్తకంలో పేర్కొన్న స్మృతులను ప్రస్తావించేందుకు ప్రయత్నించారు. మంత్రి రాజ్‌నాథ్ అభ్యంతరం తెలిపారు. ఆ పుస్తకం ప్రచురితమైందో లేదో రాహుల్ స్పష్టత ఇవ్వాలన్నారు. అయితే చైనా ట్యాంకులు అన్న పదాన్ని విపక్ష నేత పదే పదే లేవనెత్తాలని చూడడంతో సభలోని ప్రతి బీజేపీ నేతా తీవ్రస్థాయిలో నిరసన తెలిపారు. ఆ పుస్తకం అధికారికం కాదని.. ఇంతవరకు ప్రచురణకే నోచుకోలేదని.. దానిలోని అంశాలను సభలో ఎలా ప్రస్తావిస్తారని రాజ్‌నాథ్ నిలదీశారు. సైనిక దళాల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆ సమయంలో సభలో ప్రధాని మోదీ కూడా ఉన్నారు. ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను ఆయన ఎలా ప్రస్తావిస్తారని అమిత్‌షా నిలదీశారు. తన మాటలకు వారు భయపడకపోతే ఎందుకు మాట్లాడనివ్వడం లేదని రాహుల్ ప్రశ్నించారు. తాను చదివేది నూరు శాతం అధికారికమన్నారు. సభ కార్యకలాపాలతో సంబంధం లేని పుస్తకం లేదా దినపత్రిక క్లిప్పింగ్‌లలోని అంశాలను ప్రస్తావించడానికి వీల్లేదని స్పీకర్ ఓం బిర్లా రూ లింగ్ ఇచ్చారు. అయితే తాను చదువుతున్నది అధికారికమైనదేనని, దాని నుంచి కోట్ చేస్తానని రాహు ల్ స్పష్టంచేశారు. ఆ పుస్తకాన్ని ప్రచురించలేదని.. అందు చేత దానిని ప్రస్తావించడానికి వీల్లేదని రాజ్‌నాథ్ పునరుద్ఘాటించారు. జనరల్ నరవణె రాసిన పుస్తకాన్ని ప్రచురించడానికి ప్రభుత్వం అనుమతించడం లేదని రాహుల్ ఆరోపించారు. తన వైఖరిని తెలియజేసేందుకు వేరే మ్యాగజైన్ వ్యాసంలోని అంశాలను ప్రస్తావిస్తున్నానని చెప్పారు. దీనిని కూడా స్పీకర్ అనుమతించలేదు. రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. రాహుల్ ఆరోపిస్తున్నట్లు ప్రభుత్వం గనుక ఆ పుస్తకం ప్రచురణను అంగీకరించనట్లయితే జనరల్ నరవణె కోర్టుకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. సభను ఆయన తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. సభాపతి రూలింగ్ ఇచ్చిన తర్వాత కూడా విపక్ష నేత దానిని ఉల్లంఘిస్తున్నారని మంత్రి రిజిజు ఆక్షేపించారు. ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంలోని అంశాలను ప్రస్తావించొద్దని ఓం బిర్లా పలు సార్లు హెచ్చరించినా రాహుల్ వినిపించుకోలేదు. రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడడం ఆయనకు ఇష్టం లేకపోతే తదుపరి వక్తగా ఉన్న ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు అవకాశమిస్తానని సభాపతి స్పష్టంచేశారు. అఖిలేశ్, టీఎంసీ నేత కల్యాణ్ బెనర్జీ తదితరులు రాహుల్‌కు మద్దతిచ్చారు. అటు విపక్షం, ఇటు అధికార పక్ష సభ్యులు పరస్పరం నినాదాలకు దిగడంతో స్పీకర్ తొలుత మధ్యాహ్నం 3 గంటల వరకు ఒకసారి.. 4గంటల వరకు రెండోసారి సభను వాయిదావేశారు. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు లేదు. చివరకు సభ మంగళవారానికి వాయిదాపడింది.



కారవాన్ మ్యాగజైన్‌లో నరవణె అముద్రిత పుస్తకంపై వచ్చిన కవర్ స్టోరీ.. లోక్ సభలో రాహుల్ ప్రస్తావించింది దీని గురించే..


నన్ను మాట్లాడనివ్వడం లేదు: రాహుల్

జనరల్ నరవణె పుస్తకంలోని అంశాలను సభలో తనను లేవనెత్తనివ్వడం లేదని, తనను మాట్లాడనివ్వడంలేదని రాహుల్ ఆరోపించారు. చైనాతో సంక్షోభానికి సంబంధించి ప్రధాని మోదీని, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌ను జనరల్ అందులో తప్పుబట్టారని పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులకు తెలిపారు. ఆయన అభిప్రాయాలు ఓ వ్యాసంలో వచ్చాయని.. వాటినే తాను ప్రస్తావించానని చెప్పారు. అది బయటకు వస్తే వారిద్దరి బండారం బయటపడుతుందని.. అందుకే తాను ప్రస్తావించిన వాక్యాలు అధికార పక్షాన్ని భయపెడుతున్నాయన్నారు. జనరల్ నరవణె రాసిన పుస్తకం ప్రచురణకు నోచుకోకుండా మగ్గిపోతోందన్నారు. రాహుల్‌ను ఆయన సోదరి, ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా గట్టిగా సమర్థించారు. ఆయన మన సైన్యం ప్రతిష్ఠను దెబ్బతీయడం లేదని.. ఆర్మీ చీఫ్ పుస్తకం నుంచే ప్రస్తావిస్తున్నారని.. తాము దాచదలచుకున్న అంశాలు బయటకు వచ్చినప్పుడల్లా బీజేపీ నేతలు ఇలాగే చేస్తుంటారని ధ్వజమెత్తారు.

స్పీకర్ ముందస్తు అనుమతితోనే..:

పుస్తకాలు, మ్యాగజైన్లు, పత్రికల్లోని అంశాలను ప్రస్తావించడంపై పార్లమెంటు నిబంధనల్లో నిషేధం లేదని పార్లమెంటరీ నిపుణులు స్పష్టం చేశారు. అయితే ప్రచురితమైన వాటిలోని అంశాలను స్పీకర్ అనుమతితో ప్రస్తావించవచ్చని.. అయితే ఆయనకు ముందస్తు నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని రాజ్యసభ మాజీ సెక్రటరీ జనరల్ వీకే అగ్నిహోత్రి తెలిపారు. 'లోక్‌సభలోని 349(1) నిబంధన ఏం చెబుతోందంటే.. సభ సమావేశమైనప్పుడు.. సభ కార్యకలాపాలతో సంబంధం ఉంటే తప్ప ఏ పుస్తకం, దినపత్రిక, లేఖను కూడా చదవరాదు. స్పీకర్ అనుమతించినా.. తాను చదివే సమాచారం ధ్రువీకరణ గురించి ఆ సభ్యుడిని ప్రశ్నించవచ్చు. ప్రచురించని పుస్తకంలోని అంశాలను ప్రస్తావించాలని రాహుల్ ప్రయత్నించారు' అని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.


లోకం తీరు



రాజ్యసభలో నాటకీయ దృశ్యం

కృత్రిమ కాళ్లను డెస్క్‌పై పెట్టిన నామినేటెడ్ సభ్యుడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: రాజ్యసభలో సోమవారం నాటకీయ దృశ్యం చోటు చేసుకుంది. కేరళ నుంచి నామినేటెడ్ సభ్యుడిగా నియమితులైన బీజేపీ సభ్యుడు సి.సదానందన్ మాస్టార్ తన కృత్రిమ కాళ్లను డెస్కుపై పెట్టడం చర్చనీయాంశంగా మారింది. బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకొని ఆయన సభలో ప్రప్రథమ ప్రసంగం చేశారు. 'ప్రజాస్వామ్యం అంటూ ఘర్జనలు చేస్తున్న కొందరు 31 ఏళ్ల క్రితం 1994లో నాపై దాడి చేశారు. ఇంటికి వెళ్తున్నప్పుడు కొందరు క్రిమినల్స్ నా కాళ్లను నరి



కేసి ఇంక్విలాబ్ జిందాబాద్ అని నినాదాలు చేశారు' అని చెప్పారు. కృత్రిమ కాళ్లను డెస్కుపై పెట్టడంతో తొలి ప్రసంగాన్ని కూర్చొని చేయాల్సి వచ్చిందని అన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఏమిటో ప్రజల ముందు ఉంచడానికే ఇలా చేసినట్టే తెలిపారు. డెస్కుపై కృత్రిమ కాళ్ల పెట్టడంపై సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు కూడా నిరసన తెలిపాయి. సభలో ఎలాంటి వస్తువులను ప్రదర్శించడాన్ని నిషేధించారని, అలాంటప్పుడు కృత్రిమ కాళ్లను డెస్కుపై పెట్టడానికి ఎలా అనుమతి ఇస్తారని చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి బ్రిట్టాస్ ప్రశ్నించారు. ఆయన ఇప్పటికే చాలాసార్లు కృత్రిమ కాళ్లతో సభకు వచ్చారని, ఇప్పుడు డెస్కుపై పెట్టడం ఏమిటని అడిగారు. దాంతో ఆ సభ్యుడు వాటిని తీసివేశారు.

మళ్లీ భయపెట్టిన బోయింగ్!

- ఏఐ విమానంలో సాంకేతిక సమస్య
- ఇంజన్ ఫ్యూయెల్ కంట్రోల్ స్విచ్ విఫలం
- బయలుదేరే ముందు గుర్తించిన పైలట్
- లండన్-బెంగళూరు విమానం రద్దు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: అహ్మదాబాద్ విమాన ప్రమాదాన్ని మరువకముందే.. ఎయిరిండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమానం మళ్లీ భయపెట్టింది.! లండన్ నుంచి బెంగళూరుకు రావాల్సిన ఈ విమానంలో ఇంజన్ ఇంధన నియంత్రణ స్విచ్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. అయితే విమానం బయల్దేరే ముందే దీన్ని గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది. ఎయిరిండియా (ఏఐ 132) విమానం లండన్‌లోని హీత్రూ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బెంగళూరుకు రావాల్సి ఉంది. అయితే అక్కడ బయల్దేరే ముందు ఇంజన్ స్టార్ట్ చేస్తున్న సమయంలో ఫ్యూయెల్ కంట్రోల్ స్విచ్ విఫలమైనట్టు పైలట్ గుర్తించారు. ఎడమవైపు ఉన్న స్విచ్ ఆటోమ్యాటిక్‌గా కటాఫ్ పొజిషన్‌కు మారటాన్ని గమనిం చి వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో తమ బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ వి మానాన్ని నిలిపివేసినట్టు ఎయిరిండియా సోమవారం ప్రకటించింది. అనంతరం ఈ విషయాన్ని పౌర విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏకు తెలియజేసింది.

అహ్మదాబాద్ ప్రమాదానికి ఇదే కారణం..

గత ఏడాది జూలైలో అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా బోయింగ్ విమాన ప్రమాదం కూడా ఫ్యూయెల్ కంట్రోల్ స్విచ్ వైఫల్యం వల్లే సంభవించినట్టు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. విమానం టేకాఫ్ అయిన కొద్ది సెకన్లలోనే ఈ స్విచ్ రన్ మోడ్ నుంచి కటాఫ్ మోడ్‌లోకి మారినట్టు గుర్తించారు. తాజాగా లండన్-బెంగళూరు విమానంలోనూ ఈ సమస్యే తలెత్తింది. విమానం బయల్దేరక ముందే సమస్యను గుర్తించడంతో పెను ప్రమాదం తప్పింది.

సుంకాలు తగ్గాయ్

(మొదటి పేజీ తరువాయి)



రాయబారి సెర్గియో గోర్ సోమవారం రాత్రి జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌పై సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గించినట్టుగా వెల్లడించారు. మరోవైపు సుంకాల తగ్గింపుపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. 18శాతానికి సుంకాలను తగ్గించడంపై ట్రంప్‌కు 140 కోట్ల మంది భారతీయుల తరఫున కృతజ్ఞతలు చెబుతున్నట్టు ప్రకటించారు. అయితే రష్యా చమురు కొనుగోళ్ల నిలిపివేత తదితర అంశాలు వేటినీ మోదీ ప్రస్తావించలేదు. అమెరికా ఉత్పత్తుల దిగుమతులపై భారత్ భారీగా సుంకాలు విధిస్తోందంటూ గతేడాది జూలైలో 25శాతం ప్రతీకార సుంకాలు విధించిన ట్రంప్.. తర్వాత రష్యా నుంచి వద్దన్న చమురు కొంటోందంటూ ఆగస్టులో సుంకాలను 50శాతానికి పెంచిన విషయం తెలిసిందే.

మోదీతో ఫోన్‌లో ట్రంప్ చర్చలు

సోమవారం ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడారు. భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ 'ఎక్స్'లో తొలుత ఈ విషయాన్ని వెల్లడించారు. తర్వాత ట్రంప్ ట్రూత్ సోషల్‌లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. "నా గొప్ప స్నేహితుల్లో ఒకరు, శక్తివంతమైన నేత ప్రధాని మోదీతో మాట్లాడాను. వాణిజ్యం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడం సహా చాలా అంశాలపై చర్చించాం. రష్యా చమురు కొనుగోళ్లు నిలిపివేసేందుకు.. అమెరికా నుంచి, ముఖ్యంగా వెనెజువెలా నుంచి భారీగా చమురు కొనుగోలు చేసేందుకు మోదీ అంగీకరించారు. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపేందుకు ఇది తోడ్పడుతుంది. మిత్రుడు మోదీ విజ్ఞప్తి మేరకు, ఆయనపై గౌరవంతో.. యూఎస్-భారత్ వాణిజ్య ఒప్పందానికి అంగీకరించాం. ఇది వెంటనే అమల్లోకి వస్తుంది. భారత్‌పై అమెరికా ప్రతీకార సుంకాలను 25శాతం నుంచి 18శాతానికి తగ్గిస్తున్నాం. బదులుగా అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలను క్రమంగా సున్నాకు తగ్గిస్తుంది. వాణిజ్య అడ్డంకులను తొలగిస్తుంది. రూ.45.5 లక్షల కోట్ల (500 బిలియన్ డాలర్ల) విలువైన అమెరికా చమురు, బొగ్గు, సాంకేతిక, వ్యవసాయ, ఇతర ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుంది. దీనికి అదనంగా వీలైనంత ఎక్కువగా అమెరికా ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి కట్టుబడి ఉంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. భారత్‌తో మా బంధం మరింత బలోపేతం అవుతుంది. ప్రధాని మోదీ, నేను ఇద్దరం గొప్ప పనులు పూర్తి చేశాం" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మూడు రోజుల పర్యటన కోసం సోమవారం వాషింగ్టన్‌కు చేరుకున్నారు. అరుదైన ఖనిజాల సరఫరాకు సంబంధించిన సమావేశంలో పాల్గొననున్నారు.

ఇండియా గేట్ బాగుంటుంది..

భారతీయ సైనిక అమరులకు గుర్తుగా ఢిల్లీలో ఠీవిగా నిలబడిన 'ఇండియా గేట్'పై ట్రంప్ కన్ను పడింది. అలాంటిది తమకూ కావాలని అనిపించింది. ట్రంప్ స్వయంగా దీనిపై ట్రూత్ సోషల్‌లో ఇండియా గేట్ ఫొటోతో పోస్టు పెట్టారు. "ఇది భారత్ విజయ ద్వారం. మేం కట్టబోయేది ఇలాంటి వాటన్నింటికన్నా గొప్పగా ఉంటుంది" అని పేర్కొన్నారు. తర్వాత ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచంలో చాలా నగరాలకు విజయ ద్వారాలు ఉన్నాయని.. గొప్ప దేశమైన అమెరికాలోని వాషింగ్టన్‌లో మాత్రం లేదని పేర్కొన్నారు. పారిస్‌లోని 'ఆర్క్ డె ట్రయంఫ్' తరహాలో ప్రపంచంలోనే గొప్పగా, అందంగా వాషింగ్టన్‌లో విజయ ద్వారాన్ని నిర్మిస్తామని చెప్పారు.

మోదీ ఆత్మ నిర్భరత కాదు ట్రంప్ నిర్భరత: కాంగ్రెస్

భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదట ప్రకటించడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ సెటైర్లు వేశారు. "ఆపరేషన్ సిందూర్ ఆగినప్పుడు, రష్య చమురు కొనుగోళ్లకు సంబంధించి.. ఇప్పుడు వాణిజ్య ఒప్పందాన్ని అమెరికా నుంచి ట్రంపే మొదట ప్రకటించారు. ట్రంప్‌తో మోదీ మాట్లాడిన విషయాన్ని కూడా అమెరికా రాయబారి ప్రకటించారు. మోదీ ప్రభుత్వ నిర్ణయాలను మన ప్రభుత్వం నుంచి కాకుండా.. అమెరికా అధ్యక్షుడి నుంచి భారత ప్రజలు తెలుసుకుంటున్నారు. మోదీ పూర్తిగా ట్రంప్‌కు లొంగిపోయారు. మోదీ ఆత్మ నిర్భరత కాదు.. ట్రంప్ నిర్భరత" అని విమర్శించారు.

దలైలామాకు 'గ్రామీ' పురస్కారం.. మండిపడ్డ చైనా

- వేర్పాటువాదానికి వేదికగా మార్చొద్దంటూ హెచ్చరిక



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: టిబెట్ బౌద్ధ మత గురువు దలైలామా మరో అరుదైన మైలురాయిని అధిగమించారు. తన 90వ ఏట.. సంగీత ప్రపంచంలో అత్యున్నత పురస్కారంగా భావించే ప్రతిష్ఠాత్మక గ్రామీ అవార్డును కైవసం చేసుకున్నారు. 'మెడిటేషన్' అనే ఆల్బమ్‌కు గాను 'బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్' విభాగంలో ఆయనను ఈ అవార్డు వరించింది. కాలిఫోర్నియా వేదికగా ఆదివారం జరిగిన 68వ గ్రామీ అవార్డుల వేడుకల్లో ఈ ప్రకటన వెలువడింది. హిందుస్థానీ సంగీతం మేళవింపుతో కరుణ, మానసిక ప్రశాంతతపై ఆయన అందించిన సందేశాల సమాహారంగా ఈ ఆడియో రూపొందింది. ఈ అవార్డు తన వ్యక్తిగత విజయం కాదంటూ దలైలామా సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, ప్రేమ, మానవతా సందేశాలను మరింత విస్తరింపజేసే అవకాశంగా భావిస్తున్నానని తెలిపారు. అయితే, దలైలామాకు ఈ గౌరవం దక్కడంపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సోమవారం ఆ దేశ విదేశాంగ శాఖ స్పందిస్తూ.. గ్రామీ వంటి అంతర్జాతీయ వేదికలను ఓ వేర్పాటువాదిని కీర్తించడానికి ఉపయోగించడం సరికాదని అభిప్రాయపడింది.

హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్ల షెడ్యూల్ విడుదల

మార్చి 4 నుంచి 19 వరకు గడువు

- 31న ఎంపిక జాబితా ప్రకటన
- రిజిస్ట్రేషన్‌కు 215 డాలర్లు
- ఎంపికైతే లక్ష డాలర్లు చెల్లించాల్సిందే

వాషింగ్టన్, ఫిబ్రవరి 2: అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) 2027 ఆర్థిక సంవత్సరానికి హెచ్-1బీ వీసా రిజిస్ట్రేషన్ల షెడ్యూల్‌ను శనివారం ప్రకటించింది. ఈ వీసా కోటా కింద రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మార్చి 4న ప్రారంభమవుతుందని, 19తో ముగుస్తుందని పేర్కొంది. దరఖాస్తుదారు యూఎస్‌సీఐఎస్ ఆన్‌లైన్ ఖాతాలో రిజిస్టర్ చేసుకొని 215 డాలర్లు సుమారు రూ.18,000 ప్రాథమిక రుసుము కింద చెల్లించాలి. 19వ తేదీ గడువు ముగిసిన తరువాత మార్చి 31 నాటికి ఎంపికైన వారికి ఈమెయిల్స్ ద్వారా తెలియజేస్తారు. ఈ వీసా కోసం తప్పనిసరిగా యూఎస్‌సీఐఎస్ ఆన్‌లైన్ ఖాతా ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఖాతా లేని కంపెనీలు తప్పనిసరిగా అకౌంట్‌ను తెరవాల్సి ఉంటుంది. దరఖాస్తులను ముందుగానే పూర్తి చేసి ఉంచుకోవచ్చు. అయితే రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రం మార్చి 4 నుంచి మాత్రమే చేయాలి. 'కొత్త నిబంధనల ప్రకారం అత్యధిక నైపుణ్యం కలిగిన, ఎక్కువ జీతం తీసుకునే వారికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. దీనివల్ల అమెరికా పౌరుల ఉద్యోగిత హక్కుకు రక్షణ ఉంటుంది' అని యూఎస్‌సీఐఎస్ పేర్కొంది. మొదటి దశలో ఎంపికయిన వారికి హెచ్-1బీ పిటిషన్ దాఖలు చేసేటపుడు అర్హత ఉన్న కంపెనీలు లక్ష డాలర్లు సుమారు రూ.84 లక్షలు ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది.



ఏలూరు జాతరకు పోటెత్తిన భక్తజనం

ఏలూరు నగరం పడమరవీధిలో జరుగుతున్న ఆదిమహాలక్ష్మి, గంగానమ్మ, వినుకొండ అంకమ్మ, పోతురాజుబాబుల జాతర సోమవారం ఘనంగా ముగిసింది. కొర్లబండిలో అమ్మవార్లను ఉంచి ఆశేషంగా హాజరైన భక్తుల నడుమ ఊరి పొలి మేరల వరకు సాగనంపడంతో జాతర ముగిసింది. ఈ సందర్భంగా విచిత్ర వేషాలు, కళాకారుల అభినయాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

- ఆంధ్రజ్యోతి, ఏలూరు కార్పొరేషన్



జాతరలో ఎమ్మెల్యే సతీమణి, కుమారుడి భిక్షాటన

అనపర్తి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి మహాలక్ష్మి, కుమారుడు టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి సోమవారం కొప్పవరం కర్రి వారి సత్తెమ్మ తల్లి జాతరలో భిక్షాటన చేశారు. అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. రెండేళ్లకో సారి జరిగే ఈ జాతరలో అమ్మవారిని కోరిన కోరికలు తీరిన భక్తులు.. తిరిగి రెండేళ్లకు జరిగే జాతరలో ఏదో ఒక వేషం ధరించి భిక్షాటన చేసి.. అమ్మకు సమర్పించి మొక్కు చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో జరిగిన జాతరలో ఎమ్మెల్యేగా గెలుపొందిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోసం ఆయన కుటుంబం మొక్కుకున్న మొక్కు చెల్లించారు. ఎమ్మెల్యే కుమారుడు మనోజ్‌రెడ్డి అరబ్ షేక్ వేషధారణలో భిక్షాటన చేసి మొక్కు చెల్లించుకున్నారు.

డాక్టర్ నరేష్‌బాబుకు రెండు జాతీయ అవార్డులు

» ఏఎస్ఎస్ఐ రిసెర్చ్, క్లినికల్ అవార్డులు కైవసం



రీసెర్చ్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేష్‌బాబు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పుణేలో జరిగిన అసోసియేషన్ ఆఫ్ స్పైన్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఎస్ఐ) జాతీయ సదస్సులో గుంటూరుకు చెందిన మల్లిక స్పైన్ సెంటర్ అధినేత డాక్టర్ జె.నరేష్‌బాబు అరుదైన ఘనత సాధించారు. ఎంఆర్ఐ స్కానింగ్‌లో గుర్తించలేని నడుము డిస్క్‌ల అరుగుదలను రేడియోమిక్స్ అనే ఏఐ ద్వారా ముందుగానే గుర్తించే వైద్య పరిశోధన చేసినందుకు ప్రతిష్టాత్మకమైన ఏఎస్ఎస్ఐ బేసిక్ రీసెర్చ్ అవార్డ్ 2026ను ఆయన అందుకున్నారు. బేసిక్ స్పైన్ రీసెర్చ్ అవార్డుతో పాటు ఏఎస్ఎస్ఐ క్లినికల్ రీసెర్చ్ అవార్డునూ డాక్టర్ నరేష్‌బాబు సాధించారు.

5న ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాలుగో మహాసభలు

» స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసిన ప్రభుత్వానికి నేతల కృతజ్ఞతలు



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు

విజయవాడ (గాంధీనగర్), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న ఏపీ జేఏసీ అమరావతి నాలుగవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జేఏసీ నేతలు ఉద్యోగ, పెన్షనర్లకు పిలుపునిచ్చారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో మహాసభల పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడారు. ఉదయం 9 గంటలకు లెనిన్ సెంటర్ నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలో జేఏసీ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘ సభ్యులైన మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వెల్లడించారు. 2017లో తిరుపతిలో 17 శాఖల ఉద్యోగ సంఘాలతో ఆవిర్భవించిన జేఏసీ ప్రస్తుతం 96 శాఖల సంఘాలతో రాష్ట్రంలోనే అతిపెద్ద జేఏసీగా ఎదిగిందని తెలిపారు. ఈ మహాసభలకు హాజరయ్యేందుకు వీలుగా ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసిన ప్రభుత్వానికి నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రముఖ రచయిత వీవీబీ మృతి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత, కవి, అనువాదకుడు వీవీబీ రామారావు మరణించారు. విజయనగరానికి చెందిన వీవీబీ రామారావు మహారాజా కాలేజీలో మూడు దశాబ్దాలకు పైగా ఆంగ్ల విభాగానికి అధిపతిగా ఉన్నారు. కొడవటిగంటి కుటుంబరావు చదువు, ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి, విశ్వనాథ రామాయణ కల్పవృక్షంలోని సుందరకాండ తదితర గ్రంథాలను ఇంగ్లీషులోకి అనువదించారు. వీవీబీ దాదాపు 200 మంది ఆధునిక కవుల కవితలను ఇంగ్లీషులోకి అనువదించి రెండు సంపుటాలుగా వెలువరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ కోసం ఉన్నవ మోనోగ్రాఫ్‌తోపాటు పలు రచనలు చేసిన వీవీబీ ఆనంద గజపతి రాజు ఆత్మకథను కూడా రచించారు. స్వయంగా పలు నవలలు, కథలు, కవితలు రాశారు. ఆయన భౌతిక కాయానికి సోమవారం ఢిల్లీలో అంత్యక్రియలు జరిగాయి. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

రాష్ట్రంలో సీ ప్లేన్ కార్యకలాపాల అభివృద్ధి: కేంద్ర సహాయ మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఉడాన్ 5.5 పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో సీ ప్లేన్ కార్యకలాపాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు పౌరవిమానయాన సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. సోమవారం ఎంపీ బీద మస్తాన్ రావు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఇందుకోసం 10 జలాశయాలను గుర్తించినట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సీ ప్లేన్ ఆపరేషన్ల కోసం ఏరోడ్రోమ్‌ల అభివృద్ధి చేస్తుందని, విమానాశ్రయాలు, హెలిపోర్టులు, నీటి ఏరోడ్రోమ్‌ల అభివృద్ధి పథకం కింద ఇందుకు నిధులు కేటాయించడం జరుగుతుందని వెల్లడించారు.

గనులపై సీఎస్ నేతృత్వంలో కమిటీ

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త గనుల అన్వేషణ, కొత్తగా ఖనిజాల తవ్వకం లీజుల వేలం తదితర అంశాల పర్యవేక్షణ, సమన్వయం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) నేతృత్వంలో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గనుల వేలం ప్రక్రియను వేగవంతం చేయడానికి అవసరమైన అన్ని రకాల అనుమతులను సాధించేందుకు ఈ కమిటీ పనిచేయనుందని సీఎస్ కె.విజయానంద్ సోమవారం విడుదల చేసిన ఉత్తర్వు(జీవో 21)ల్లో పేర్కొన్నారు. కమిటీలో అటవీ, పర్యావరణ, రెవెన్యూ, గనుల శాఖల ముఖ్యకార్యదర్శులు, కాలుష్యనియంత్రణ మండలి అధికారులు సభ్యులుగా ఉంటారు. కమిటీకి సభ్య కన్వీనర్‌గా గనుల శాఖ డైరెక్టర్ ఉంటారు. ప్రతినెలా కమిటీ సమావేశమై లీజుల వేలం ప్రక్రియలో పురోగతిని సమీక్షిస్తుంది.

5న సాగునీటి సంఘాలతో సీఎం భేటీ

అమరావతి, తుళ్లూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అమరావతి పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల ఐదో తేదీన రాష్ట్ర సాగునీటి సంఘాల సమాఖ్యతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. రాష్ట్రంలోని సాగునీటి సంఘాల చైర్మన్లు, డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్, నీటి సంఘాల సభ్యులతో ఈ సమావేశం ఉంటుంది. నీటి యాజమాన్యం నిర్వహణ, ప్రాజెక్టులలోని నీటిని చెరువుల్లో నింపడం, ఎత్తిపోతల పథకాల్లోకి తీసుకురావడం వంటి కార్యక్రమాలపై సాగునీటి సంఘాల సభ్యులకు సీఎం దిశానిర్దేశం చేయనున్నారు. 'మన నీరు-మన భవిష్యత్, సాగు నీటి సంఘాల పాత్ర' అనే అంశంపై సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సు ఏర్పాట్లను సోమవారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ బి.రాంబాబుతో కలిసి కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా సోమవారం పరిశీలించారు. భోజన వసతి ఏర్పాట్లు, తాగు నీరు, పారిశుధ్యం తదితర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ముగ్గురు యువకుల మృతి

» కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ఘటన

కొవ్వూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై ఎదురెదురుగా రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. కొవ్వూరు పట్టణ ఎస్ఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. చెందిన పొట్టిగుంట అక్షయ్‌కుమార్(20), కొమిరి ఏడుకొండలు(18), గాజుల సత్యకళ్యాణ్ అలియాస్ సునీల్(20) ద్విచక్ర వాహనంపై రాజమహేంద్రవరం బయలుదేరారు. రాజమహేంద్రవరం క్వారీ మార్కెట్ ప్రాంతానికి చెందిన ఆనాప లక్ష్మీనారాయణ(29) స్కూటీపై కొవ్వూరు వస్తుండగా రోడ్డు కం రైలు బ్రిడ్జి 104వ స్తంభం వద్ద రెండు వాహనాలూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అక్షయ్‌కుమార్, సత్యకళ్యాణ్, లక్ష్మీనారాయణ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఏడుకొండలు స్వల్పగాయాలు కావడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

వైద్య సేవ ట్రస్ట్‌లో.. డేటా చోరీ!

» 20 వేల మందికి పైగా వైద్యుల సమాచారం బయటకు
» ఏపీఎంసీ ఎన్నికల ప్రచారం కోసమే
» పోటీలో ఉన్న అభ్యర్థుల చేతికి డేటా
» ట్రస్ట్ ఉద్యోగుల సహకారంతోనే చౌర్యం
» అనంతరం సాఫ్ట్‌వేర్ కంపెనీకి అందజేత
» ఇంత జరిగినా గుర్తించని ట్రస్ట్ అధికారులు

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టులో దొంగలు పడ్డారు. ట్రస్ట్‌కు సంబంధించిన డేటాను చాకచక్యంగా చోరీ చేశారు. అత్యంత రహస్యంగా ఉండాల్సిన డేటా మొత్తం ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీకి అప్పగించారు. అయితే, ఈ విషయాన్ని ట్రస్టు అధికారులు ఇప్పటి వరకూ గుర్తించకపోవడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలో ఏపీ మెడికల్ కౌన్సిల్(ఏపీఎంసీ) ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 54 వేల మంది వైద్యులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు 84 మంది వైద్యులు నామినేషన్ దాఖలు చేశారు. ఈ ఎన్నికల నేపథ్యంలోనే డేటా చౌర్యం జరిగిందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఒక్కొక్క వైద్యుడిని కలిసి విన్నవించుకోవడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో ఫోన్ మేసేజ్‌లు, వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్నారు. ఏపీఎంసీ ఎన్నికల్లో చాలా మంది వైద్యులు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు. కానీ, 54 వేల మంది వైద్యులకు తమ విన్నపాలు వెళ్తున్నాయా?. వారు చూస్తున్నారా అన్న అనుమానాలుంటాయి. తమకు ఓటు వేయాలన్న విన్నపం ప్రతి వైద్యుడి వద్దకు చేరాలంటే, వారిని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సంప్రదించాలంటే కచ్చితంగా వారి అడ్రస్‌లు, మెయిల్ ఐడీలు, ఫోన్ నంబర్లు అవసరం అవుతాయి. ఈ క్రమంలో వైద్యులకు సంబంధించిన డేటా మొత్తం పోటీ చేసే వారి వద్ద ఉంటే ప్రచారం సులువుగా చేసుకోవచ్చని భావించారు.

20 వేల మంది సమాచారం

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర వ్యవస్థల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యుల డేటా మొత్తం ఏపీ మెడికల్ కౌన్సిల్ వద్దే ఉంటుంది. ఆ తర్వాత ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌లో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులకు సంబంధించిన వ్యక్తిగత డేటా అందుబాటులో ఉంటుంది. ఇలా సుమారు 20 వేల మంది వైద్యుల సమాచారం ట్రస్ట్‌లో ఉంది. పోటీలో ఉన్న కొంత మంది అభ్యర్థులు తొలుత ఏపీ మెడికల్ కౌన్సిల్‌లోని కొంత మంది సిబ్బందిని సంప్రదించి, వారికి డబ్బును ఎర చూపి వైద్యుల డేటా కావాలని కోరారు. ఈ డేటా బయటకెళ్తే సమస్యలు వస్తాయని భయపడిన సిబ్బంది డేటా ఇచ్చేందుకు అంగీకరించలేదు. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థుల కన్ను ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టుపై పడింది. ఏపీఎంసీలో వైద్యుల అడ్రస్‌లు, మెయిల్ ఐడీలు, ఫోన్ నంబర్లు మాత్రమే ఉంటాయి. ట్రస్ట్‌లో మాత్రం ఆ వైద్యులు రాష్ట్రంలో ఏ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారన్న సమాచారం కూడా ఉంటుంది. ఈ విషయన్ని గ్రహించిన అభ్యర్థులు ట్రస్టు ఉద్యోగుల సహకారంతో విజయవంతంగా డేటాను చౌర్యం చేశారు. ట్రస్ట్‌లో ప్యానల్, ట్రీట్‌మెంట్, స్పెషలిస్ట్ డాక్టర్లు, మెడికోలకు సంబంధించిన వ్యక్తిగత, రహస్య సమాచారం మొత్తం ఇప్పుడు అభ్యర్థుల చేతుల్లోకి వెళ్లింది. ఇది జరిగి దాదాపు వారం గడిచినా ఇప్పటి వరకు ట్రస్ట్ అధికారులకు ఎలాంటి సమాచారం అందలేదు.

తొలిసారి ఇలా..

వైద్యుల వ్యక్తిగత డేటా దక్కించుకునేందుకు కొన్ని ఫార్మా కంపెనీలు ఉత్సాహం చూపుతాయి. ముఖ్యంగా వైద్యులపై ఫార్మా కంపెనీల నుంచి ఒత్తిళ్లు ఉంటాయి. తమ కంపెనీ మందులే ఉపయోగించాలని, వాటినే రోగులకు రాయాలని ఫార్మా కంపెనీలు, మెడికల్ రిప్రజంటేటివ్స్ కోరుతారు. ఈ క్రమంలోనే వైద్యులు తమ వ్యక్తిగత సమాచారాన్ని, ఫోన్ నెంబర్లు, మెయిల్ ఐడీలను రహస్యంగా ఉంచుతారు. కానీ, తొలిసారి ట్రస్టులో రిజిస్టర్ అయిన వైద్యుల డేటా మొత్తం బయటకు వెళ్లిపోయింది. డేటాను చోరీ చేసిన వారు ఏపీఎంసీ ఎన్నికల వరకు ఉపయోగించుకుని ఆ తర్వాత వదిలేస్తారు. కానీ, ఆ డేటాను వారు సాఫ్ట్‌వేర్ కంపెనీకి ఇవ్వడంతో ఈ కంపెనీ సదరు సమాచారాన్ని ఎక్కడైనా వినియోగించుకునే అవకాశం ఉంటుందని వైద్యులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి డేటా చోరీకి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని వైద్యులు కోరుతున్నారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీ చేతికి

ఏపీఎంసీ ఎన్నికల్లో పోటీలో ఉన్న కొంత మంది వైద్యులు ఈ డేటాను తమ ప్రచారానికి ఉపయోగించుకోవడం ప్రారంభించారు. దొంగతనంగా సేకరించిన డేటా మొత్తం సాఫ్ట్‌వేర్ కంపెనీకి అప్పగించారు. సదరు కంపెనీ సహకారంతో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. మాకు మాత్రమే ఓటు వేయాలంటూ అభ్యర్థుల నుంచి రోజుకు పదులసార్లు వైద్యులకు మేసేజ్‌లు, మెయిల్స్ వెళ్తున్నాయి. ఈ మేసేజ్‌లు చూసి వైద్యులు షాక్‌కు గురవుతున్నారు. తమ ఫోన్ నంబర్లు, మెయిల్ ఐడీలు వీరి చేతికి ఎలా వెళ్లాయని వైద్యులు ఆందోళన చెందుతున్నారు.



బంగ్లాదేశ్ నుంచి విడుదలైన మత్స్యకారులు

బంగ్లాదేశ్ నుంచి విశాఖ చేరుకున్న మత్స్యకారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ జైలు నుంచి విడుదలైన మత్స్యకారులు సోమవారం ఉదయం విశాఖపట్నం చేరుకున్నారు. వారికి ఫిషింగ్ హార్బర్‌లో జిల్లా అధికారులు, కోస్టుగార్డు సిబ్బంది, మత్స్యకార సంఘాల నాయకులు స్వాగతం పలికారు. విజయనగరం జిల్లా భోగాపురం మండలానికి చెందిన తొమ్మిది మంది మత్స్యకారులు మైలపాల అప్పన్న, సూరపాటి రాము, మరుపల్లి ప్రవీణ్, మరుపల్లి చిన అప్పన్న, నక్కా రమణ, మరుపల్లి రామేశ్, సూరాడ అప్పలకొండ, వాసుపల్లి సతీశ్, ఎం.చిన అప్పన్న.. గతేడాది అక్టోబరు 13న సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. సరిహద్దు జలాలు దాటి బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించారని అక్కడి కోస్ట్‌గార్డు సిబ్బంది అక్టోబరు 22న అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి వారు అక్కడి జైలులోనే ఉన్నారు. వారితో పాటు మరికొందరు భారతీయ మత్స్యకారులు కూడా పట్టుబడడంతో మొత్తం 23 మందిని బంధించారు. వారిని విడుదల చేయించడానికి విశాఖ ఎంపీ శ్రీభరత్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా కృషిచేశారు. ఈ నేపథ్యంలో వారిని గత నెల 27వ తేదీన బాగ్రాహాట్ జైలు నుంచి బంగ్లాదేశ్ ప్రభుత్వం విడుదల చేయడంతో అందరూ క్షేమంగా విశాఖ చేరుకున్నారు. స్వదేశానికి చేరిన మత్స్యకారుల కుటుంబాలకు నిత్యవసరాల సరుకులు అందజేసి, స్వస్థలాలకు పంపించినట్టు మత్స్య శాఖ విశాఖపట్నం జేడీ లక్ష్మణరావు తెలిపారు.

చిరుతల దాడిలో నలుగురికి గాయాలు

నార్పల, బుక్కరాయసముద్రంలో కలకలం



నారాయణస్వామి



ఆదినారాయణమ్మ

నార్పల, బుక్కరాసముద్రం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో చిరుతలు విరుచుకుపడ్డాయి. నార్పల, బుక్కరాయసముద్రం మండలాల పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ, రైతులు, గొర్రెల కాపరులపై దాడి చేశాయి. దీంతో నలుగురు గాయపడ్డారు. కొందరు దాడుల నుంచి తప్పించుకున్నారు. నార్పల మండలం బొందల వాడ రైతులు కొనంకి రంగయ్య, లక్ష్మీదేవి పొలాల్లో పనులు చేస్తుండగా మూడు చిరుతలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపరిచి వెళ్లిపోయాయి. ఆ తరువాత గ్రామ శివారులో ఉన్న గొర్రెల కాపరి నారాయణస్వామిపై దాడి చేశాయి. విషయం తెలుసుకున్న గ్రామస్థులు చిరుత పులులను చంపడానికి కర్రలు తీసుకుని వెళ్లారు. ఈ లోగా మూడూ మాయమయ్యాయి. పొలాలు, గుట్టల్లో గాలించిన గ్రామస్థులు, చిరుత పులి అనుకుని అడవి పిల్లిని చంపేశారు. గాయపడ్డ ముగ్గురిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే, బుక్కరాయసముద్రం మండలం సంజీపురం శివారులో కనుమ ఆదినారాయణమ్మ (60)పై చిరుత దాడి చేసింది. మొక్కజొన్న పంటకు నీరు కట్టేందుకు హెచ్చెల్సీ 22వ డిస్ట్రిబ్యూటరీ వద్దకు సోమవారం ఉదయం ఆమె వెళ్లగా అక్కడ చిరుత దాడి చేసింది. ఆమె భయపడకుండా చేతిలో ఉన్న పారతో చిరుత తలపై మోదడంతో అక్కడి నుంచి పారిపోయింది. బాధితురాలిని స్థానికులు 108 వాహనంలో అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. అదే గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున రెడ్డి దిచక్ర వాహనంపై వెళుతుండగా మరో రెండు చిరుతలు ఎదురుపడ్డాయి. ఆయన వెంటనే వెనుదిరిగి దాడి నుంచి తప్పించుకున్నారు. అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలాలను పరిశీలించారు. చిరుతలను బంధించేందుకు బోనులను సిద్ధం చేశారు. చిరుతల సంచారం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, పోలీసు, అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

అదిగో పులి.. ఇదిగో తోక!

» తొర్రేడు పరిసరాల్లోనే పులి
» మొక్కజొన్న తోటలో ఉందంటున్న అధికారులు
» సీతానగరం మండలంలో కనిపించిందంటున్న మరికొందరు
» మూడు మండలాల ప్రజలు గజగజ



రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అదిగో పులి అంటే.. ఇదిగో తోక అన్న చందంగా ఉంది తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని పరిస్థితి. మండలంలోని తొర్రేడు గ్రామంలో ఆదివారం పశువులను చంపి దొరక్కుండా పారిపోయిన పెద్దపులి ట్రాప్ కెమెరాలు, బోను, వల నుంచి తప్పించుకుంది. బోను, సీసీ కెమెరాలు పెట్టిన మార్గంలో కాకుండా, రివర్స్‌లో వెళ్లి రోడ్డు దాటుకొని మరో చోటుకు చేరింది. సోమవారం ఉదయం గ్రామ పంచాయతీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న పాత భవనంలో పులి పాదముద్రలు కనిపించడంతో గ్రామస్థులు ఫారెస్ట్ అధికారులకు సమాచారమిచ్చారు. వారు పరిశీలించి పులి పాదం గుర్తులుగా నిర్ధారణ చేశారు. పులి గ్రామానికి చేరువలో మొక్కజొన్న తోటలో ఉందంటూ చెప్పిన అధికారులు దాని జాడ కనిపెట్టకపోవడంతో గ్రామస్థులు బెంబేలెత్తిపోతున్నారు. పాదముద్రలు కూడా గంట క్రితానివే అంటూ మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో తెలిపిన అధికారులు కనీసం డ్రోన్ కూడా ఉపయోగించలేదు. సాయంత్రం 4గంటల సమయంలో డ్రోన్‌తో గాలించినా జాడ కనిపెట్టలేకపోయారు. సుమారు 4 గంటల ప్రాంతంలో సీతానగరం మండలం ముగ్గళ్లలో పులి జాడ కనిపించిందంటూ అటవీశాఖ అధికారులకు ఫోన్ రావడంతో అటు వెళ్లారు. తొర్రేడు పక్క గ్రామం వెంకటనగరం ఇసుక ర్యాంపు ప్రాంతంలో కనిపించిందని కూలిపనులకు వెళుతున్న కొంతమంది చెబుతున్నారంటూ రెవెన్యూ అధికారులు తెలిపారు. దీంతో ఒక్క పులే మూడు మండలాల్లో తిరుగుతోందా.. అది మరొకటా అన్న సందిగ్ధం నెలకొంది. పులి జాడ అటు సీతానగరం నుంచి రాజమహేంద్రవరం రూరల్ వరకు కనిపించడంతో మూడు మండలాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

మల్లన్న దర్శనంలో సామాన్యులకే ప్రాధాన్యం

» టైంస్లాట్‌లలోనే వీఐపీలకు దర్శనం
» శ్రీశైలంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష



సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రులు, అధికారులు

శ్రీశైలం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రులు పిలుపునిచ్చారు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారని తెలిపారు. సోమవారం శ్రీశైలంలోని సదాశివయ్య భవన్‌లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై దేవదాయ శాఖ, జిల్లా అధికారులతో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు సామాన్య భక్తులకు మాత్రమే ప్రాధాన్యత నిస్తూ స్వామిఅమ్మవార్ల సర్వ దర్శనాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని దేవదాయ శాఖ ఎక్స్ అఫిషియో ప్రిన్సిపల్ సెక్రటరీ హరిజవహర్‌లాల్ తెలిపారు. మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఏర్పాట్లలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకోవాలని.. భక్తులందరికీ సజావుగా, సంతృప్తికరంగా దైవ దర్శనం కల్పించినపుడే ప్రభుత్వ చర్యలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. వీఐపీ దర్శనాలకు వచ్చే వారు టైంస్లాట్‌ను కచ్చితంగా అనుసరించేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల్లో శాంతి భద్రతలకు భంగం కలగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని హోం మంత్రి అనిత పోలీస్ అధికారులను ఆదేశించారు. భక్తుల మనోభావాలకు ప్రాధాన్యమిస్తూ తగిన మౌలిక వసతులు కల్పించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్ధన్ రెడ్డి అధికారులకు సూచించారు. ప్రధానంగా ఆత్మకూరు నుంచి దోర్నాల వరకు ఉన్న ప్రధాన రహదారిలో గుంతల పూడిక, భద్రతా చర్యల పనులను మరో నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు మంత్రులు మల్లికార్జునస్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆత్మనిర్భరత బాటలో...

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన కొత్త బడ్జెట్ ఎలాంటి మెరుపులు, ఆశ్చర్యపరిచే ప్రకటనలు లేకుండా సాగిపోయింది. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని జనాకర్షణ ప్రకటనలుండవచ్చునన్న ఊహాగానాలకు ప్రారంభంలోనే నిర్మలమ్మ తెర దించారు. "జనాకర్షణ కాదు... జన సంక్షేమమే ప్రధానం" అని తేల్చి చెప్పారు. నరేంద్ర మోదీ సారథ్యంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బడ్జెట్ దిశ మారింది. భారీ తాయిలాలతో ప్రజలను బుజ్జగించే ధోరణులకు చరమ గీతం పాడింది. దీర్ఘకాలిక వృద్ధికి పెద్దపీట వేయడం, 2047 నాటికి 'వికసిత్ భారత్'గా దేశాన్ని తీర్చి దిద్దడానికే పెద్దపీట వేసింది. ఈ ప్రయాణంలో మరో ముందడుగు 2026–27 సంవత్సరానికి నిర్మల ప్రకటించిన ఈ బడ్జెట్ అని చెప్పవచ్చు. గత ఏడాది ద్వితీయార్ధంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన భారీ సుంకాల ప్రభావంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం భారీగా దెబ్బతింది. ఉపాధి రంగంలో సింహభాగం ఈ రంగాలదే. అందుకే ఈ రంగాలను ఆదుకునేందుకు రూ.10,000 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం అభిలషణీయమైన చర్య. దీనివల్ల ఎంఎస్ఎంఈ రంగంలో నిధుల కొరత తీరుతుంది. అలాగే గత కొన్నేళ్లుగా పలు కీలక రంగాలు సెమీ కండక్టర్ చిప్‌ల కొరతతో అల్లాడిపోతున్నాయి. దేశీయంగా వాటి ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే ఈ బడ్జెట్‌లో ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0 ప్రకటించి కేటాయింపులను రూ.40,000 కోట్లకు పెంచారు. ప్రస్తుతం అమలు జరుగుతున్న సెమీ కండక్టర్ మిషన్ 1.0 కేటాయింపులతో పోల్చితే సుమారుగా రెట్టింపు చేశారు. దీనితో పాటుగా రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు, టెక్స్‌టైల్స్, బయో ఫార్మా, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలు, యంత్రపరికరాలు, రసాయనాల రంగాలను వ్యూహాత్మక ప్రాధాన్యతా రంగాలుగా ప్రకటించడం వల్ల వాటికి ప్రభుత్వం నుంచి మరింత అధికంగా మద్దతు లభిస్తుంది. బయో ఫార్మా రంగం కోసం రూ.10,000 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేయడం ఆ రంగానికి ఎంతో ఉత్తేజం కల్పిస్తుంది. దేశంలో మధుమేహం, క్యాన్సర్ వంటి జీవనశైలి వ్యాధులు ప్రబలిపోతున్న దశలో ఇది మంచి అడుగు. ఆ వ్యాధులను ఎదుర్కొనేందుకు అవసరమైన ఔషధాల తయారీకి ఇది మద్దతు ఇస్తుంది. అంతే కాదు...పలు కీలక రంగాలకు అరుదైన ఖనిజాల లభ్యతను పెంచేందుకు దేశంలో ఏర్పాటు చేయనున్న నాలుగు రేర్ ఎర్త్ కారిడార్లలో ఆంధ్రప్రదేశ్‌కు కూడా స్థానం లభించడం హర్షదాయకం. అలాగే దేశంలో ఇటీవల కాలంలో డేటా సెంటర్ల విస్తరణ జోరుగా సాగుతోంది. గతంలో ఐటీ తరహాలో ఉపాధికల్పనకు ఇప్పుడు డేటా సెంటర్లు కీలకంగా మారాయని నిపుణులంటున్నారు. ఈ నేపథ్యంలో దేశంలో డేటా సెంటర్లు ఏర్పాటు చేసే కంపెనీలకు 2047 వరకు పన్ను విరామం ఇవ్వడం ఆ రంగాన్ని ఎంతో ఉత్తేజితం చేస్తుంది. ఇందులో ఇప్పటికే హైదరాబాద్ కీలక కేంద్రంగా ఉన్నది. ఆంధ్రప్రదేశ్ కూడా ఇప్పుడు ఆ పోటీలో ప్రవేశించింది. ఆ రకంగా ఈ చర్య రెండు రాష్ట్రాలకు ఎంతో సహాయకారి అవుతుంది. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ కేటాయింపులు సైతం పెంచుకుంటూ వస్తోంది. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ మూలధన వ్యయాలను రూ.12.22 లక్షల కోట్లకు, అంటే గత బడ్జెట్‌తో పోల్చితే 12.5శాతం పైబడి పెంచడం కూడా ఆర్థిక రంగాన్ని ఉత్తేజితం చేస్తుంది. కీలక రంగాలకు అవసరమైన నిధులు అందుబాటులోకి వచ్చి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇందులో భాగంగానే కొత్త బడ్జెట్‌లో ఏడు హైస్పీడ్ కారిడార్లను ప్రతిపాదించగా వాటిలో మూడు హైదరాబాద్‌తో అనుసంధానమైనవి కావడం కూడా తెలుగు రాష్ట్రాలకు ఆనందం కలిగించే అంశం. దేశాన్ని విదేశీ మూకల నుంచి కాపాడాలంటే రక్షణ రంగాన్ని పటిష్ఠం చేయడం ఎంతో అవసరం. ఇటీవల కాలంలో పొరుగుదేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, చైనా నుంచి ముప్పు పెరుగుతూ వస్తున్న నేపథ్యంలో రక్షణ బడ్జెట్‌ను ఏకంగా జీడీపీలో 2 శాతానికి పెంచడం సాయుధ దళాల పోరాట సంసిద్ధతను, సామర్థ్యాన్ని మరింతగా పెంచడానికి దోహదపడే చర్య. మొత్తం మీద ఈ బడ్జెట్ అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకుంటూ విభిన్న కోణాల నుంచి ప్రజలకు రక్షణ కల్పిస్తూ దేశాన్ని ఆత్మనిర్భరత బాటలో నడుపుతుందని ఆశించవచ్చు.


> తండ్రి ఉపాధ్యాయుడు, మేనమామ ప్రఖ్యాత రచయిత బొల్లిముంత శివరామకృష్ణ కావడంతో చందు సుబ్బారావుకు చిన్నప్పటి నుంచే వామపక్ష భావజాలం, సాహిత్యం అబ్బినవి. శ్రీశ్రీ కవిత్వంపై మాట్లాడేటప్పుడు... అలవోకగా ఆయన కవిత్వం పలుకుతూ మధ్యమధ్యలో విశ్వనాథ సత్యనారాయణ సంస్కృత భూయిష్ఠమైన ఆంధ్ర భాషా పద్యాలు చదివి రంజింపజేసేవారు చందు.

సాహిత్య సీమలో వైజ్ఞానికుడు

ఆచార్య చందు సుబ్బారావు జనవరి 29న విశాఖపట్నంలోని తన గృహంలో మరణించారు. ఈ హఠాత్పరిణామానికి సాహితీలోకం ఘొల్లుమంది. అందరూ ముద్దుగా పిలిచే 'చందు' లేకుండా విశాఖపట్నంలో ఏ సాహితీ సమావేశం జరిగేది కాదు.

చందు సుబ్బారావు ప్రసంగాలు, పుస్తకాలు, సాహితీ విమర్శనా బాణాలు అందుకున్నవారు– ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులేమోనని అనుకునేవారు. కానీ ఆయన భూ భౌతికశాస్త్ర ఆచార్యుడు. అనేక పరిశోధనలు చేసి, పుస్తకాలు, వ్యాసాలు ప్రచురించి, పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేసిన సైంటిస్ట్. గుంటూరు జిల్లా, తెనాలి తాలూకా చదలవాడ గ్రామంలో 1946 మే 18న సుబ్బారావు జన్మించారు. తల్లిదండ్రులు వెంకటకృష్ణయ్య, రాజ్యలక్ష్మి. వీరిద్దరూ కమ్యూనిస్టులుగా కొనసాగుతున్నప్పుడే పెళ్లి చేసుకున్నారు. అలా పెళ్లి చేసుకున్న వారిలో వీరు తొలితరం దంపతులు. తండ్రి ఉపాధ్యాయుడు, మేనమామ ప్రఖ్యాత రచయిత బొల్లిముంత శివరామకృష్ణ కావడంతో సుబ్బారావుకు చిన్నప్పటి నుంచే వామపక్ష భావజాలం, సాహిత్యం అబ్బినవి.

సమాజంలో చెడు పోకడలు, సాహితీ ప్రపంచంలో వస్తున్న పెడధోరణులు, సైన్సు అనుకున్నంత గొప్పగా భారతదేశంలో అభివృద్ధి చెందకపోవడం... వంటి వాటితో పాటూ దళిత, బహుజన, మహిళల స్థితిపై చందు నిత్యం మానసిక ఘర్షణ పడేవారు. ఆ ఆవేదనలోంచి వచ్చిన ఉపన్యాసాలు జనాన్ని ఉర్రూతలూగించేవి. చందు వలే అటు ప్రాచీన సాహిత్యాన్ని, ఇటు ఆధునిక సాహిత్యాన్ని సమపాళ్లలో రంగరించి మాట్లాడేవారు తెలుగు రాష్ట్రాల్లో బహు అరుదు. చందు– శ్రీశ్రీ అభిమాని. 1970లో శ్రీశ్రీ పుట్టిన రోజు సందర్భంగా విశాఖలో నిర్వహించిన 'విశాఖ విద్యార్థుల సభ'లో జ్వాలాముఖి ప్రసంగం విన్నవాళ్లలో చందు, నేనూ ఉన్నాం. తరువాత విశాఖ రచయితల సంఘంలో చేరి పురిపండా, రాచకొండ, కాళీపట్నం, చలసాని ప్రసాద్... అప్పుడప్పుడూ గొల్లపూడి, భమిడిపాటి వంటి అనేక సీనియర్ రచయితలతో కలిసి ఆయన సాహితీ చర్చలు చేసేవారు. ఆంధ్రా యూనివర్సిటీలో అప్పటికి తూమాటి దోణప్ప, పరిశోధకులుగా ఉన్న వెల్చేరు నారాయణరావు, బంగొరెతో పాటు కొర్లపాటి శ్రీరామమూర్తి, మలయవాసిని, అత్తలూరి నరసింహరావుతో సాహితీ సమాలోచనలు జరుపుతుంటే– ఈయనెవరు? ఆర్ట్స్ కాలేజీలో ఏ డిపార్టుమెంటువారు? అనుకునేవారంతా. చందు సుబ్బారావు సైన్స్ కాలేజీ మనిషి. ఫ్యాకల్టీ క్లబ్ నుంచి ఎక్కువగా సామాజిక శాస్త్రాలు, తెలుగు భాషా సాహిత్యం, ఆంగ్ల భాష అధ్యయనంతో పాటు, హిందీలో ఆదేశ్వరరావు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వంటి వారితో ఎక్కువ సమయం గడిపేవారు.



చందు తన సబ్జెక్ట్ అయిన భూ భౌతిక శాస్త్రానికి సంబంధించి విశాఖ ప్రాంతంలో నీటి వనరులు, అక్కడి కాలుష్యంపై పరిశోధనలు చేశారు. గ్రౌండ్ వాటర్ పెరుగుదలకు సంబంధించి జాతీయ సెమినార్లు ఏర్పాటు చేయటం, దానికో సంఘాన్ని ఏర్పాటు చేసిన వాళ్లలో చందు ప్రముఖ పాత్ర పోషించారు. ఆ సందర్భంలోనే– 'చందూ! నువ్వు తెలుగు సాహిత్యంపై కృషి చేస్తున్నా, మంచి గుర్తింపు ఉన్నా, మనం యూనివర్సిటీ అధ్యాపకులం... మన పరిశోధనలు, ప్రచురణలు, పరిశోధక నిర్వహణ ఆధారంగానే మనకు గుర్తింపు ఉంటుంది' అని నేనాయనతో అంటే, అప్పుడు ఇంగ్లీషులో మూడు పుస్తకాలు ప్రచురించారు. బల్గేరియాలో పరిశోధన నిమిత్తం కొంతకాలం ఉండి, కమ్యూనిస్టు దేశాలు పర్యటించారు.

చందు సుబ్బారావు సుమారు 20 పుస్తకాలు ప్రచురించారు. కొన్ని వందల వ్యాసాలు రాశారు. ఆయనే రాసుకున్నట్లు "రాసే గుణంతో పాటు గుర్తుంచుకునే బుర్ర ఉండడం వల్ల అయిదు దశాబ్దాల చరిత్రను (సాహితి) తెల్ల కాగితాలకెక్కించాను. 1968లో మహీధర రామమోహనరావు, శివరాం మావయ్య, మోహన్, గులాం గౌస్, పెద్దిబొట్ల, ప్రకాశ్ తదితరులు విశాలాంధ్ర వారిచ్చిన పేరుతో ఇతర పత్రికల్లో ప్రవేశించి ప్రఖ్యాతి కోసం ప్రయత్నించటం వాస్తవం." ఇంత నిర్మొహమాటంగా తన గురించి ఎలా చెప్పుకున్నారో సాహిత్య విమర్శ రాసేటప్పుడు, మాట్లాడేటప్పుడు అంతే కచ్చితంగా మాట్లాడేవారు. శ్రీశ్రీ కవిత్వంపై మాట్లాడేటప్పుడు... అలవోకగా ఆయన కవిత్వం పలుకుతూ మధ్యమధ్యలో విశ్వనాథ సత్యనారాయణ సంస్కృత భూయిష్ఠమైన ఆంధ్ర భాషా పద్యాలు చదివి రంజింపజేసేవారు. ఆయన ప్రచురించిన సుమారు నాలుగు సాహితీ పుస్తకాలు, అందులో ఎక్కువ వ్యాసాలుగా వివిధ పత్రికల్లో అచ్చయినవి. అవి ఎప్పటికీ చందును తెలుగు సాహితీ విమర్శకుల జాబితా తొలి వరుసలో ఉండేలా చేశాయి. పాఠకులు తప్పనిసరిగా చదవాల్సిన గ్రంథాలుగా తెలుగు శాఖ వారు ఈ పుస్తకాలను పేర్కొంటారని ఆశిస్తున్నా. 'కవికి విమర్శకుడు శత్రువు కాదు' అన్న మకుటంతో వెలువడిన పుస్తకం ప్రతి కవి, విమర్శకుడు చదవాల్సిన పుస్తకం. ముఖ్యంగా తాను అనువదించి, విశాలాంధ్ర ప్రచురించిన 'డా. బాబాసాహెబ్ అంబేడ్కర్' గొప్ప అనువాదం.

ఒక సందర్భంలో వేగుంట మోహన్ ప్రసాద్ కవితా సంకలనాన్ని యూనివర్సిటీలో ఆవిష్కరింపజేసి, అద్భుతంగా మాట్లాడారు. నేను అకడమిక్ స్టాఫ్ కాలేజీ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు మన రాష్ట్రం, వివిధ రాష్ట్రాల అధ్యాపకులు ముఖ్యంగా తెలుగు భాషా ఉపన్యాసకులు పునశ్చరణ తరగతులకు వచ్చినప్పుడు చందు సుబ్బారావు ప్రసంగాలు ఉండేవి. ఆ విధంగా తెలుగు రాష్ట్రాల్లో ఉండే తెలుగు, ఆంగ్ల, హిందీ ఉపన్యాసకులు అందరూ చందును గుర్తుపెట్టుకుంటారు. కొర్లపాటి శ్రీరామమూర్తి, మలయవాసిని కోఆర్డినేటర్లుగా నేను తెలుగు సాహిత్యంపై జాతీయ స్థాయిలో పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్న సందర్భంలో అందరం ఆలోచించి 1989–90లో వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంపై వారం రోజులు జరిపిన సభలు ఇప్పటికీ గుర్తున్నాయి.

'అరసం'కు అధ్యక్షుడిగా కొంతకాలం పనిచేసినా, విశాఖపట్నం అరసంను పురిపండా, చందు, ఉప్పల అప్పలరాజు చాలాకాలం నడిపించారు. 14వ రాష్ట్ర మహాసభలు విశాఖలో జరిపినప్పుడు రాష్ట్రంలోని అన్ని సాహితీ సంస్థల సభ్యులు, అరసం, విరసం, స్థానిక సంఘాల వారు పాల్గొని మరపురాని స్మృతులను మిగిల్చారు. ముఖ్యంగా తెలుగు పరిశోధకులు చేయని ఒక మంచిపని పరిశోధనలపై పరిశోధన అంటూ ఒక పీహెచ్‌డిని సమీక్షిస్తూ "అంకెలొక్కటే ప్రమాణాలు కావు, కాని ప్రమాణ సూచికలే" అన్నారు చందు. అంతేకాదు సామాజిక పరిశోధనలపై పరిశోధనలు చెయ్యాలని, ఆధునిక సామాజిక శాస్త్రవేత్తలు, భాషా సాహిత్యాల నుంచి రాబట్టవలసిన రాజకీయ, సాంఘిక శాస్త్రీయ నిర్ధారణలు అవసరం అన్నారు. నగ్నముని కొయ్యగుర్రంపై రాసిన చక్కటి విశ్లేషణ అరసంవారు, విరసం వారే కాదు, తెలుగు సాహిత్యాన్ని ముఖ్యంగా కవిత్వాన్ని ప్రేమించేవారు తప్పక చదవవలసిన వ్యాసం. తెలుగువారి సామ్యవాద ఉద్యమాలు, భారతీయ వైజ్ఞానిక పరిశోధనలలో తెలుగువారి కృషిని సవివరంగా గ్రంథస్థం చేయడమే కాదు, తాను అందులో ఒకడిగా నిలిచిన చందు సుబ్బారావు చిరస్మరణీయుడు.

○ ప్రొఫెసర్ కె.యస్.చలం

పీఎస్‌యూల పునరుజ్జీవనానికి కొత్త స్ఫూర్తి

దేశంలో అతిపెద్ద కోకింగ్ కోల్ ఉత్పత్తిదారు, కోలిండియా లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, ఈ సంవత్సరం జనవరి 19న ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయింది. ప్రస్తుతం ప్రపంచ మార్కెట్ పరిస్థితులు ఆశాజనకంగా లేనప్పటికీ ఈ సంస్థ ఐపీఓ చరిత్ర సృష్టించింది. రూ.1,070 కోట్లను సేకరించడానికి ఆఫర్‌లో ఉన్న 46 కోట్ల షేర్ల కోసం 147 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయింది. 90 లక్షలకు పైగా అప్లికేషన్లు దాఖలయ్యాయి. భారత ప్రభుత్వ రంగ సంస్థల విజయవంతమైన ఐపీఓ లిస్టింగ్ ఇదొక్కటే కాదు. ఈ ఒరవడి గత కొన్నేళ్లుగా ఇలాగే స్థిరంగా కొనసాగుతోంది. గత 7–8 సంవత్సరాల కాలంలో దాదాపు 15 ప్రభుత్వరంగ సంస్థలు భారతీయ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అవడంతోపాటు అవసరమైన మూలధనాన్ని సేకరించగలిగాయి. వాటాదారుల షేర్ల విలువను పెంచడంతో పాటు రిటైలర్ల సంపదను కూడా సృష్టించగలిగాయి. 2017 నుంచి, భారతదేశంలో ఇంజనీరింగ్, నిర్మాణం, రైల్వే, రక్షణ, ఇంధన సంబంధిత రంగాలలో 10కి పైగా అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థలు స్టాక్ మార్కెట్లలో లిస్ట్ అయ్యాయి. తద్వారా, దిగువ పేర్కొన్న కంపెనీలలో, మూలధన మార్కెట్ విలువ రూ. 1.40 లక్షల కోట్ల నుంచి రూ. 8.53 లక్షల కోట్లకు పెరిగింది– ఇది 513 శాతం భారీ పెరుగుదల.

ఆగస్టు, 2017లో రూ.7,096 కోట్లతో లిస్టింగ్ అయిన కొచ్చిన్ షిప్‌యార్డ్ మార్కెట్ మూలధనం 31 డిసెంబర్, 2025 నాటికి రూ.42,634 కోట్లకు (501 శాతం) పెరిగింది. అక్టోబర్, 2020లో రూ.3,489 కోట్లతో లిస్టింగ్ అయిన మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ మార్కెట్ మూలధనం 31 డిసెంబర్, 2025 నాటికి ఏకంగా రూ.1,00,000 కోట్లకు (అంటే 2,766శాతం!) పెరిగింది. అదేవిధంగా, జూలై, 2018లో రూ.4,254 కోట్లతో లిస్టింగ్ అయిన RITES లిమిటెడ్ మార్కెట్ మూలధనం రూ. 11,652 కోట్లకు (174శాతం) పెరిగింది. IRCON ఇంటర్నేషనల్ సెప్టెంబర్, 2018లో రూ.3,919 కోట్ల నుంచి రూ.16,704 కోట్ల (326 శాతం)కు పెరిగింది. రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ ఏప్రిల్, 2019లో రూ.3,972 కోట్ల నుంచి రూ.74,508 కోట్లకు (1,776శాతం) పెరిగింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ జనవరి, 2021లో రూ.32,475 కోట్ల నుంచి రూ.1,63,000 కోట్లకు (402శాతం) పెరిగింది. అంతేగాక, ఇండియన్ రైల్వే క్యాటరింగ్ & టూరిజం కార్పొరేషన్– అక్టోబర్, 2019లో రూ.11,658 కోట్ల నుంచి రూ.54,764 కోట్లకు (370శాతం), రైల్‌టెల్ కార్పొరేషన్ (ఫిబ్రవరి, 2021) రూ.3,896 కోట్ల నుంచి రూ.11,924 కోట్లకు (206శాతం), హౌసింగ్ & అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (మే, 2017) రూ.14,514 కోట్ల నుంచి రూ.45,683 కోట్లకు (215 శాతం), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (మార్చి, 2018) రూ.37,731 కోట్ల నుంచి రూ.2,93,000 కోట్లకు (676శాతం), ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (నవంబర్, 2023) రూ.16,124 కోట్ల నుంచి రూ.39,301 కోట్లకు (144శాతం) పెరిగింది. ఈ పీఎస్‌యూలు అన్నీ మొత్తంగా తమ మూలధన మార్కెట్ విలువను రూ.1,39,128 కోట్ల నుంచి రూ. 8,53,170 కోట్లకు (అంటే దాదాపు 513 శాతానికి) పెంచుకున్నాయి. భారీ పెరుగుదల ఇది.

గతంలో, ప్రభుత్వరంగ సంస్థలు మూలధన పెట్టుబడులు, ఇతర విస్తరణ పనుల కోసం సంబంధిత మంత్రిత్వ శాఖల బడ్జెట్ కేటాయింపులపై ఆధారపడాల్సి వచ్చేది. దీనికోసం ఆయా మంత్రిత్వ శాఖల్లో వివిధ విభాగాలతో విస్తృతమైన చర్చలు జరపాల్సి రావడమే కాకుండా నిధులను విడుదల చేయించుకోవడానికి చాలా సమయం పట్టేది. నేడు నిర్ణయాలు అమలు చేయడంలో ఎంతో వేగాన్ని ప్రదర్శిస్తున్న ఈ సంస్థలు నిధుల కోసం ఎదురుచూసే స్థితి నుంచి.. ప్రభుత్వాలు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు నిధులు సమకూర్చే స్థాయికి ఎదిగాయి. గత పరిస్థితులతో పోలిస్తే ఇది రివర్స్ ట్రెండ్.

> మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంచుకోవడం ద్వారా తమ సత్తా చాటేందుకు ప్రభుత్వరంగ సంస్థలు ఐపీవోలతో సిద్ధమవుతున్నాయి. ఐపీవోలు పెట్టుబడులకు మంచివి కావు అనే పాతకాలపు ఆలోచనలను వెనక్కునెట్టి, ఒక కొత్త వాస్తవికతవైపు అవి అడుగులు వేస్తున్నాయి. ఒక సంస్థ నిజాయితీగా, పారదర్శకతతో పనిచేస్తే.. మార్కెట్ కూడా అదే తీరుగా సంపూర్ణ సహకారంతో స్పందిస్తుందనడానికి భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్) ఐపీఓ ఒక చక్కటి ఉదాహరణ.

ఉదాహరణకు, క్రిటికల్ మినరల్స్ రంగంలో భారతదేశ దీర్ఘకాల అవసరాల దృష్ట్యా స్థిరమైన సప్లయ్ చైన్‌ను బలోపేతం చేసేందుకు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ జనవరి 2025లో 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించింది. దీని కోసం రూ.34,300 కోట్ల అంచనా వ్యయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. అందులో రూ. 1,500 కోట్లు మాత్రమే బడ్జెట్ నుంచి లభిస్తున్నాయి. వివిధ మంత్రిత్వ శాఖల విభాగాల సంపూర్ణ సమన్వయం (Whole of Government Approach) విధానంతో కేంద్ర ప్రభుత్వం సమకూర్చే ఇతర పెద్ద మొత్తాన్ని అటుంచితే, 50శాతానికి పైగా నిధులు అంటే.. రూ.18,000 కోట్లు వివిధ మంత్రిత్వ శాఖల పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థలు సమకూరుస్తున్నాయి. వీటిలో గనుల మంత్రిత్వ శాఖ నుంచి KABIL, బొగ్గు శాఖ నుంచి కోలిండియా లిమిటెడ్, నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్, ఉక్కు శాఖ నుంచి స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ నుంచి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, పెట్రోలియం శాఖ నుంచి ఆయిల్ ఇండియా లిమిటెడ్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ వంటివి ఉన్నాయి. రానున్న రోజుల్లో కర్బన ఉద్గారాలను తగ్గించడానికి, సంబంధిత సాంకేతికతను మెరుగుపరిచేందుకు ఈ సంస్థల నుంచి సేకరించే పెట్టుబడులను ఉపయోగిస్తారు. ఎన్‌సీఎమ్ఎమ్ కోసం పీఎస్‌యూల నుంచి పెట్టుబడులను తీసుకొచ్చిన ఈ వ్యూహాత్మక విధానం రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టే వివిధ కీలకమైన కార్యక్రమాలకు అవసరమైన నిధులను సమకూర్చేలా.. కేంద్ర ప్రభుత్వానికి ఒక మంచి అవకాశం అందించింది.



చాలా వరకు మార్కెట్లు స్థిరమైన పెట్టుబడులు కొనసాగించిన వాటాదారులకు మాత్రమే మంచి లాభాలను అందిస్తాయి. బీసీసీఎల్ విషయానికి వస్తే.. నష్టాల్లో ఉన్న పీఎస్‌యూగా ముద్రపడటం నుంచి మొదలుపెట్టి.. వ్యాల్యూ– డ్రివెన్ వ్యవస్థగా, వ్యూహాత్మకంగా కీలకమైన సంస్థగా మారడం వరకు అది సాగించిన ప్రయాణం మనందరికీ తెలుసు. ఇవాళ ఈ సంస్థకు భారతదేశ డొమెస్టిక్ కోకింగ్ కోల్ ఉత్పత్తిలో 58.5శాతం వాటా ఉంది. దీంతో కీలకమైన ఉక్కు, మౌలిక సదుపాయాల రంగంలో ఇది అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తోంది. ఈ ముఖ్యమైన విషయాన్ని పెట్టుబడిదారులు గుర్తుపెట్టుకున్నారు. మౌలిక సదుపాయాల విస్తరణ, తయారీరంగ అభివృద్ధి ఆత్మనిర్భరతపై దృష్టి సారించిన ఆర్థిక వ్యవస్థలో, బీసీసీఎల్ ఒక బొగ్గు ఉత్పత్తిదారుగా మాత్రమే కాకుండా ఇంధన భద్రతలో పారిశ్రామిక పురోగతికి కీలకమైన ఇరుసుగా తన సేవలను కొనసాగిస్తోంది.

ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఈ సంస్థ సాధించిన విజయం అనుకోకుండా వచ్చినది కాదు. ప్రభుత్వరంగ సంస్థలు తమ ఆస్తులను ఎలా పొందుతున్నాయి, వాటిని ఎలా వృద్ధి చేసుకుంటున్నాయనే విషయంలో.. చోటుచేసుకుంటున్న విస్తృత మార్పుకు వివిధ సంస్థలు అనుసరిస్తున్న తీరే నిదర్శనం. ఇటీవలి కాలంలో పెట్టుబడిదారులు దీర్ఘకాలిక లాభాల గురించి వివేకంతో ఆలోచిస్తున్నారు. స్పష్టమైన లక్ష్యాలతో, కార్యాచరణతో ముందుకు వస్తున్న ఈ సంస్థల సామర్థ్యాన్ని, వాటి పురోగతికి ఉన్న అవకాశాలు, అంశాలను విశ్లేషిస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారు. అలాంటి సామర్థ్యమున్న పీఎస్‌యూలకు రెండో ఆలోచనకు తావులేకుండా సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నారు. తమ మంత్రిత్వ శాఖల నుంచి పొందిన స్వయం ప్రతిపత్తిని పీఎస్‌యూలు పరిపాలనా నాణ్యత, వ్యూహాత్మక ప్రణాళిక, అమలులో వేగాన్ని తీసుకురావడానికి ఒక అవకాశంగా ఉపయోగించుకున్నాయి. ఈ మార్పు మరిన్ని సంస్థలకు సరికొత్త విశ్వాసాన్ని అందిస్తోంది. మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంచుకోవడం ద్వారా తమ సత్తా చాటేందుకు ప్రభుత్వరంగ సంస్థలు ఐపీఓలతో సిద్ధమవుతున్నాయి. ఐపీఓలు పెట్టుబడులకు మంచివి కావు అనే పాతకాలపు ఆలోచనలను వెనక్కునెట్టి, ఒక కొత్త వాస్తవికతవైపు ప్రభుత్వరంగ సంస్థలు అడుగులు వేస్తున్నాయి. ఒక సంస్థ నిజాయితీగా, పారదర్శకతతో పని చేస్తే.. మార్కెట్ కూడా అదే తీరుగా సంపూర్ణ సహకారంతో స్పందిస్తుందనడానికి బీసీసీఎల్ ఐపీఓనే ఒక చక్కటి ఉదాహరణ.



■ ప్రొఫెసర్ ఎస్.మహేంద్రదేవ్
ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్

అది 'మగస్వామ్యం' కాదు, ధనస్వామ్యం!

'ఈ గొడవ స్త్రీల దుస్తుల గురించి కాదు!' అన్న పేరుతో, ఎ.సునీత (జనవరి 22న) రాసిన వ్యాసానికి స్పందన ఇది. మొత్తం గొడవ అంతటికీ కారణం 'మగస్వామ్యం' అని వ్యాసకర్త తేల్చేశారు. 'మగస్వామ్యం' అనే పదాన్ని ఒకసారి, రెండుసార్లు కాదు, ఏకంగా పదకొండుసార్లు ఉపయోగించారు. 'మగస్వామ్యం' అనేది, ధన స్వామ్యానికి నీడలాంటిదనీ, నీడతో యుద్ధం చేసి ప్రయోజనం లేదనీ, ధన స్వామ్యంతో చేసే యుద్ధం గురించి ఆలోచించాలనీ వివరించడానికే ఈ ప్రయత్నం.

(1) పురుషులైనా, స్త్రీలైనా వేసుకునే బట్టల్ని తయారు చేయించేది ఎవరు? బట్టల పెట్టుబడిదారులే! కొంత ధనం పెట్టి, అనేక రెట్ల ధనాన్ని లాభాలుగా సంపాదించడమే పెట్టుబడిదారీ విధానం. దాన్నే 'ధన స్వామ్యం' అంటారు. పెట్టుబడిదారులు, ధనాన్ని ఒకరికంటే మించి ఒకరు పోటీలు పడి సంపాదించడానికే, అనేక రకాల వికృత వ్యాపార మార్గాలు! ఫాషన్ టెక్నాలజీ పేరుతో కోర్సులు! ఫాషన్ షోలు! అందాల పోటీలు! ఆ ప్రదర్శనల్లో, పోటీల్లో వేసుకునే బట్టలు వందల రకాలు. వాటన్నిటినీ తయారు చేయించి మార్కెట్లోకి వదిలేది బట్టల పెట్టుబడిదారులే! పైగా, ఎప్పుడూ ఒకే రకం కాదు. ఫాషన్లు నిరంతరం మారుతూ ఉండాలి. వీటన్నిటినీ, సినిమాల్లో నటీనటులతో ధరింపజేసి ఊరుకోరు. బయట, వ్యాపార ప్రకటనల్లో, దుస్తుల దుకాణాల ప్రారంభోత్సవాలలో, సినిమాల ప్రొమోషన్ల సభల్లో, సినిమా తారలతోనో, మోడల్స్ తోనో తొడిగించి, వాటిని ఆకర్షణీయమైన సరుకులుగా చూపి, జనాల చేత కొనిపించి, ధనం సంపాదించాలనే 'ధనస్వామ్య సిద్ధాంతం' ఇది. ఈ సిద్ధాంతాన్ని, దుకాణాలూ, పత్రికలూ, టీవీలూ, సినిమాలూ, ఇంకా అనేక రకాలైన ప్రచార సాధనాలు ఒక అంటువ్యాధిలాగా జనాలలో వ్యాపింపజేస్తున్నాయి. దీని ప్రభావంలో, ఆడా–మగా, చిన్నా–పెద్దా అందరూ వయసు, ప్రాంతం, దేశం, కుల మతాలతో సంబంధం లేకుండా లొంగిపోతున్నారు. పెట్టుబడిదారీ విధానం, తను మొదలైన చోటే ఉండిపోదు. దేశ సరిహద్దులు దాటి, ఖండాంతరాలు చేరుతుంది. (ఉదాహరణకి 'అల్ జజీరా' అనే ఒక టీవీ చానల్, వెనకబడ్డ ఆఫ్రికాఖండ దేశాలలోని, మారుమూల ప్రాంతాల పేద ప్రజల జీవితాల మీద కూడా డాక్యుమెంటరీలు చూపిస్తూ ఉంటుంది. అందులో కనిపించే పేదవాళ్ళు వేసుకునే బట్టల్లో, నాణ్యత ఏ మాత్రమూ లేకపోయినా, ఆ బట్టలూ, ఆ అలంకార వస్తువులూ అన్నీ సంపన్న దేశాలలో వుండే వికృత ఫాషన్ల రూపాల్లోనే ఉంటాయి.) అలాగే, పెట్టుబడిదారీ కంపెనీలు తయారు చేయించే రకరకాల ఫాషన్ల బట్టల్ని చూపడానికి, 24 గంటలూ పనిచేసే ప్రత్యేక 'ఫాషన్ టీవీ'లూ, యూట్యూబులూ ఎన్నో! పెట్టుబడిదారీ సరుకుల సంస్కృతి ఎలా ప్రచారం అవుతుందో, అన్ని వర్గాల ప్రజలూ, ఆ భావజాలానికి ఎలా లోనవుతారో– అనే కోణంలో సమస్యని అర్థం చేసుకోకుండా, 'మగస్వామ్యం! మగస్వామ్యం' అని, 11 సార్లు ధర్మాగ్రహాన్ని ప్రకటించినా, అది నీడతో యుద్ధంగానే మిగిలిపోతుంది.

(2) 'ఇళ' అనే 13 ఏళ్ళ బాలికకు, శోభనం రాత్రి, 'మగస్వామ్య' శృంగారాన్ని బోధించిన ముద్దుపళనినీ, ఆమెని గురువుగా భావించిన బెంగుళూరు నాగరత్నమ్మనూ ఈ వ్యాసకర్త ఏమీ అనకుండా; ముద్దుపళనిని సహేతుకంగానే విమర్శించిన వీరేశలింగం గారిని మాత్రం 'మగస్వామ్యానికి మద్దతు' ఇచ్చిన 'మగ సంస్కర్త' అని అధర్మాగ్రహం ప్రకటించారు. అంతేనా, భార్యలున్న సంపన్న పురుషుల విలాసాలనూ, కామవాంఛలనూ తీర్చే వృత్తులలోకి, కొన్ని కుటుంబాల స్త్రీలని పాత సమాజం బలవంతాన నెడితే, వాళ్ళని 'కళల్లో ఆరితేరిన' వారిగా, జమీందారులనూ, వ్యాపారస్తులనూ 'అలరించి'(?) 'ప్రతిఫలంగా ఆస్తిని పొంది, స్వతంత్రంగా బతికిన' వారిగా వ్యాసకర్త కీర్తించారు! ఈ కీర్తనని మించిన 'మగస్వామ్యం' ఉండదు! భార్యలున్న పురుషుల్ని, 'ప్రత్యేక సమూహాలకు చెందిన స్త్రీలు,' 'అలరించడం' అంటే అర్థం ఏమిటి? ఆ పురుషుల భార్యల మనోవేదన, ఈ 'మగస్వామ్య' విరోధి అయిన వ్యాసకర్తకి పట్టదా? 'మగస్వామ్య' శృంగారాన్ని అందించినందుకు, 'ప్రతిఫలంగా ఆస్తి'ని పొందడంలో ఉన్న అల్పత్వం అర్థం కాలేదా? లక్షలాది కౌలురైతుల శ్రమను 'కౌలు' రూపంలో దోచుకోబట్టే గదా ఆ జమీందారులకి ఆ 'ఆస్తి' సమకూరింది? ఆ రక్తపు కూడులో కొంత భాగాన్ని, విలాస పురుషులు ఇస్తే, అది తినేవాళ్ళని 'స్వతంత్రంగా బతికేవాళ్ళు' అని అనవచ్చునా? కొత్త చట్టాల వల్ల, దేవదాసీలు, 'అందరికీ శరీరాలు అమ్ముకునే స్త్రీలుగా' దిగజారాల్సి వచ్చిందని వాపోయారు వ్యాసకర్త. దేవదాసీలు గానీ, 'వివిధ పేర్లున్న సమూహాల స్త్రీలు' గానీ, ఆ చట్టాలు రాకముందు, అందరికీ కాకపోయినా, ధనిక పురుషులకు 'శరీరాలను అమ్ముకునే' స్థితిలో లేరా? 'అలరించడం' అంటే వేరే అర్థం ఉందా?

> స్త్రీలకైనా, పురుషులకైనా చెప్పవలిసింది ఏమిటంటే, బట్టల పెట్టుబడిదారులు ఎక్కువ లాభాల కోసం పోటీలు పడి, వెరైటీ పేరుతో తయారు చేయించే అడ్డమైన, అంగాంగ ప్రదర్శనలకు అనువైన బట్టలు మనం వేసుకోవద్దు. అవి మనల్ని భోగ్య వస్తువులుగా, కామ క్రీడా వస్తువులుగా తయారు చేస్తాయి. వాటిని, ఎటువంటి ఆలోచనా లేకుండా అనుసరిస్తే, మనల్ని మనమే వస్తువులుగా తయారు చేసుకున్నవాళ్ళం అవుతాం.



(3) 'మగస్వామ్యం' అనే నీడతో యుద్ధం చేసే క్రమంలో, వ్యాసకర్త, కొన్ని పొరపాటు సూత్రీకరణలు చేశారు. గతిలేక, బలవంతంగా జరిగే 'రాక్షస రతి'ని, 'సెక్స్ వర్క్' అనీ, 'లైంగిక శ్రమ' అనీ వర్ణించారు. అది, 'పని' అనీ, 'శ్రమ' అనీ అంటే, ఆ పనికి, కుదిరిన బేరం ప్రకారమే 'డబ్బు' ఇచ్చాంగా అనరా, మగస్వాములు? (4) 'సినిమాల్లో నటించే స్త్రీలకి, స్వతంత్ర జీవితమూ, డబ్బూ, స్వేచ్ఛా, వృత్తి రీత్యా లభిస్తుంది' అని ఒక భ్రమని కల్పిస్తున్నారు వ్యాసకర్త. మరి 'కాస్టింగ్ కౌచ్' సమస్యా, 'మీ టూ ఉద్యమం' సంగతులేమిటి? (5) స్త్రీ వాదం మగస్వామ్య దృక్కోణాన్ని ఎండగట్టిందని ఇంకో అవాస్తవ ప్రకటన చేశారు వ్యాసకర్త. ఈ ప్రస్తావించిన 'స్త్రీ వాదం' చేసిన ఘనకార్యం ఏమిటంటే, స్త్రీలని ఫ్యూడల్ అసమానత్వం నించీ, సమానత్వంలోకి కాకుండా, పెట్టుబడిదారీ అసమానత్వం లోకే తీసికెళ్ళింది. అందుకే అది, యూనివర్శిటీలలో ఐక్యం అయి, ఫెలోషిప్పులూ, చైర్లూ, ఇతర పదవులూ సంపాదించడం ద్వారా అధికార వ్యవస్థ ఒడిలో ఇమిడిపోయింది. ఆ పేరుతో కొందరు, అవార్డులూ, రివార్డులూ సంపాదించుకున్నారు. దోపిడీ ఆస్తి విధానాన్నీ, స్త్రీ–పురుషుల మధ్య ఇంటా బయటా ఉన్న అసమాన శ్రమ విభజననీ ప్రశ్నించని స్త్రీవాదం, స్వచ్ఛంద సంస్థలకు వచ్చే నిధుల కోసం ఎదురుచూసే స్థితిలోనే వుండిపోయింది.

(6) చివరిగా, స్త్రీలకైనా, పురుషులకైనా చెప్పవలిసింది ఏమిటంటే, బట్టల పెట్టుబడిదారులు ఎక్కువ లాభాల కోసం పోటీలు పడి, వెరైటీ పేరుతో తయారు చేయించే అడ్డమైన, అంగాంగ ప్రదర్శనలకు అనువైన బట్టలు మనం వేసుకోవద్దు. అవి మనల్ని భోగ్య వస్తువులుగా, కామ క్రీడా వస్తువులుగా (ఆబ్జెక్ట్ ఆఫ్ సెక్స్ అండ్ ఎంజాయ్‌మెంట్) తయారు చేస్తాయి. వాటిని, ఎటువంటి ఆలోచనా లేకుండా అనుసరిస్తే, మనల్ని మనమే వస్తువులుగా తయారు చేసుకున్నవాళ్ళం అవుతాం (సెల్ఫ్–ఆబ్జెక్టిఫికేషన్). ధనస్వామ్య వ్యతిరేక చైతన్యం మనకు లేనప్పుడు, పెట్టుబడిదారులు తమ సరుకుల ద్వారా, మనకు లేని అవసరాలనూ, హేతుబద్ధత లేని అభిరుచుల్నీ, మన మాటల తీరునీ, అన్నిటినీ మనకు తెలియకుండానే మన మీద రుద్దుతారు– అని హెర్బర్ట్ మార్క్యూజ్ అనే విమర్శకుడు చేసిన హెచ్చరికను మనం మరిచిపోకూడదు, 'ఏది సహజమైనదీ, ఏది తర్కానికి నిలబడుతుందీ' అని ప్రతీ దాన్నీ ఆలోచించి, ఆ ప్రకారం చేసుకోవాలి. మన శరీరానికీ, ఆకారానికీ, మనం ఉండే వాతావరణానికీ, మనం చేసే వృత్తులకూ, పనులకూ, సౌఖ్యంగా ఉండే బట్టలే వేసుకుందాం– అనే ధోరణిలో ఆలోచించుకోవాలి.

● బి.ఆర్.బాపూజీ



కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్

సమాంతర మార్కెట్‌కు తెరపడేనా!

కొనసాగుతున్న కొల్లిశారద కూరగాయల మార్కెట్ వివాదం

- జీఎంసీకి అర్నెల్లలో రూ.2.05 కోట్ల అద్దె నష్టం
- నిరాటంకంగా పాత సిండికేట్ వ్యాపారుల అక్రమ మార్కెట్
- కొత్త కమిషనర్ చర్యలపైనే నగర ప్రజల చూపు

హైకోర్టు ఆదేశాలు అమలయ్యేనా..

హైకోర్టు కొల్లి శారద మార్కెట్ వ్యవహారంపై స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ప్రభుత్వం ఆధీనంలో హోల్‌సేల్ మార్కెట్ ఒకటే ఉంటుందని, ప్రైవేట్ మార్కెట్‌కు అనుమతి లేదని స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో గత నెల నిర్వహించిన వేలంలో 23 దుకాణాలను గత పాటదారులే ఎక్కువ మంది దక్కించుకున్నారు.

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ఖజానాకు కాసుల వర్షం కురి పించాల్సిన కొల్లి శారద హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వివాదాలకు ఇంకా తెర పడలేదు. 25 ఏళ్లగా నామమాత్రపు అద్దెతో రూ.కోట్లు గడించిన పాత వ్యాపారుల సిండికేట్‌ను అధికారులు బద్దలు కొట్టినప్పటికీ, వారు సృష్టించిన 'సమాంతర మార్కెట్' వ్యవస్థ కార్పొరేషన్ ఆదాయానికి నిలువునా గండి కొడుతోంది. ఈ సమాంతర మార్కెట్ వ్యాపారుల ఆట కట్టించడంలో కార్పొరేషన్ అధికారులు విఫలమవుతున్నారు. దీనికి రాజకీయ చిక్కులు కూడా తోడవడంతో ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ఆరు నెలల పాటు సాగిన ఈ డ్రామాకు.. పక్షం రోజుల క్రితం బాధ్యతలు తీసుకున్న కొత్త కమిషనర్ ఎలా ముగింపు పలుకుతారని నగర ప్రజలు, కార్పొరేషన్ వర్గాలు ఆసక్తిగా చర్చించుకుంటున్నాయి.

రికార్డు స్థాయి వేలం మూణ్ణాళ్ల ముచ్చటే..

పాతికేళ్లుగా జీఎంసీకి కొల్లి శారద కూరగాయల మార్కెట్ ఆదాయం చాలా తక్కువ వచ్చేది. గతేడాది ఆగస్టు 18 నుంచి రెండు విడతల వేలంలో మొత్తం 81 దుకాణాలకుగాను.. 64 షాపులకు రూ.1.32 లక్షలు, 8 విభజిత షాపులకు రూ.66 వేలు, మరో 9 రిజర్వ్ షాపులకు రూ.66 వేలు చొప్పున ధరావత్తు చెల్లించి కొత్త వ్యాపారులు పాల్గొన్నారు. మొదటి విడతలో 58, రెండో విడతలో 23 దుకాణాలను రూ.6.05 కోట్లకు పైగా ఆదాయం వచ్చేలా రికార్డుస్థాయిగా వేలంలో అద్దెలు పాడుకున్నారు. దీనిని అడ్డుకునేందుకు పాత వ్యాపారులు చేయని ప్రయత్నం లేదు. బాహాబాహీకి కూడా దిగారు. కానీ, వేలం నిర్వహణలో అధికారులదే పైచేయి అయ్యింది. అయితే ఈ సంతోషం కార్పొరేషన్ అధికారులకు నాలుగు రోజులు కూడా నిలవలేదు.

ప్రశ్నార్థకంలో లీజుదారులు..

కొల్లి శారద మార్కెట్‌లో దుకాణాలను దక్కించుకున్న లీజుదారుల పరిస్థితి ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. 81 మంది వ్యాపారులు ఇప్పటికే రూ.కోటి వరకు డిపాజిట్ చెల్లించారు. అటు షాపులు తెరవలేక, ఇటు వ్యాపారం చేసే అవకాశం లేక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీంతో యూనియన్‌గా కోర్టును ఆశ్రయించారు. ఈ వివాదంతో గత ఆర్నెల్లలో అద్దె రూ.2.05 కోట్ల ఆదాయం నగర పాలక సంస్థ కోల్పోయింది.

బుడంపాడు అడ్డరోడ్డులో అక్రమ వ్యాపారం

వేలం పాటలో కొత్త వ్యాపారులు రంగంలోకి దిగడాన్ని పాత సిండికేట్ జీర్ణించుకోలేకపోయింది. మున్సిపల్ మార్కెట్‌ను దెబ్బ తీయాలని జాతీయ రహదారి వెంట ప్రైవేట్ స్థలం లీజుకు తీసుకుని పోటీ మార్కెట్ ఏర్పాటు చేసింది. అప్పటి కమిషనర్ పులి శ్రీనివాసులు అనుమతుల కోసం వెంట పడ్డారు. దీంతో అక్కడ ఖాళీ చేసి మరో చోటుకు మకాం మార్చినా ఆయన వదిలి పెట్టలేదు. అనంతరం రాజకీయ నేతల భరోసా లభించడంతో బుడంపాడు హైవే, సత్యసాయి ఆశ్రమం (మిగతా 6వ పేజీలో)

ఆ.. చేద్దాంలే!

కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై అధికారుల తీరిది..

- ఒక్క దేవస్థానం వద్దే ఏర్పాట్లు
- కొండ దిగువన ప్రారంభించని పనులు
- పది రోజుల్లో మహాశివరాత్రి ఉత్సవాలు
- మరమ్మతులకు నోచుకోని కొండ రహదారులు



దేవాలయం రాజగోపురానికి రంగులు

(కోటప్పకొండ(నరసరావుపేట), ఆంధ్రజ్యోతి):

ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల దగ్గర పడుతున్నా.. ఏర్పాట్లు ఇంకా ఒక దారికి రావడం లేదు. మహాశివరాత్రి పురస్కరించుకొని ఈ నెల 15న తిరునాళ్ల జరగనుండగా 13న ఏకాదశి నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. దీనికి ఇంకా పది రోజులే సమయం ఉన్నా.. భక్తులకు వసతులు కల్పించే విషయంలో సంబంధిత శాఖల అధికారుల ఆ.. చేద్దాంలే అన్న రీతిలో వ్యవహరిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. లక్షలాదిగా తరలి వచ్చే భక్తులకు వసతులు కల్పించేం దుకు విస్తృత ఏర్పాట్లు చేయాలి. కానీ, ఒక్క దేవస్థాన ప్రాంగణంలోనే ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. కొండ దిగువన పనులు ఇంకా ప్రారంభించ లేదు.

గోతుల మయంగా చిలకలూరిపేట మేజర్ తారు రోడ్డు



కొండపైన ఓకే..

కొండపైన దేవస్థానం ప్రాంగణంలో తిరునాళ్ల ఏర్పాట్ల పనులు చేపట్టారు. క్యూలైన్‌లకు తాటాకు పందిర్ల నిర్మాణం పూర్తయింది. వీవీఐపీ, వీఐపీలకు వేర్వేరుగా, శీఘ్ర, ఉచిత దర్శనం.. అభిషేకానికి (మిగతా 8వ పేజీలో)

నిధుల మాటెత్తని పాలకులు

తిరునాళ్ల ఏర్పాట్లకు ప్రభుత్వం ఇంకా నిధులు విడుదల చేయలేదు. దేవస్థానం ఈవో ఇందు కోసం లేఖ రాశారు. దీనిపై ఇంకా దేవదాయ శాఖ స్పందించలేదు. ఏర్పాట్లకు రూ.30 లక్షలు, ఏడేళ్ల బకాయిలు కూడా విడుదల చేయాలని లేఖలో ఈవో డి.చంద్రశేఖరరావు కోరారు. కొండ దిగువన భక్తుల కోసం ఏర్పాట్లకు ప్రభుత్వం నుంచి ప్రత్యే కంగా నిధులు విడుదల కాలేదు. వందలాదిమంది పోలీసులు బందోబస్తులో పాల్గొం టారు. వీరికి భోజన వసతికి పోలీసు శాఖ సొంతంగా సమ కూర్చుకోవాల్సిన పరిస్థితి. భక్తుల విరాళాలపై ఆ ధారపడాల్సి వస్తోంది. ఇదే పరిస్థితిని ఇతర శాఖలూ ఎదుర్కొం టున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి.

విజ్ఞానం..వినోదం



మెడికల్ మిస్టరీ మ్యూజియం

- వైద్య కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌కు సర్వం సిద్ధం
- ఆసక్తికరంగా పలు విభాగాల స్టాల్స్
- రేపు ప్రారంభించనున్న ఆరోగ్య మంత్రి సత్యకుమార్
- ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రదర్శన

8

గ్రామీణ పారిశుధ్యంలో అగ్రస్థానం

ఇంటింటి చెత్తసేకరణపై విశేష స్పందన

గుంటూరు సిటీ,ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ వ్యవస్థపై నిర్వహించిన రాష్ట్రస్థాయి సర్వేలో గుంటూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఐవీఆర్ఎస్ సర్వేలో జిల్లా ప్రజల నుంచి అత్యంత సానుకూల స్పందన లభించింది. మీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే ప్రశ్నకు 78.7 శాతం మంది 'అవును' అని సమాధానమిచ్చారు. వారానికి కనీసం రెండు సార్లయినా చెత్త సేకరణ జరుగుతోందా అనే ప్రశ్నకు 79.7 శాతం మంది సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 79.2 శాతం పాజిటివ్ రెస్పాన్స్‌తో గుంటూరు తొలి స్థానంలో నిలిచింది. చేబ్రోలు మండలం సుద్దపల్లి డొంక, దుగ్గిరాల మండలం పెరికలపూడి, పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం, ఫిరంగిపురం మండలం పునుగుపాడు గ్రామాల్లో నూరుశాతం పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ రావడం విశేషం. గ్రామీణ పారిశుధ్య నిర్వహణలో జిల్లా యంత్రాంగం, పారిశుధ్య సిబ్బంది, ప్రజల సమష్టి కృషికి నిదర్శనంగా నిలుస్తోంది. స్వచ్ఛతపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన గుంటూరు జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా నిలిపిందని అధికారులు పేర్కొన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న అధికారులు (పాత చిత్రం)

ఎంఎల్ఎస్ పాయింట్లోనే రైస్ డాన్ పాగా

- సీసీ కెమెరాలను సైతం లెక్కచేయని వైనం
- మామూళ్ల వసూలు కోసం ప్రత్యేకంగా అనుచరుడి ఏర్పాటు

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పేదల బియ్యాన్ని గద్దల్లా తన్నుకుపోతున్న రేషన్ మాఫియా జిల్లా పౌరసరఫరాల శాఖపై పంజా విసురుతోంది. మొత్తం అధికార యంత్రాంగాన్ని, ప్రభుత్వాన్నే సవాలు చేసే స్థాయికి చెలరేగిపోతోంది. మాఫియా డాన్ నేరుగా పౌర సరఫరాల శాఖలో చొరబడి తమ వ్యవహారాలను చక్కబెట్టుకుంటూ దర్జాగా తిరుగుతున్నాడు. ఇతర ఎంఎల్ఎస్ పాయింట్ల దగ్గర నుంచి మామూళ్ల వసూలు చేసుకుంటూ నల్లేరు మీద నడకలా తన అక్రమాలను కొనసాగిస్తున్నాడు. ఇంత జరుగుతున్నా జిల్లా పౌర సరఫరాల శాఖకు తెలియకపోవడం విచిత్రంగా ఉంది.

మామూళ్ల కోసం..

ప్రతి నెలా పేదలకు అవసరమై బియ్యాన్ని నిల్వ చేసి, వాటిని రేషన్ షాపులకు అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎల్ఎస్ పాయింట్‌ను పౌర సరఫరాల శాఖ ఏర్పాటు చేసింది. ఈ ఎంఎల్ఎస్ పాయింట్ నిర్వహణ కోసం ఒక ఇన్‌చార్జిని ఆ శాఖ నియమిస్తుంది. మొత్తం అజమాయిషీ అతడి చేతిలోనే ఉంటుంది. అతడిపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. అయితే గుంటూరులోని ఒక ఎంఎల్ఎస్ పాయింట్లో డాన్ పాగా వేశాడు. నేరుగా కాటా దగ్గర కాలు మీద కాలు వేసుకు కూర్చుని వ్యవహారాలను నడిపిస్తున్నాడు. గత నెల ఈ ఎంఎల్ఎస్ పాయింట్లోని పౌర సరఫరాల బియ్యం మొత్తం అతడి కనుసన్నల్లోనే రేషన్ షాపులకు వెళ్లాయంటే పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. ఈ నెల నుంచి ఆ బాధ్యతను డాన్ అనుచరుడికి అప్పగించారు. బియ్యం సరఫరా వ్యవహారాలతోపాటు, ఇతర ఎంఎల్ఎస్ పాయింట్ల మీద అజమాయిషీ, మామూళ్ల వసూళ్ల వంటి వ్యవహారాలన్నీ ఈ అనుచరుడే నిర్వహిస్తున్నాడు. ఎంఎల్ఎస్ పాయింట్లో సీసీ కెమెరాలు ఉంటాయన్న వెరపుకూడా లేకుండా ఈ వ్యవహారం నడుపుతున్నారు.

అడ్డూ అదుపు లేకుండా..

గుంటూరులోని ఈ ఎంఎల్ఎస్ పాయింట్లో నాలుగేళ్లుగా పాతుకుపోయిన ఇన్‌చార్జి అక్రమాలకు పాల్పడుతున్నాడన్న కారణంతో అతణ్ణి రెండు నెలల క్రితం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ చిత్తూరుకు బదిలీ చేశారు. అతడి బదిలీని జిల్లా అధికారులు పలుమార్లు వాయిదా వేస్తుండడంతో నేరుగా రాష్ట్ర కమిషనరే జోక్యం చేసుకుని ఆదేశాలు ఇచ్చారు. అతడి బదిలీని అక్రమార్కులు, వారితో చేతులు కలిపిన పౌర సరఫరాల శాఖలోని కొందరు ఉన్నత ఉద్యోగులు సద్వినియోగం చేసుకున్నారు. అకౌంట్స్ విభాగానికి చెందినవారిని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా నియమించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని పక్కనబెట్టి తమకు అనుకూలంగా ఉండే ఒక అకౌంట్స్ విభాగానికి చెందిన ఒకరిని ఇన్‌చార్జిగా నియమించారు. అతడు ఉద్యోగంలో చేరింది మొదలు మొత్తం వ్యవహారాన్ని డాన్‌కు అప్పగించేశాడన్న విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ వ్యవహారం మొదలైన దగ్గర నుంచి ఇప్పటికి జిల్లా నుంచి ఇద్దరు డీఎంలు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీఎం పర్యవేక్షణలో ఉంది. దీన్ని అవకాశంగా తీసుకుని డీఎం కార్యాలయంలోని ఒక సీనియర్ ఉద్యోగిని చక్రం తిప్పుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు ఉద్యోగిని నియమించడంలో కూడా ఆ ఉద్యోగి చక్రం తిప్పుతున్నారని తెలుస్తోంది. జిల్లా విజిలెన్స్ శాఖ కూడా ఈ వ్యవహారాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

11

అంబటి ఇంటిపై దాడి ఘటనలో.. టీడీపీ నేతలపై కేసు నమోదు

- కార్పొరేటర్ బుజ్జి సహా పలువురిపై ఫిర్యాదు చేసిన రాంబాబు
- దాని ఆధారంగా స్పందించిన పోలీసులు
- రాంబాబును కస్టడీకి ఇవ్వండి కోర్టులో పోలీసుల పిటిషన్
- రాష్ట్ర వ్యాప్తంగా రాంబాబు పై కేసులు

గుంటూరు డివిజన్‌లో.. రైల్వే ప్రాజెక్టుల పురోగతి ఇలా..

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్‌లో నిర్మాణ దశలో ఉన్న రైలు మార్గాల పురోగతిని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులు ఘనంగా జరిగాయని పేర్కొన్నారు. జోన్లు, డివిజన్ల వారీగా రైల్వే ప్రాజెక్టుల పురో గతి నివేదికని ఆయన వర్చువల్ విధానంలో సోమవారం సాయంత్రం విడుదల చేశారు. త్వరలోనే ప్రాజెక్టుల వారీగా జరిపిన నిధుల కేటాయింపులను ప్రకటిస్తామని తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఉన్న గుంటూరు రైల్వే డివిజన్ ప్రాజెక్టులు ప్రస్తుతం ఏ దశల్లో ఉన్నాయో ప్రకటించారు.

- నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలు మార్గం 2011-12లోనే మంజూరైనప్పటికీ 2014లో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పట్టాలెక్కింది. ఈ ప్రాజెక్టు మొత్తం దూరం 308.70 కిలోమీటర్లుగా కాగా అంచనా వ్యయం రూ.3,122 కోట్లుగా ఉంది. ఇప్పటి వరకు న్యూపిడుగురాళ్ల - శావల్యా పురం (45.850 కి.మీ), గుండ్లకమ్మ - కనిగిరి(79.469 కి.మీ) సెక్షన్లు పూర్తి అయ్యాయి. మొత్తంగా 125 కిలోమీటర్ల నూతన రైలు మార్గం పూర్తి కాగా కొద్ది రోజుల్లోనే కనిగిరి నుంచి వినుకొండ, శావల్యాపురం, న్యూపిడుగురాళ్ల, నడికుడి మీదగా సికింద్రాబాద్‌కి ఒక రైలుని నడిపేందుకు ప్రతిపాదించారు.
- ఎర్రుపాలెం - నంబూరు వయా అమరావతి నూతన రైలు మార్గం 2024-25లో మంజూరైంది. 56.53 కిలోమీటర్ల పొడవునా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరగనుంది. అంచనా వ్యయం రూ.2,047.40 కోట్లు కాగా ప్రస్తుతం భూసేకరణ దశ పురోగతిలో ఉంది.
- గుంటూరు - గుంతకల్లు రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుని కేంద్రం 2016-17లో మంజూరు చేసింది. 401.47 కిలోమీటర్ల పొడవునా దీని నిర్మాణం చేపట్టారు. అంచనా వ్యయం రూ.3,887.48 కోట్లు కాగా ఇందులో గాజుపల్లి - దిగువమెట్ట మధ్యన 30 కిలోమీటర్ల దూరం మినహా అంతా నిర్మాణం పూర్తి అయింది. ప్రస్తుతం రెండు క్లిష్టమైన సొరంగాలను తవ్వుతున్నారు.
- బీబీనగర్ - గుంటూరు డబ్లింగ్ ప్రాజెక్టుని కేంద్రం 2023-24లో మంజూరు చేసింది. 239 కిలోమీటర్ల పొడవునా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నిర్మించనున్న ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,853 కోట్లుగా ఉంది. గుంటూరు - పొందుగల మధ్యన 100 కిలోమీటర్ల దూరం పాటు పనులు జరుగుతున్నాయి.
- మోటుమర్రి - విష్ణుపురం(రైల్ వోవర్ రైల్‌తో) ప్రాజెక్టుని 2024-24లో కేంద్రం మంజూరు చేయగా గుంటూరు డివిజన్ పరిధిలో ప్రస్తుతం 36 కిలోమీటర్ల భూసేకరణ జరుగుతోంది. ఈ రైలు మార్గం పొడవు 99.68 కిలోమీటర్లు కాగా రూ.1,595.55 కోట్లను రైల్వే శాఖ మంజూరు చేసింది.





ఆనాటి దుర్ఘటనలపై దర్యాప్తు జరపండి

● డీజీపీని కోరిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ హయాంలో గురజాల నియోజకవర్గంలో కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు చేసిన దమనకాండ, దాడులు, హత్యాయత్నాలు, అత్యాచారాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను కోరారు. సోమవారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో యరపతినేని డీజీపీతో భేటీ అయ్యారు. 2019-24 మధ్య గురజాల నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు, కార్యకర్తలు, మహిళలపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో దాడులు చేశారని, ఎంతో మంది కాళ్లు చేతులు నరికేశారని ఆరోపించారు. వైసీపీ నేతల మైనింగ్ గుంతల్లో పడి 8 మంది చిన్నారులు చనిపోయారని, 12 మంది టీడీపీ నాయకులు హత్యలకు గురయ్యారన్నారు. వీటిపై ఫిర్యాదులు చేసినా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయలేదన్నారు. ఇటీవల పిన్నెల్లిలో జరిగిన ఘటనల గురించి ప్రస్తావించారు. ఈ ఘటనలపై విచారించి చర్యలు తీసుకోవాలని యరపతినేని డీజీపీని కోరారు.

గుంటూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా గుంటూరు మీదుగా కాకినాడ టౌన్, హిసార్ ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఏ.శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07705 కాకినాడ టౌన్-హిసార్ ప్రత్యేక రైలు ఈ నెల 19 నుంచి మార్చి 26వ తేదీ వరకు ప్రతి గురువారం వేకువజామున 5 గంటలకు బయలుదేరి ఉదయం 10.40కి గుంటూరు, 11.29కి సత్తెనపల్లి, 11.59కి నడికుడి, మధ్యాహ్నం 3.50కి చర్లపల్లి, శనివారం మధ్యాహ్నం 2.05కి హరియాణా రాష్ట్రంలోని హిసార్ చేరుకుంటుందన్నారు. రైలు నంబరు 07006 హిసార్-కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 22 నుంచి మార్చి 29 వరకు ప్రతి ఆదివారం రాత్రి 11.15కి బయలుదేరి బుధవారం రాత్రి 12.59కి సత్తెనపల్లి, 2.05కి గుంటూరు, ఉదయం 8.8కి కాకినాడ టౌన్‌కు చేరుకుంటుందన్నారు.



నాణ్యమైన పరిశోధనలకు అవకాశమివ్వాలి

● ఏఎన్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ● వర్సిటీలో రెండు రోజుల నేషనల్ వర్క్ షాప్ ప్రారంభం

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజ అభివృద్ధికి నాణ్యమైన పరిశోధనలకు అవకాశం కల్పించాలని ఏఎన్‌యూ తాత్కాలిక రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ కార్యశాల సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యశాలకు అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై. అశోక్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య సింహాచలం మాట్లాడుతూ గుణాత్మక పరిశోధనలతోనే సమాజంలో మార్పు వస్తుందని పేర్కొన్నారు. నాణ్యమైన పరిశోధన పత్రాలు రాసే నైపుణ్యాలను పరిశోధకులు పెంపొందించుకోవాలని సూచించారు. ఆంధ్ర శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎం.మునినారాయణప్ప మాట్లాడుతూ, పరిశోధన అంశం దాని టైటిల్ ఎంపిక ద్వారానే ఆసక్తి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీకి చెందిన ఆచార్య జీవి. రమణ, ఆచార్య ఎం. త్రిమూర్తి రావు, రూరల్ డెవలప్మెంట్ విభాగాధ్యక్షులు, మాజీ దూరవిద్య పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య కెపోంమేశ్వర్ ప్రసంగించారు. డాక్టర్ అంబేడ్కర్ చైర్ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ కార్యశాల ద్వారా పరిశోధకులకు కొత్త మెళకువలు నేర్చుకునే అవకాశం ఉంటుందని చైర్ ప్రొఫెసర్ ఆచార్య వై. అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అబ్రహం, విభాగం సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, ఎన్.అబ్రహం, పరిశోధకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ సింహాచలం

చంద్రబాబుకు క్లీన్‌చిట్ శుభపరిణామం

● ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయ చరిత్రలో అవినీతి మచ్చలేని ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో చంద్రబాబు నాయుడికి క్లీన్ చిట్ ఇవ్వడం శుభపరిణామమన్నారు. అవినీతి, అక్రమాలు, దోపిడీ ధ్యేయంగా గత ఐదేళ్ల వైసీపీ పాలన సాగించిందని విమర్శించారు. జగన్ కుట్ర పూరితంగా చంద్రబాబును జైల్లో నిర్బంధించి పైశాచిక ఆనందం పొందారన్నారు. నిరుద్యోగ యువత ఉన్నతంగా ఎదిగేలా చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ తీసుకొస్తే స్కామ్ అంటూ వైసీపీ ఆపాదించడం వారి రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. ఇప్పుడది అవాస్తవమని నిరూపితం కావడం శుభపరిణామమని జీవీ పునరుద్ఘాటించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాంట్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

నాదెండ్లలో ఎడ్ల పందేలు ప్రారంభం

● రెండు పళ్ళ విభాగంలో కొండెపాడు ఎద్దుల విజయం

నాదెండ్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నాదెండ్ల గ్రామ సమీపంలోని నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం వద్ద జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలు సోమవారం కోలాహలంగా ప్రా రంభమయ్యాయి. ఈ పోటీలను చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు ప్రారంభించారు. తొలి రోజు రెండు పళ్ళ విభాగంలో జరిగిన పోటీల్లో పది జతల ఎడ్లు పా ల్గొన్నాయి. ప్రత్తిపాడు మండలం కొండెపాడుకు చెందిన చాగంటి శ్రీనివాసరావు చౌదరి ఎడ్ల జత 3,527 అడుగుల దూరం బండను లాగి ప్రథమ బహుమతిని, నరసరా వుపేట మండలం దొండపాడుకు చెందిన యర్రం రాజశే ఖర్ ఎడ్ల జత 3,444 అడుగులు దూరం బండను లాగి ద్వితీయ బహుమతిని పొందాయి. బాపట్ల జిల్లా వేట పాలెంకు చెందిన ఆర్‌కే బుల్స్ 3,250 అడుగులు బండను లాగి తృతీయ బహుమతిని సాధించాయి. న్యాయ నిర్ణేతగా తంగెడ హసన్ వ్యవహరించారు. పోటీల్లో పాల్గొన్న ఎడ్ల యజమానులకు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు నగదు బహుమతి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, ఎస్ఐ ఆర్ వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మంగళవారం నాలుగు, ఆరు పళ్ళ విభాగాలలో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న సీఎస్ఆర్ బుల్స్ యజమాని చాగంటి శ్రీనివాస్ చౌదరి

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 542.80 అడుగులు ఉంది. ఇది 194.21 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8,023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7,852 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,200 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 18,375 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 18,375 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

5,700 మిర్చి టిక్కీల అమ్మకం

దాచేపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 6300 మిర్చి టిక్కీలు రాగా 5700 మిర్చి టిక్కీల అమ్మకం జరిగింది. 334వ రకం రూ.10 వేల నుంచి రూ. 22,500, తేజా రకం రూ. 9 వేల నుంచి రూ.19 వేలు, తాలు కాయలు రూ.3వేల నుంచి రూ. 9 వేలకు అమ్మకాలు జరిగాయి.

మిర్చియార్డు సమాచారం

(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	91,988
అమ్మకాలు	88,864
నిల్వ	16,212

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	23000
273	----	----
341	14000	25000
4884	----	----
సూపర్ 10	14000	22500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20000
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	24500
దేవనూరు డీలక్స్	15000	26000
ఆర్మూరు	12000	17500
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	22000
నెంబరు. 5	13500	21500
273	----	----
341	13000	23500
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
బ్యాడిగి 355	13500	23500
దేవనూరు డీలక్స్	15000	25000
తాలుకాయలు	7000	12000

పవన్‌ను తిట్టించినప్పుడు కాపు కులం గుర్తుకురాలేదా

● జగన్‌కు డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు ప్రశ్న

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలతో పవన్ కల్యాణ్‌ను అడ్డగోలుగా తిట్టించినప్పుడు కాపు కులం జగన్‌కు గుర్తుకు రాలేదా అని జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు వడ్రాణం హరిబాబునాయుడు ప్రశ్నించారు. వెల్లలూరులోని డీసీఎమ్ ఎస్ స్టాక్ పాయింట్ ప్రారంభించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని అన్నారు. అసభ్యపదజాలం వాడిన అంబటిపై చర్యలు తీసుకుంటే, దాన్ని కాపు కులానికి ఆపాదించటం వైసీపీ నీచ రాజకీయానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. తప్పు చేసిన వారిని చట్టం శిక్షిస్తే దాన్ని కులంపై దాడిగా చూపించడం జగన్ వక్ర రాజకీయాలకు తార్కాణమని మండిపడ్డారు. గతంలో పవన్‌ను వైసీపీ నేతలు అంబటి, పేర్ని నాని, బోరుగడ్డ అనిల్‌తో తింటించినప్పుడు జగన్‌కు కాపు కులం గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కులాల మధ్య చిచ్చు పెట్టే రాజకీయాలు మానుకోవాలని, లేకుంటే రాష్ట్రంలోనే కనపడకుండా ప్రజలు వైసీపీ నాయకులను తరిమికొడతారని హరిబాబు హెచ్చరించారు.

ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యా ల యం గతేడాది నవంబర్‌లో నిర్వహించిన ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను సోమవారం పరీక్షల నిర్వహణాధికారి అలపాటి శివప్రసాద్ విడుదల చేశారు. రివల్యూషన్ దరఖాస్తు చేసుకునే వారు ఈ నెల 11వ తేదీ లోపు రూ.1860 చెల్లించి 12వ తేదీలోపు తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్లో పొందుపరిచామన్నారు.

కల్తీనెయ్యి కేసు దృష్టి మరల్చడానికే డ్రామాలు

● అంబటి, జోగిలను జగన్ ఉసిగొల్పారు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కల్తీనెయ్యి కేసు నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే జగన్ అంబటి, జోగిలను ఉసిగొల్పారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. సోమవారం చిలకలూరిపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుట్ర, కుతంత్రాలు, విద్వేష విధ్వంసాలే కేంద్రంగా, రాష్ట్ర వినాశనమే లక్ష్యంగా జగన్ సాగిస్తున్న క్రిమినల్ పాలిటిక్స్‌ను ప్రజలు ఎప్పటికీ విశ్వసించరన్నారు. అభివృద్ధిలో రాకెట్ స్పీడ్‌తో దూసుకుపోతున్న చంద్రబాబును నిలువరించడం జగన్ తరం కాదన్నారు. స్కిల్ కేసు విచారణలో భాగంగా సిట్ చంద్రబాబు పాత్రకు క్లీన్ చిట్ ఇవ్వడాన్ని తప్పుపట్టిన వైసీపీ నేతలు నేడు ఈడీ క్లీన్‌చిట్‌కు ఏం వక్రభాష్యాలు చెబుతారని ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు.

సమాంతర మార్కెట్‌కు తెరపడేనా!

(5వ పేజీ తరువాయి)

సమీపంలో సమాంతర మార్కెట్‌ను నిరాటంకంగా కొనసాగిస్తున్నారు. ఇక్కడ రోజుకు రూ. కోటి, శనివారాల్లో రూ.2 కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది.

ఐదు దుకాణాల వేలం సంగతేంటీ?

కొల్లి శారద మార్కెట్‌లో ఖాళీగా ఉన్న ఐదు షాపులను ఓ రాజకీయ నేత చెప్పాడని ఆక్షన్ పెట్టకుండా పక్కన పెట్టారు. ఆ నేత తన చుట్టూ తిరుగుతున్న కొందరు చోటామోటా నాయకులకు ఆ షాపులను కేటాయించాలని అప్పటి కమిషనర్ పులి శ్రీనివాసులను ఆదేశించగా వేలం నుంచి పక్కన పెట్టినట్లు తెలిసింది. ఇప్పుడు వాటి సంగతేంటన్న ప్రశ్న సర్వత్రా వ్యక్తమవుతుంది. సదరు రాజకీయ నేత ఒత్తిళ్లకు తలొగ్గి.. 5 షాపులను కేటాయిస్తే.. పెద్ద ఎత్తున ఆందోళనకు మరో వర్గం సన్నద్ధమవుతోంది.

మోటారు సైకిళ్ళ దొంగ అరెస్ట్

● మూడు బైక్‌లు స్వాధీనం

బాపట్ల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్ళ దొంగను పట్టణ మహిళా ఎస్సై షేక్ నస్రీన్ సిబ్బందితో కలిసి సోమవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ఆర్. రాంబాబు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని చిల్లరగొల్లపాలేనికి చెందిన చెడుగుడి అబిరాం వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతుంటాడు. ఇతనిపై గతంలో బాపట్ల పట్టణ పోలీసుస్టేషన్‌తోపాటు గుడూరు వన్‌టౌన్, టూటౌన్ పోలీసు స్టేషన్‌లలో కేసులున్నాయి. బాపట్ల రైల్వేస్టేషన్ కూడలిలో అబిరాంను అరెస్ట్ చేసి మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ కే మయూర్ అశోక్

ఫిర్యాదుల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలి

● కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్, కాల్ సెంటర్‌కి అందే ఫిర్యాదులను కేటగిరిలుగా వేరు చేసి ఒక్క రోజులోనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పరిష్కారానికి జాప్యం జరిగితే తగిన వివరాలను అర్జీదారులకు తెలియచేయాలని కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అర్జీలను తీసుకున్నారు. ఈ సందర్భంగా తొలుత ఆధార్ సీడింగ్, జీఆర్పీ సేవల కోసం అనేక రోజుల నుండి అర్జీలు ఇస్తున్నామని అరుణ (సాయిబాబానగర్), పద్మావతి (గోరంట్ల), రమేష్ (గుండారావుపేట) కమిషనర్ దృష్టికి తీసుకురాగా తక్షణం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి, అర్జీదారుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ సచివాలయం పరిధిలో అందాల్సినసేవల గురించి జీఎంసీకి ఎవరైనా ప్రజలు వస్తే సంబంధిత సచివాలయ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 63 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, సిటి ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వరరావు, మేనేజర్ బాలాజీ బాష పాల్గొన్నారు.

హెడ్ వాటర్ వర్క్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

నగరానికి తాగునీరు సరఫరా చేసే హెడ్ వాటర్ వర్క్స్‌లో సిబ్బంది, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నీటి సరఫరాకి ముందే క్లోరిన్ తగు మోతాదులో ఉండేలా చూడాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. జీఎంసీ హెడ్ వాటర్ వర్క్స్, మానస సరోవరం, నందివెలుగు రోడ్డు ఆర్వోబీ, నార్ల ఆడిటో రియం, అన్నమయ్య చెరువు వాకింగ్ ట్రాక్‌లను సోమవారం విభాగాధిపతులతో కలిసి పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాకి అవసరమైన మోటార్లు మరమ్మతుకు గురై, నెలలు గడిచినా చేయకపోవడం తెలుసుకొని, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం మోటార్లకు మరమ్మతు చేయించాలని ఎస్ఈని ఆదేశించారు. మానస సరోవరం పార్క్, నార్ల ఆడిటోరియం పరిశీలించి, వాటి అభివృద్ధికి ఇప్పటి వరకు ఉన్న ప్రతిపాదనలను అందించాలని సిటి ప్లానర్, ఎస్ఈలను ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ ఎం.పద్మశ్రీ, సీపీ రాంబాబు, ఎస్ఈ వెంకటేశ్వరరావు, ప్రజారోగ్య, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజులు నెలాఖరులోగా చెల్లించాలి

నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి వ్యాపార సంస్థ ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, 2026-27 ట్రేడ్ ఫీజులు జనరేట్ అయినందున నెలాఖరులోపు చెల్లించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నామని, తమ అవుట్ డోర్ ఇన్‌స్పెక్షన్లలో వాటిపై దృష్టి సారిస్తామని తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా గుర్తిస్తే వారితో పాటు సంబంధిత శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్లపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్ ఫీజులు ఈ నెలాఖరులోపు చెల్లించాలని, లేకుంటే మార్చి 1వ తేదీ నుంచి బకాయిలపై 25 శాతం అపరాధ రుసుం విధించబడుతుందని తెలిపారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ పార్టీ నేతలు

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాల తరబడి సేవలందించిన పలువురు నాయకులు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరారు. భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్ నారాయణ సమక్షంలో తూర్పు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, హోంగార్డ్స్ హెల్పర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వివిధ బాధ్యతలు నిర్వర్తించిన రావూరు లక్ష్మీనారాయణ శాస్త్రి తన అనుచరులతో బీజేపీలో చేరారు. అదేవిధంగా నల్లపాడుకు చెందిన హబీబున్నీసా కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, తద్వారా ఎక్కువ మంది పార్టీకి ఆకర్షితులయ్యే విధంగా పని చేసి వారిని పార్టీలో చేరే విధంగా కృషి చేయాలని కోరారు. వల్లూరు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ దేశంలో అత్యధిక సభ్యులు గల ఏకైక పార్టీ భారతీయ జనతాపార్టీ అని, ఈ పార్టీలో ఒకసారి కండువా కప్పుకొని పార్టీలో చేరితే వారి ఒళ్లంతా పులకరించి పోతుందన్నారు. నూతనంగా చేరిన రావూరు లక్ష్మీనారాయణ శాస్త్రి మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పరిపాలనకు ఆకర్షితులై తాను పార్టీలో చేరానన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్పైసెస్ బోర్డు డైరెక్టర్ కేవీ సుబ్బారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, భజరంగ్ రామకృష్ణ, తోట శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ శ్రావణకుమారి పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలోకి చేరిన పలువురు నాయకులు

రహదారుల భద్రతలో స్వదేశీ పరిజ్ఞానానికి కృషి చేయాలి

● నిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ శంకర్

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రహదారుల భద్రతలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రహదారుల నిర్మాణానికి యువ ఇంజనీరింగ్ విద్యార్థులు కృషి చేయాలని నిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శంకర్ సూచించారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం అధ్వర్యంలో క్లాస్ రూమ్ టు హైవేస్ కెరీర్స్, ఎథిక్స్ అండ్ నేషన్ బిల్డింగ్ త్రూ రోడ్ ఇంజనీరింగ్ అంశం పై సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. డాక్టర్ శంకర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రోడ్డు నెట్ వర్క్ కలిగిన దేశంగా భారత్ నిలిచిందని, రీసైకిల్ చేసిన ప్లాస్టిక్, జియో సింథటిక్స్ వినియోగంతో పాటు డ్రోన్లు, ఆధునిక సాంకేతికతలు రహదారుల నిర్మాణ నాణ్యతను గణనీయంగా పెంచుతున్నాయని తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఏ.శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ పి.సమతా చౌదరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్ శంకర్, పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులు

రెవెన్యూ క్లినిక్‌లో అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ● పీజీఆర్ఎస్‌కు 395 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్వో ఖాజావలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలతో పాటు రెవెన్యూ క్లినిక్‌లో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీజీఆర్ఎస్‌కు 243, రెవెన్యూ క్లినిక్‌కు 152 మొత్తం 395 అర్జీలు అందాయి. రెవెన్యూ క్లినిక్‌లో జేసీ అశుతోష్ శ్రీ వాస్తవ, ఆర్డీవో శ్రీనివాసరావు, పీజీఆర్ఎస్‌లో డీఆర్వో ఖాజావలీతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యటించి భూ సమస్యలకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలన్నారు. ప్రజలు అందించిన అర్జీలను సంబంధిత శాఖలు, తీసుకుంటున్న చర్యలను నిరంతరం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మికుమారి, శ్రీనివాసరావు, డీపీవో బీవీ నాగసాయికుమార్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా ఉద్యానశాఖ డీడీ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

● పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తిని ముగ్గురు కుమార్తెలకు చెందకుండా ఒక్కరే కుమార్తెగా చూపించుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుందని, ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ పాత గుంటూరుకు చెందిన కరేటి పద్మావతి, వెంకట శివరామకృష్ణ, లక్ష్మీ వినతిపత్రం అందజేశారు. తాడిబోయిన సామ్రాజ్యం తనకు అక్క, చెల్లెలు ఉన్నప్పటికీ.... ఒక్క కుమార్తెనని నమ్మించి సుద్దపల్లిడొంక వద్ద డి- నెంబరు 955లో ఉన్న 2.05 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. తక్షణం ప్రభుత్వ అధికారులు స్పందించి అక్రమంగా జరిగిన రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

● టిడ్కో ఇంటికి చెల్లించిన డిపాజిట్‌ను వెనక్కి ఇవ్వాలని కోరుతూ స్థానిక అడవి తక్కెళ్లపాడుకు చెందిన పి.రామచంద్రరావు అర్జీ అందజేశారు. టిడ్కో ఇంటి కోసం 2017లో రూ.లక్ష చెల్లించేలా, 2018లో ఇల్లు కేటాయిస్తూ మున్సిపల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. 2024లో రిజిస్ట్రేషన్ చేశారని, కాకపోతే రిజిస్ట్రేషన్ సమయంలో గతంలో చెల్లించిన రూ.లక్షలో రూ.50 వేలు తిరిగి ఇస్తామని చెప్పారని వివరించారు. డిపాజిట్ అందించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

● గతంలో ఉన్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు యన్నం సుధీర్‌కుమార్, సీనియర్ నాయకుడు లింగంశెట్టి ఈశ్వరరావు వినతి పత్రం అందజేశారు. నూతనంగా తీసుకువచ్చిన ఉపాధి చట్టంతో కార్మికులకు న్యాయం జరగదని అన్నారు. నిధులు మొత్తం కేంద్రమే భరించాలని, ఎట్టి పరిస్థితులలో ఈ పథకాన్ని రాష్ట్రాలకు అప్పగించవద్దని కోరారు. పని దినాలను, కూలీ రేట్లను గణనీయంగా పెంచి కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు.



క్రీడా కారులను పరిచయం చేసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మాణిక్యరావు

ఉత్కంఠభరితంగా టి10 క్రికెట్ టోర్నమెంట్

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జేకేసీ కళాశాల మైదానంలో ఏపీ పవనిజం అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టి 10 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. రెండో రోజు నిర్వహించిన మ్యాచ్‌లలో యువ క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతూ అద్భుత ఆటతీరు ప్రదర్శించారు. నిర్వాహకులు కొణిదే మోహన్ గోపి కృష్ణ మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకుడు మన్నెం శివ నాగ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. క్రీడాకారులను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు పరిచయం చేసుకున్నారు.

విజ్ఞాన్ నిరుల విద్యార్థిని ప్రతిభ

● సౌత్ జోన్ ఖోఖో టీంకు ఎంపిక

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ నిరులా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో బీ.టెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని డి.కీర్తన జేఎన్ యూకే విశ్వవిద్యాలయ మహిళల ఖో-ఖో సౌత్ జోన్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిన్సిపల్ రాధిక మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచేలా సంస్థ ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. విద్యార్థినిని ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ కిషోర్ కుమార్ అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ పాతూరి రాధిక తదితరులు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి శ్రమించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర మహిళా కన్వీనర్ పద్మ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర మహిళా కన్వీనర్ పి.పద్మ అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సోమవారం పట్టాభిపురంలోని మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోపాటు సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి మన్నవ సురేష్, అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, బాలచంద్రారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా అదనపు కార్యదర్శి ప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వీరబాబు తదితరులు పాల్గొన్నారు. తొలుత సరస్వతి విగ్రహానికి పూలు వేసి వేడుకలు నిర్వహించారు.



సరస్వతిదేవి విగ్రహం వద్ద ఏపీయూఎస్ నాయకురాలు పద్మ తదితరులు

బడ్జెట్‌తో సామాన్యులకు ఒరిగే ప్రయోజనం లేదు

● చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు ఆంజనేయులు

గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో సామాన్యులకు కొత్తగా ఒరిగే ప్రయోజనం లేదని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు అభిప్రాయం వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రకటనపై ఆయన సోమవారం జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో మాట్లాడారు. ఆదాయ పన్నుల శ్లాబుల్లో ఎటువంటి మార్పులు లేవని, ఆశించిన స్థాయిలో వ్యవసాయ రంగానికి నిధులు మంజూరు చేయలేదన్నారు. వ్యవసాయ ఆధారిత పనిముట్లపై పన్ను ఎత్తివేయలేదన్నారు. ఒక వైపు ధరలు పెరిగినా జీఎస్టీ శ్లాబులు తగ్గిస్తే బాగుండేదన్నారు. మొత్తానికి ఏపీ అమరావతి, పోలవరానికి నిధులు, ఫిష్ యార్డు, ప్రకృతి వ్యవసాయానికి నిధులు, కొత్త రైళ్ళు వంటివి కేటాయించటంపై సంతోషదాయకమన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉన్న మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం పాఠశాల విద్యా కమిషనర్ కె.విజయరామరాజుకు వినతిపత్రం సమర్పించారు. 2022లో మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖ పరిధిలోకి తీసుకువచ్చారని అప్పటి నుంచి ఈ ఉపాధ్యాయులకు జీతం నుంచి పీఎఫ్ తగ్గింపు జరగడం లేదని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు జె.శ్రీనివాసరావు వి. జయప్రకాష్ నాయుడు, వెంకటరమణ, కె.సత్యనారాయణరాజుపాల్గొన్నారు.



విజయరామరాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఎన్ఏటీఏ నాయకులు

అవగాహనతోనే డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే డిజిటల్ మోసాలకు నివారించుకోగలుగుతామని హెల్ప్ ఏజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పులి శ్యామ్ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ప్రాంగణం, అన్నమయ్య కళావేదికపై సోమవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మహిళా విభాగం ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిజిటల్, సైబర్ మోసాలు జరిగే తీరుతెన్నులు, వాటి నుంచి రక్షించుకొనే మార్గాలను ప్రయోగాత్మకంగా పులిశ్యామ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమాన్ని ఆచార్య వెలువేలు నాగరాజ్యలక్ష్మి నిర్వహించగా, డాక్టర్ తుమ్మగుంట రాధాబాయి సభకు అధ్యక్షత వహించారు.

లాలాపేట గ్రూప్ దేవాలయాల్లో హుండీల లెక్కింపు పూర్తి

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పాత బస్టాండ్‌లోని లాలాపేట గ్రూపు దేవాలయాల హుండీ లెక్కింపు పూర్తయిందని, మూడు ఆలయాలలో మొత్తం రూ.9.70 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఏసీ టి.సుభద్ర సోమవారం తెలిపారు. కొత్తపేట జగన్నాథస్వామి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.16,106 వేలు, నాజ్ సెంటర్ ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.3,76,123 లక్షలు, పాత బస్టాండు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల ద్వారా రూ.5,77,870 నగదు వచ్చినట్లు ఆమె తెలిపారు. 10 దుబాయ్ దీనార్, అమెరికా 33 డాలర్లు, 28 గ్రాముల బంగారం, 918 గ్రాములు వెండి లభించినట్లు ఏసీ సుభద్ర పేర్కొన్నారు.



వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఏసీ సుభద్ర

వైభవంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామికి శ్రీ చక్రస్నానం నిర్వహిస్తున్న వేద పండితులు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం, శ్రీ సత్యనారాయణస్వామి ఆలయ 49వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిసాయి. మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. నిత్య హోమం బలిహరణ, చతుస్నానార్చన, శ్రీ సూక్త హోమం, అవబృ దోత్సవం, వసంతోత్సవం శ్రీ చక్రస్నానం, పూర్ణాహుతి, ధ్వజారోహణ, మౌన బలి, ద్వాదశి ప్రదక్షిణలు జరిగాయి. సినీ గాయకుడు శ్రీకృష్ణ తేజ, గాయనీ లు వేమూరి లక్ష్మీ కామేశ్వరి, క్రోవిడి లక్ష్న్యాళిజలిలు తమ గాత్ర ధారణలో పలు భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను అలరింపజేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ చావలి గణపతి, ఉత్సవ కమిటీ కన్వీనర్ రావిపాటి సత్యనారాయణ పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. డి 13 సెక్షన్ పరిధిలోని జియావుద్దీన్‌నగర్, గాంధీనగర్, రాహుల్‌గాంధీ నగర్ ఏరియాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

తిరుమల లడ్డూపై పోస్టర్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూలో కల్తీ అంటూ దుష్ప్రచారం చేస్తూ, హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా పోస్టర్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, కార్పొరేటర్‌లు ఆచారి, అచ్చాల వెంకటరెడ్డి, రోషన్, బోడపాటి కిషోర్, పలువురు నాయకులు అరండల్‌పేట పోలీసులకు సోమవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వైసీపీపై దుష్ప్రచారం చేసేలా పోస్టర్లు వేయటంతో పాటు తిరుమల లడ్డూ పవిత్రత దెబ్బతీసేలా పోస్టర్లు వేయటం దారుణమన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన డేగల ప్రభాకర్

వైసీపీవన్నీ పక్కదారి రాజకీయాలు

● ప్రతి ప్రాంతంలో వేగవంతంగా అభివృద్ధి పనులు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీవన్నీ పక్కదారి పట్టించే రాజకీయాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నగరంలోని కొత్తపేట శివ నాగరాజు కాలనీలో రూ. 2.50 విలువైన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు సోమవారం ఆయన ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి వెలుగులు తీసుకొచ్చామన్నారు. గత ఐదేళ్ల కాలంలో తూర్పు నియోజకవర్గాన్ని పూర్తిగా నాశనం చేశారని మండిపడ్డారు. యూజీడీ పనులను పక్కన పడేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కనీసం పాదచరులు కూడా తిరిగే పరిస్థితి లేకుండా పోయిందని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తూర్పు నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్ని వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. 20 ఏళ్లుగా మొండిగేటు విస్తరణ లేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ క్రమంలో రైల్వే అధికారులతో చర్చించి రూ.8 కోట్ల నిధులు విడుదల చేయించామని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంలో వైసీపీ ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పార్టీ శ్రేణులు వైసీపీ కుట్ర రాజకీయాల్లో పడవద్దని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పోతురాజు సమత, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు కేటాయింపులు జరగాలి

● ఎమ్మెల్యే నసీర్‌కు సంఘ నాయకుల వినతి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీలో ఈనెల 14న ప్రవేశపెడుతున్న రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు కేటాయింపులు జరగాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తూర్పు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులకు వారు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు టీవీ రామిరెడ్డి మాట్లాడుతూ ముగ్గురు సభ్యుల వేతన సవరణ కమిషన్ ఏర్పాటుతో పాటు, పెండింగ్ డీఏలు, మధ్యంతర భృతి తదితర ఆర్థికపరమైన అంశాలలో కేటాయింపులు జరగాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి, పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండును పరిష్కరించాలన్నారు. సమస్యలను శాసనసభలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తామని ఎమ్మెల్యేలు హామీ ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి వై.నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, వజ్జా పెద్దరత్తయ్య, శరత్ బాబు, పోతురాజు, నాగభూషణం, శోభన్ బాబు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.హేమలత తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. ఆల్ మైనారిటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రచురించిన 2026 డైరీని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ ఆయన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఆయన సంఘ ప్రతినిధులతో మాట్లాడుతూ మైనార్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి తాను ఎప్పుడు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ జానీబాషా, గుంటూరు జిల్లా అధ్యక్షుడు కార్పొరేషన్ బాషా షేక్, రిటైర్డ్ ఆర్డీవో షేక్ ఇస్మాయిల్, రిటైర్డ్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మస్తాన్ షరీఫ్, గఫార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

అంబటి, జోగి రమేష్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలి

● పాత గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబు, జోగి రమేష్‌ల పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు పాత గుంటూరు స్టేషన్‌లో సీఐ వెంకట ప్రసాద్‌కి సోమవారం ఫిర్యాదు చేశారు. కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న చంద్రబాబు నాయుడు, లోకేశ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆ విధంగా వ్యాఖ్యలు చేసిన వారిద్దరిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జాగర్లమూడి శ్రీనివాసరావు, యల్లవుల అశోక్, ఇర్రి సాయి, ఏల్చూరి కిరణ్, దేవళ్ల వెంకట్, అల్లం బాజీ, కొలగాని సుబ్బారావు, షేక్ రబ్బానీ, చెన్నంశెట్టి నరసింహారావు, దాసరి చంద్రకాంత్, జ్యోతుల జశ్వంత్, బట్టా రాజా, ముత్తాబత్తిన సాయి, షేక్ రియాజ్, రామిశెట్టి భరత్, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

అంబటి రాంబాబుపై కేసు నమోదు చేయాలి



లాలాపేట సీఐ శివప్రసాదుకు ఫిర్యాదు చేస్తున్న తూర్పు నియోజకవర్గ టీడీపీ నాయకులు

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదు చేయాలని సోమవారం లాలాపేట సీఐ శివప్రసాదుకు తూర్పు నియోజకవర్గ టీడీపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ఇష్టమొచ్చిన రీతిలో అంబటి వ్యాఖ్యలు వెనుక కుట్ర దాగి ఉందన్నారు. కుల రాజకీయాలను తెరపైకి తీసుకువచ్చి కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నాడని ఆరోపించారు. భవిష్యత్తులో మరో వైసీపీ నాయకుడు అసభ్యంగా మాట్లాడకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో టీడీపీ నాయకులు మల్లెంపూడి శ్రీనివాసరావు, నూరే శ్రీనివాసరావు, చల్లా ఆంజనేయప్రసాదు, బ్రహ్మసాని శ్రీనివాసరావు, సతీష్‌బాబు, షాజహాన్ బేగ్, వేముల శ్రీను, శంకర్, వహీద్ తదితరులు పాల్గొన్నారు.



మధుమేహంపై అవగాహన స్టాల్

విజ్ఞానం వినోదం

- వైద్య కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌కు సర్వం సిద్ధం
- ఆసక్తికరంగా పలు విభాగాల స్టాల్స్
- రేపు ప్రారంభించనున్న ఆరోగ్య మంత్రి
- ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రదర్శన

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ (మెడ్ ఫ్యూజన్ 26) నిర్వహణకు సర్వం సిద్ధమైంది. రూ.2 కోట్ల వ్యయంతో ఆకర్షణీయంగా, వినోదాత్మకంగా, విజ్ఞాన దాయకంగా ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారు. ప్రదర్శన ప్రతి రోజూ ఉదయం 9 నుంచి రాత్రి 7గంటల వరకు ఉంటుంది. ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభించడంతో మొదటి రెండు గంటల్లోనే 1,500 టిక్కెట్లు అమ్ముడుపోయాయి. విజ్ఞాన ప్రదర్శన కోసం వెయ్యి మంది వైద్య విద్యార్థులు శ్రమిస్తున్నారు. అన్ని ముఖ్యమైన వైద్య విభాగాల్లో అవగాహన కల్పించేలా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.




విజ్ఞాన ప్రదర్శనకు చిట్టి రోబో సిద్ధం

సందర్శకుల కోసం పలు సౌకర్యాలు

మూడు దశాబ్దాల తర్వాత గుంటూరు వైద్య కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నారు. జీవ విజ్ఞాన శాస్త్రం, వైద్య రంగం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించడం ప్రధాన ఉద్దేశం. సందర్శకులకు మూడు నాలుగు గంటల పాటు లోపలే గడిపే అవకాశం ఉండటంతో షామియానాలు, కుర్చీలు, అల్పాహార స్టాల్స్, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. జింకానా ఆడిటోరియం పక్కన ఖాళీ స్థలంలోని 60 స్టాల్స్‌లో హెల్త్, ఫిట్‌నెస్, హెల్దీఫుడ్స్ వంటి వాటితో పాటు ఫన్నీగేమ్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. సందర్శకులకు వివరించేందుకు 700 మంది మెడికోలతోపాటు ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులను వలంటీర్లుగా నియమించారు.

విజ్ఞానదాయకంగా.. ఆసక్తికరంగా..

సైన్స్ ఎగ్జిబిషన్‌లో వివిధ వైద్య విభాగాల ప్రవేశ ద్వారాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. న్యాయ వైద్యశాస్త్రం ప్రవేశ ద్వారం వద్ద స్కల్ రూపం ఆకర్షిస్తోంది. ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, న్యూరాలజీ తదితర విభాగాల ప్రదర్శన హాళ్లల్లో ప్రవేశ ద్వారాలను ఆకట్టుకొనే విధంగా రూపొందించారు. ఫిజియాలజీ విభాగంలో రక్తపరీక్షలు జరిపే విధానం, ఆధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేశారు. మనిషి శరీరంలో కీలకమైన డీఎన్ఏ, ఆర్ఎన్ఏ, రైబోసోములు వంటి పలు కణ జీవ శాస్త్రంలో ముఖ్యమైన వాటిని అందరికీ సులువుగా అర్థమయ్యేలా చిత్రాల రూపంలో పొందుపర్చారు. ఫిజియాలజీ విభాగం ప్రవేశ ద్వారం వద్ద సుప్రసిద్ధులైన శాస్త్రవేత్తల ఫొటోలను ఏర్పాటు చేశారు. జనరల్ మెడిసిన్ విభాగంలో మధుమేహం ఇతర జీవ నశైలి వ్యాధులపై అవగాహన కల్పించే స్టాల్స్ సిద్ధం చేశారు. స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన కోసం ఆసుపత్రి ఆవరణలో సంచార వాహన ప్రదర్శన ఏర్పాటు చేశారు. న్యూరాలజీ విభాగంలో పక్షవాతం, సయాటికా, మైగ్రెయిన్ తలనొప్పి తదితర వ్యాధుల తీరు, వాటి చికిత్సలను వివరించే ప్రదర్శనలు సిద్ధం చేశారు. పెథాలజీ విభాగంలో డ్యాన్సింగ్ స్కెలిటాన్, హర్రర్ రూమ్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. ఇవి పిల్లలను ఎంతగానో ఆకట్టుకుంటాయని చెప్పవచ్చు.



న్యాయ వైద్యశాస్త్రం ప్రవేశ ద్వారం



రక్తదానంపై సంచార వాహనంతో అవగాహన ప్రదర్శన

జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి నేతృత్వంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ బి.శ్రీధర్ (అడ్మినిస్ట్రేషన్), డాక్టర్ డి.మాధవి (అకడమిక్) పర్యవేక్షణలో పనులు వేగంగా సాగుతున్నాయి. కమ్యూనిటీ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివగోపాల్, పెథాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మారుతీదేవి ఈ ప్రదర్శన ఏర్పాట్లకు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు.



తిరునాళ్లలో బస్సు ఎక్కుతున్న భక్తులు (పాత చిత్రం)

ఆ.. చేద్దాంలే!

(5వ పేజీ తరువాయి)

ప్రత్యేక క్యూలైన్‌లు, భక్తుల విశ్రాంతి కోసం ప్రాంగణంలో షామియానాలు ఏర్పాటు చేస్తున్నారు. అరిసె, లడ్డూ ప్రసాదం తయారీ జరుగుతోంది. రాజగోపురానికి రంగులు వేస్తున్నారు. ఈ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు.

దిగువన ఏర్పాట్లపై దిగులు

అయితే కొండ దిగువన తిరునాళ్ల ఏర్పాట్లకు నిధుల సమస్య అధికారులను వెంటాడుతోంది. పనులు చేయిస్తే నిధులు ఎలా అన్నట్టుగా వారి తీరు కనిపిస్తోంది. ఏర్పాట్లలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలే కీలకం. రహదారులకు మరమ్మతులు, బారికేడ్లు, విద్యుత్ దీపాలను ఆర్అండ్‌బీ చేయాల్సి ఉంది. పంచాయతీరాజ్ రహదారుల మరమ్మత్తులు, పారిశుధ్యం చేపట్టాలి. ఆర్‌డబ్ల్యూఎస్.. తాగు నీరు, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం చేయాలి. వీటిని ఏకాదశి కల్లా పూర్తి చేయాలి. కోటప్పకొండ, కొత్తపాలెం రహదారి ఈసారి భక్తులకు అందుబాటులోకి వచ్చింది. ట్రాఫిక్ మళ్లింపులో కీలకంగా ఉన్న చిలకలూరిపేట మేజర్ కాలువ రహదారిలో ఏర్పడిన గోతులు ఇంకా పూడ్చలేదు. ఘాట్ రోడ్డు మార్జిన్లను అభివృద్ధి చేయాలి. కొండ రహదారులన్నింటికి వెంటనే మరమ్మత్తులు పూర్తి చేయాల్సి ఉంది.

సందిగ్ధంలో.. స్త్రీ శక్తి

- కోటప్పకొండ తిరునాళ్లకు నిర్ణయం తీసుకోని ఆర్టీసీ

మహాశివరాత్రి సందర్భంగా కోటప్ప కొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో ఈ నెల 15న తిరునాళ్ల జరుగనుంది. లక్షలాదిగా యాత్రికులు తరలివస్తారు. ఆర్టీసీ 560 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తోంది. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం అమలుపై సందిగ్ధం నెలకొంది. దీనిపై ఆర్టీసీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక అధికారులకూ ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ఈనేథ్యంలో తిరునాళ్లకు వచ్చే మహిళా భక్తులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఉంటుందా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులను ఉచిత ప్రయాణంపై ప్రశ్నిస్తే తమకు ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదన్నారు.

కోటప్పకొండ తిరునాళ్లకు నరసరావుపేట నుంచి 280 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయనున్నారు. చిలకలూరిపేట నుంచి 110, వినుకొండ 45, అద్దంకి 35, ఒంగోలు 45, చీరాల 45 సర్వీసులు కొండకు ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. కొండపైకి ఘాట్ రోడ్డులో 85 బస్సులు నిర్వహించనున్నారు. మొత్తంగా 560 బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. తిరునాళ్ల ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేసేందుకు ఆర్టీసీ స్పందిస్తుందో లేదో చూడాలి.

అదే ఆమె చివరి కోరిక

- నెరవేర్చిన భర్త

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వృద్ధాప్య సమస్యలతో కన్నుమూసిన డాక్టర్ కాశీ అంబికా దేవి చివరి కోరికను ఆమె భర్త డాక్టర్ గెడ్డం కిషోర్ రాయ్ తీర్చారు. 1966లో గుంటూరు వైద్య కళాశాలలో కాశీ అంబికా దేవి వైద్య విద్యను అభ్యసించారు. వైద్య విద్యలో ప్రవేశం చేసి 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా 1966వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు గుంటూరు వైద్య కళాశాలలో 2026 జనవరి 28, 29, 30వ తేదీల్లో మూడు రోజుల పాటు రీయూనియన్ వేడుకలు జరుపుకున్నారు. చాలా ముందుగానే ఈ సమాచారం అందడంతో డాక్టర్ అంబికా దేవి కూడా ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆశ పడ్డారు. అయితే అనారోగ్యంతో 2025 సెప్టెంబర్ ఎనిమిదో తేదీన ఆమె తుది శ్వాస విడిచారు. చివరి క్షణాల్లో తన భర్త డాక్టర్ గెడ్డం కిషోర్ రాయ్‌ను పిలిచి తన చివరి కోరికను ఆయనకు చెప్పారు. తాను గతంలో జీఎంసీకి విరాళమిస్తానని మాటిచ్చానని, దాన్ని నిలపాలని కోరారు. 2026 జనవరిలో జరిగే తమ క్లాస్‌మేట్‌ల రీ యూనియన్ సమావేశంలో తన పేరిట గుంటూరు వైద్య కళాశాలకు రూ.5 లక్షల విరాళం అందజేయాలని చెప్పి కన్నుమూశారు. ఈ నేపథ్యంలో భర్త డాక్టర్ గెడ్డం కిషోర్ రాయ్ తన భార్య ఆఖరి కోర్కెను వివరిస్తూ లేఖను జోడించి రూ.5 లక్షల చెక్‌ను గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారికి పంపారు. ఈ చెక్ సోమవారం వైద్య కళాశాలకు చేరింది. ఇది తెలుసుకున్న జీఎంసీ వైద్య వర్గాలు ఆమెకు మనస్సులో జోహార్లు అర్పించారు. డాక్టర్ అంబికా దేవి పంపిన విరాళంతో రూ.4.41 లక్షల విలువైన మోటారు బగ్గీని కొనుగోలు చేసి వైద్య కళాశాలలో అందుబాటులో ఉంచుతామని ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి ఆంధ్రజ్యోతికి తెలిపారు. డాక్టర్ అంబికా దేవి భర్త డాక్టర్ గెడ్డం కిషోర్ రాయ్ సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేశారు.



గుంటూరు వైద్య కళాశాల



సహకార సంఘ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనల్లో మాట్లాడుతున్న బీఎస్ రాంబాబు

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- బీఎస్ రాంబాబు
- ఐదో రోజుకు చేరుకున్న నిరసన కార్యక్రమాలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 2 (ఆంధ్ర జ్యోతి): సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సహకార ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఎస్ రాంబాబు అన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ ఉద్యోగులు చేపట్టిన దశల వారీ ఆందోళనలలో భాగంగా స్థానిక శ్యామలనగర్‌లోని సహకార కార్యాలయం ఎదుట చేపట్టిన ఉద్యోగుల నిరసనలు సోమవారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. ఉద్యోగులు వంట వార్పు చేపట్టి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సహ కార ఉద్యోగుల అడిగే న్యాయమైన డిమాండ్లతో ప్రభుత్వ ఖజానాపై ఎటువంటి భారం పడదని పేర్కొన్నారు. తక్షణమే 36 జీవోను అమలు చేసి ఉద్యోగులందరికి ప్రొసిడింగ్ ఇచ్చి డీఎల్ఎస్ఎఫ్ ఏర్పాటు చేసి జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కరించని నేపథ్యంలో 16వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో అన్నమయ్య, కర్నూలు జిల్లా సంఘ నాయకులు పాల్గొనగా.. కార్యక్రమంలో మొవ్వా వెంకటేశ్వరరావు, రవికుమార్, రఘబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో సుస్థిరాభివృద్ధికి బలమైన పునాది

- స్విస్ ఇన్ ఇండియా అకడమిక్ హెడ్ లీనా మారైకే జోసెఫిన్ రోబ్రా

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు తక్కువ ఖర్చుతో, స్వదేశీ అవసరాలకు అనుగుణంగా రూపొందించే ఓపెన్ సోర్స్, లో రిసోర్స్ కృత్రిమమేథ (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్) మోడళ్లు భవిష్యత్తులో సుస్థిర అభివృద్ధికి బలమైన పునాదిగా మారతాయని స్విస్ ఇన్ ఇండియా కంపెనీ అకడమిక్ ఎంగేజ్‌మెంట్ హెడ్ లీనా మారైకే జోసెఫిన్ రోబ్రా అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం, కోర్ ఏఐ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో "కాన్‌క్లేవ్ ఆన్ రెస్పాన్సిబుల్‌అండ్ సస్టేయినబుల్ ఏఐ" అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును "బిల్డింగ్ బెటర్ విత్ ఏఐ సస్టేయినబిలిటీ యాస్ ఏ బ్లూ ప్రింట్ ఫర్ ఇండియా" అనే ఇతివృత్తంతో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లీనా మారైకే జోసెఫిన్ రోబ్రా మాట్లాడుతూ, దేశాభివృద్ధికి సాంకేతికత అనేక రంగాల్లో ఉపయోగపడుతోందని అన్నారు. ముఖ్యంగా తక్కువ వనరులు, ఖర్చుతో రూపొందించే ఏఐ మోడళ్ల ద్వారా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలకు కూడా ఆధునిక సాంకేతిక సేవలను అందించవచ్చని వివరించారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన టెడ్ ఎక్స్ స్పీకర్ ఎమినెంట్ ఇంజనీర్, ఫోర్బ్స్ 200 డీజీఈఎంఎస్, మాజీ ఏసీఎం ఇండియా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ పద్మనాభుని మాట్లాడుతూ, వ్యవసాయ రం గంలో ఏఐ ఆధారిత పంట దిగుబడి అంచ నాలు, నేల ఆరోగ్య విశ్లేషణ, వాతావరణ సూచ నల ఆధారంగా పంటల ఎంపిక, తెగుళ్లను ముందుగానే గుర్తించడం వంటి అనువర్తనాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు, వర్సిటీ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ కృష్ణకిషోర్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న లీనా మారైకే జోసెఫిన్ రోబ్రా తదితరులు

ఎన్నికల కోలాహలం!

- పతాకస్థాయికి ఏపీ బార్ కౌన్సిల్ అభ్యర్థుల ప్రచారం
- ఓట్ల కోసం 'ప్రత్యేక' ఆఫర్లతో గాలం
- బెజవాడ బార్ నుంచి 18 మంది బరిలోకి
- సాధారణ ఎన్నికలను తలపిస్తున్న వైనం
- కూలర్లు, టీవీలు, ఏసీలు, ఫర్నీచర్ తదితర బహుమతుల హామీ
- ఓటు కోసం సామూహిక విందులు, పార్టీలు
- విమర్శలకు తావిస్తున్న కొందరు అభ్యర్థుల తీరు

విజయవాడ లీగల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ బార్‌కౌన్సిల్ ఎన్నికల ప్రచారం పతాక స్థాయికి చేరింది. ఈ సారి ఎన్నడూ లేని విధంగా ఒక్క బెజవాడ బార్ నుంచే కౌన్సిల్ బరిలో 18 మంది పోటీ చేస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో పోటీదారులు ఉండటం సంచలనంతోపాటు న్యాయవాదుల్లో చర్చకు దారితీస్తోంది. గతంలో ఎలాంటి హడావిడి లేకుండా జరిగే బార్ కౌన్సిల్ ఎన్నికలు, ఈ సారి తీవ్ర ఉత్కంఠ రేపుతూ ప్రత్యక్ష ఎన్నికలను తలపిస్తున్నాయి. ధన, కుల, మత, రాజకీయ పార్టీల ప్రలోభాలకు కూడా తెరలేపుతున్నాయన్న అభిప్రాయాలను పలువురు న్యాయవాదులు వ్యక్తం చేస్తున్నారు.

● పోటా పోటీగా ఓట్ల కోసం వేట

ఈ సారి బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీచేసే పలువురు అభ్యర్థులు ఓట్ల కోసం నానా పాట్లు పడుతున్నారు. కొందరు అభ్యర్థులు రాష్ట్రంలోని చిన్న చిన్న బార్ అసోసియేషన్లకు వెళ్లి ఓటు తమకే వేయాలని ఒత్తిడి చేస్తున్నట్టు తెలుస్తోంది. బార్ అసోసియేషన్లకు కావాల్సిన వాటర్ కూలర్లు, టీవీలు, ఏసీలు, ఫర్నీచర్ ఇతరత్రా వస్తువులను తాము సమకూరుస్తామని ఆశ కల్పిస్తున్నారని పలువురు న్యాయవాదులు చెబుతున్నారు. మరికొందరు అభ్యర్థులు ఒకడుగు ముందుకేసి 'ప్రత్యేక' ఆఫర్లు పెడుతుంటే ఇలాంటి చర్యలను సీనియర్ న్యాయవాదులు బహిరంగంగానే తప్పుపడుతున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసినట్టుగా సెల్ ఫోన్‌లో ఫొటో తీసి చూపిస్తే 'ప్రత్యేక' ఆఫర్ ఇస్తామంటూ కొందరు అభ్యర్థులు మరీ దిగజారిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామూహిక విందులు, పార్టీలు బహిరంగంగానే చేస్తున్నారన్న విమర్శలు కూడా సీనియర్ న్యాయవాదుల నుంచి వ్యక్తం అవుతోంది.

● గతానికి భిన్నంగా బార్ కౌన్సిల్‌కు భారీగా పోటీ

ప్రతిష్ఠాత్మకమైన బార్ కౌన్సిల్ సభ్యుల ఎన్నికకు బెజవాడ బార్ నుంచి ఇప్పటికే 18 మంది పోటీలో ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇలాంటి పోటీ ఆరోగ్యకరమైనది కాదని సీనియర్ న్యాయవాదులు చెబుతున్నారు. ఇలాంటి వాతావరణంతో అపోహలకు తావిచ్చే అవకాశం లేకపోలేదని ఆందోళన చెందుతున్నారు.

● న్యాయవాదుల సంక్షేమానికి బార్ కౌన్సిల్ ఏర్పాటు

బార్ కౌన్సిల్ అభిప్రాయాలకు కోర్టులు కూడా విలువనిస్తాయి. ఎందుకంటే బార్ కౌన్సిల్ న్యాయవాదుల సంక్షేమం కోసం పనిచేస్తుంది. న్యాయవాదులు వృత్తిలో ఏదైనా తప్పు చేస్తే వారిపై క్రమశిక్షణా చర్యలు కూడా తీసుకుంటుంది. న్యాయవాదులు చనిపోయినా, రోడ్డు ప్రమాదాలకు గురైనా, అనారోగ్యం పాలైనా వారి కుటుంబానికి ఆర్థిక సహాయం, అందాల్సిన నిధులను వచ్చేలా పని చేస్తుంది. వృత్తి నుంచి విరమిస్తే వారి సర్వీసును బట్టి ఫుల్ సెటిల్‌మెంట్ కింద కొంత నగదును ముట్టచెబుతుంది. కొన్ని చట్టాలను (ప్రొసీజర్ కోడ్‌లు) మారుస్తున్నప్పుడు బార్ కౌన్సిళ్లను కేంద్ర ప్రభుత్వం సంప్రదిస్తుంది. కౌన్సిల్ సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటుంది. లోకల్ బార్ అసోసియేషన్ల ఎన్నికలను పర్యవేక్షిస్తుంది. బార్ కౌన్సిల్ సభ్యుల కాలపరిమితి ఐదేళ్లు ఉంటుంది. ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి న్యాయవాదుల సంక్షేమ నిధి కోసం పాటుపడుతుంది.

క్రమశిక్షణతోనే విజయం

- ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యతేజ
- విజ్ఞాన్‌లో ముగిసిన బాల మహోత్సవ్ 2కే26
- క్రీడల్లో సత్తా చాటిన విద్యార్థులు
- విజేతలకు బహుమతులు అందజేత

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మనల్ని నిరంతరం గమ్యం వైపుగా ముందుకు నడిపించేది క్రమశిక్షణ మాత్రమేనని, దానితోనే విజయం సాధ్యమని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యాని వర్సిటీలో జరుగుతున్న రాష్ట్రస్థాయి విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కే26 వేడుకలు సోమవారం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మల్లవరప సూర్యతేజ మాట్లాడుతూ, తాను 8వ తరగతిలోనే ఐఏఎస్ కావాలనే లక్ష్యాన్ని నిర్ణయించుకున్నానని తెలిపారు. అప్పటి నుంచి ఆ దిశగా నిరంతరం కృషి చేశానని, లక్ష్యం స్పష్టంగా ఉంటే మార్గం కూడా స్పష్టంగా కనిపిస్తుందని విద్యార్థులకు సూచించారు. చిన్న వయసులోనే లక్ష్యాన్ని నిర్ణయించుకొని, క్రమశిక్షణతో శ్రమిస్తే ఏ రంగంలోనైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. 8, 9, 10వ తరగతుల్లో ఉండగానే జీవితంలో ఏమవ్వాలనేది స్పష్టంగా నిర్ణయించుకుంటే, ఆ దిశగా ముందుకు సాగడం చాలా సులభమవుతుందని సూచించారు. ఏ రంగంలో ఉన్నా విజయం సాధించాలంటే సరైన వ్యూహం, లక్ష్యానికి తగిన ప్రణాళిక, సరైన వాతావరణం ప్రోత్సహించే పరిసరాలు, సరైన వనరులు నాణ్యమైన సమాచారం, సరైన మార్గదర్శకత్వం ఉండాలని సూర్యతేజ పేర్కొన్నారు. అనంతరం విజ్ఞాన్ వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీ కృష్ణకిషోర్ మాట్లాడుతూ, నిరంతర సాధనతో క్రీడల్లో విజయాన్ని సాధించవచ్చన్నారు. చదువుకు, క్రీడలను సమ ప్రాధాన్యంతో సంపూర్ణ అభివృద్ధి సాధ్యమని సూచించారు. విజ్ఞాన్ బాల మహోత్సవ్‌లో భాగంగా మొత్తం 50 ఈవెంట్లను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు రూ.5లక్షల నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మల్లవరపు సూర్యతేజ

అవగాహన

బేకింగ్ సోడా భలే!

ప్రపంచంలోని అత్యంత చవకైన ఔషథంగా సోడా ఉప్పుకు పేరుంది. ఈ ఉప్పు కలిగి ఉండే ఔషథ గుణాలను ఎలా ఉపయోగించుకోవాలంటే...

క్యాన్సర్ రక్ష

2009లో ఎలుకల మీద చేపట్టిన ఒక అధ్యయనంలో బేకింగ్ సోడా, క్యాన్సర్ కణితి పిహెచ్‌ను పెంచి, మెటాస్టాసిస్‌ను తగ్గించినట్టు రుజువైంది. క్యాన్సర్ ఆమ్ల వాతావరణంలో వృద్ధి చెందడమే ఇందుకు కారణం. కానీ సోడా ఉప్పు పూర్తి భిన్నంగా క్షార వాతావరణాన్ని వృద్ధి చేస్తుంది. కాబట్టి క్యాన్సర్‌కు ఈ ఉప్పు విరుగుడుగా పని చేస్తుంది. క్యాన్సర్ రక్ష కోసం, అర టీస్పూను సోడా ఉప్పును అరగ్లాసు నీళ్లలో కలుపుకుని పరగడుపున వారానికి రెండు నుంచి మూడు సార్లు తాగాలి.

యాంటాసిడ్

సోడా ఉప్పు పొట్టలోని ఆమ్లాన్ని తటస్థం చేస్తుంది. కాబట్టి అసిడిటీని తగ్గించుకోవడం కోసం అర టీస్పూను సోడా ఉప్పు, గ్లాసు నీళ్లలో కలుపుకుని తాగాలి. ఈ చిట్కా ఐదు నిమిషాల్లో ఫలితాన్ని కనబరుస్తుంది. పైగా దీన్లో మిగతా యాంటాసిడ్ మందుల్లో మాదిరిగా అల్యూమినియం, కృత్రిమ రంగులు ఉండవు.



దంత ఆరోగ్యం

సోడా ఉప్పు మరకలను తొలగించి, బ్యాక్టీరియాను చంపుతుంది. కాబట్టి సోడా ఉప్పుకు నీళ్లు జోడించి పేస్ట్‌లా తయారుచేసుకుని, రెండు నిమిషాల పాటు దంతాలు రుద్దుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేయగలిగితే, దంతాలు తెల్లబడడమే కాకుండా, దంత క్షయానికి కూడా అడ్డుకట్ట పడుతుంది.

డియోడరెంట్

వాణిజ్యపరమైన డియోడరెంట్లు అల్యూమినియంను కలిగి ఉంటాయి. దాంతో చర్మ రంధ్రాలు మూసుకుపోయి, క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది కానీ సోడా ఉప్పు అత్యంత సురక్షితమైన డియోడరెంట్ లాంటిది. కాబట్టి శరీరం నుంచి దుర్గంధం వెలువడకుండా ఉండడం కోసం బాహుమూలల్లో నేరుగా సోడా ఉప్పును అప్లై చేసుకోవచ్చు



ప్రముఖ క్యాన్సర్ పరిశోధకులు, పద్మభూషణ్ పురస్కార గ్రహీత, డాక్టర్ నోరి దత్తాత్రేయ, క్యాన్సర్ వ్యాధి, అధునాతన చికిత్సల పట్ల లోతైన అవగాహన కల్పిస్తున్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా, క్యాన్సర్ చికిత్సలో సాధించిన పురోగతి గురించీ, ఈ వ్యాధి నుంచి రక్షణ కల్పించే మార్గాల గురించీ ఆయన వివరించిన ఆసక్తికరమైన విశేషాలివి..



క్యాన్సర్ కొమ్ములు విరుద్దాం!

క్యాన్సర్ విషయంలో మనందరం హర్షించవలసిన విషయం ఒకటుంది. దశ, రకంతో సంబంధం లేకుండా ప్రపంచవ్యాప్తంగా 70 శాతానికి పైగా క్యాన్సర్లు అదుపులో కొస్తున్నాయి. ఈ రోగులందరూ మునుపటి కంటే దీర్ఘ కాలం జీవించగలుగుతున్నారు. వ్యాధినిర్ధారణ పరీక్షల విస్తృతి పెరగడం, క్యాన్సర్ మొదటి, రెండు దశలకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి రావడమే ఇందుకు ప్రధాన కారణం. అలాగే మూడు, నాలుగో దశల్లో వ్యాధినిర్థారణ అయిన రోగులకు కూడా ఇమ్యునో, టార్గెటెడ్ థెరపీలతో వ్యాధిని అదుపులోకి తెచ్చి, ఆయుర్దాయాన్ని పెంచగలుగుతున్నాం.

అవగాహన మరింత పెరగాలి

మన దేశంలో ప్రతి ఏటా, 10 లక్షల 47 వేల మందికి క్యాన్సర్ నిర్ధారణ అవుతోంది. అలాగని క్యాన్సర్ పెరిగిపోతోందని భయపడకూడదు. వ్యాధినిర్ధారణ సులభతరం కావడం, ప్రజల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన పెరిగి తొలినాళ్లలోనే ఈ వ్యాధిని కనిపెట్టగలగడం వల్ల క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోంది. అలాగని ప్రతిచోటా క్యాన్సర్ కేంద్రాలను విస్తరించుకుంటూ వెళ్లడం సరి కాదు. ఈ వ్యాధితో వ్యవహరించవలసిన తీరు ఇది కానే కాదు. వ్యాధికి అడ్డుకట్ట వేయడం ద్వారానే దీని మీద విజయం సాధించగలుగుతాం! అందుకోసం క్యాన్సర్ పట్ల అవగాహనను మరింత పెంచాలి. వ్యాధి రాకుండా చూసుకోవడం, తొలినాళ్లలోనే కనిపెట్టడం, వ్యాధి నిర్ధారణ పరీక్షలను మరింత విస్తృతపరచడం ద్వారా మాత్రమే ఈ వ్యాధిని తుదముట్టించగలుగుతాం!

మాలిక్యులర్ ఆంకాలజీ ప్రత్యేకత ఇదే!

రేడియేషన్, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీలు చాలా బాగా అభివృద్ధి చెందాయి. అలాగే క్యాన్సర్ సోకిన వ్యక్తి నుంచి చిన్న ముక్కను సేకరించి బయాప్సీ చేసి, నెక్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జిఎస్) చేయగలిగితే, ఆ క్యాన్సర్ ఏ పరమాణు మార్పుల వల్ల వచ్చిందన్నది తేలిపోతుంది. తద్వారా నిర్దిష్ట క్యాన్సర్ కారక జన్యువును గుర్తించి, టార్గెటెడ్ థెరపీ ద్వారా సదరు క్యాన్సర్‌ను సరిదిద్దే నోటి మాత్రను ఎంచుకుని వాడుకోవడం ద్వారా వ్యాధి నుంచి విముక్తి పొందే వీలుంది.

స్వయంకృతాపరాథమే!

70 శాతం క్యాన్సర్లు నివారించదగినవే! వీటిలో ఎక్కువ శాతం పొగాకుతోనే ముడిపడి ఉంటున్నాయి. ఏకబిగిన 30 ఏళ్ల పాటు సిగరెట్లు తాగేసి, క్యాన్సర్ తెచ్చుకుని, 'చికిత్స లేదా?' అని వైద్యులను ప్రశ్నించడం ఎంతవరకూ సమంజసం? సంక్లిష్టమైన జన్యు ఉత్పరివర్తనాలతో తలెత్తే క్యాన్సర్లకు ఎవరూ బాధ్యులు కారు. కానీ స్వయంగా కొని తెచ్చుకునే క్యాన్సర్లకు మనదే పూర్తి బాధ్యత. నిన్న లేని క్యాన్సర్ ఒకేసారి నాల్గో దశలో బయల్పడడం అసంభవం. క్యాన్సర్ కచ్చితంగా కొన్ని సంకేతాలు, లక్షణాల ద్వారా ముందస్తుగానే మనల్ని హెచ్చరిస్తుంది. ఇదంతా పక్కన పెట్టి, ఇష్టారాజ్యంగా జీవితాన్ని గడిపేసి, వ్యాధిని నయం చేయలేకపోతున్నారని వైద్యులను నిందించడం, మెరుగైన చికిత్స కోసం విదేశాలకు పరుగులు పెట్టడం అవివేకం.

ఆంకోటైప్ డిఎక్స్ పరీక్ష

ప్రతి క్యాన్సర్, సొంత మాలిక్యులర్ సిగ్నేచర్‌ను కలిగి ఉంటుంది. కాబట్టే ఒకే రకమైన చికిత్స అందరికీ సమాన ఫలితాన్ని ఇవ్వదని ఆలస్యంగా బయల్పడింది. దీనికి ముందు రొమ్ము క్యాన్సర్ సోకిన మహిళలందరికీ గడ్డ పరిమాణం, రకంతో పని లేకుండా, కీమోథెరపీనే సూచించేవారు. కానీ నేడు చికిత్స తీరు మారింది. తొలిదశ రొమ్ము క్యాన్సర్ సోకిన వారికి, ఆంకోటైప్ డిఎక్స్ పరీక్ష చేపట్టి, కణితి కణజాలంలోని 21 జన్యువులను విశ్లేషించి, క్యాన్సర్ తిరగబెట్టే అవకాశాలను, కీమోథెరపీతో ఒరిగే ప్రయోజనాలను అంచనా వేయగలుగుతున్నాం. అలాగే ఏ రకమైన కీమో ప్రయోజనకరం, ఆ కీమో ఎంతటి టాక్సిసిటీని కలిగి ఉంటుంది, టాక్సిసిటీ లేకుండా ఎంత ప్రయోజనం పొందే వీలుందన్నది కూడా వైద్యులు తెలుసుకోగలుగుతారు. అలా ఈ పరీక్ష ఆధారంగా దుష్ప్రభావాలు తక్కువ, ప్రయోజనం ఎక్కువ ఉన్న రోగులకే వైద్యులు కీమోను ఎంచుకుంటున్నారు.

> "ప్రతి క్యాన్సర్ నయం చేయదగినదే! అయితే తొలి దశలోనే వ్యాధిని గుర్తించాలి. తొలి దశలో కీమోథెరపీ, రేడియేషన్, ఖర్చు.. అన్నీ తక్కువే! మూడు, నాల్గవ దశ క్యాన్సర్లను కూడా రెండు నుంచి మూడు చికిత్సా విధానాలతో నయం చేయవచ్చు. పదేళ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం క్యాన్సర్ చికిత్స ఫలితం ఎంతో మెరుగుపడింది.



> **ఈ సంతులనం కీలకం**
>
> శరీరంలో క్యాన్సర్‌ను ఉత్పత్తి చేసే, క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించే రెండు రకాల జన్యువులుంటాయి. ఈ రెండు జన్యువుల మధ్య సంతులనాన్ని కొనసాగించినంత కాలం క్యాన్సర్ దరి చేరదు. దురలవాట్లతో ఈ సంతులనం దెబ్బతిని, క్యాన్సర్ సోకుతుందనే విషయం గుర్తుపెట్టుకోవాలి."

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- **శరీరం చెప్తున్నది వినాలి:** తొలి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. మహిళల నెలసరి రక్తస్రావంలో అసహజ మార్పులు కనిపించినా, ఎవరికైనా వారాల తరబడి వీడని దగ్గు వేధిస్తున్నా వైద్యులను కలవడానికి అలసత్వం ప్రదర్శించకూడదు
- **కుటుంబ చరిత్ర కీలకం:** దగ్గరి రక్త సంబంధీకుల్లో క్యాన్సర్లు ఉంటే ముందే అప్రమత్తం కావాలి. స్క్రీనింగ్ పరీక్షలు ముందుగానే మొదలుపెట్టుకోవాలి
- **దురలవాట్లకు దూరం:** ధూమపానం, మద్యపానం, అసాంఘిక ప్రవర్తనలకు దూరంగా ఉండాలి
- **కొవ్వు పదార్థాలు:** వీటిని వీలైనంత పరిమితంగా తీసుకోవాలి. పీచును పెంచుకోవాలి. ఇందుకోసం తాజా కాయగూరలు, ఆకుకూరలు తీసుకోవాలి
- **పరీక్షలు:** క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి
- **టీకాలు:** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, కాలేయ క్యాన్సర్లకు అందుబాటులో ఉన్న టీకాలు తీసుకోవాలి

చికిత్సలో అద్భుత పురోగతి

40, 50 ఏళ్ల క్రితం క్యాన్సర్ పట్ల కలిగి ఉన్న దృక్పథానికీ నేటి దృక్పథానికీ ఏమాత్రం పొంతన లేదు. ఒకప్పుడు క్యాన్సర్ నిర్ధారణ అవగానే, సర్జరీ, కీమో, రేడియేషన్ చికిత్సలతో వ్యాధిని నయం చేయడం మీదే దృష్టి కేంద్రీకరించాం. కానీ ఒక కణంలోని డిఎన్ఎకు మల్టిప్లై అవమనే ఆదేశాలు ఎక్కడి నుంచి వస్తున్నాయనే ప్రశ్న అప్పట్లో ఎవర్లోనూ తలెత్తలేదు. కానీ ఆ ఆదేశం డిఎన్ఎ చుట్టూరా ఉన్న పరిధీయ ప్రాంతం నుంచే వస్తోందని ఆ తర్వాత తెలుసుకోగలిగాం! అలాగే ఆ ఆదేశాల్లో క్యాన్సర్‌ను వేర్వేరు అవయవాలకు వ్యాపించమనేవీ ఉంటున్నాయని తెలుసుకోగలిగాం! కాబట్టి ఆ ఆదేశాలకు అడ్డుకట్ట వేయగలిగితే క్యాన్సర్ వృద్ధిని అరికట్టవచ్చనే ఉద్దేశంతో టార్గెటెడ్ థెరపీని కనిపెట్టాం! అయితే దాంతో పరిమిత ఆదేశాలను మాత్రమే అడ్డుకోగలిగాం. బదులుగా బహుళ ఆదేశాలను అడ్డుకోగలిగే చికిత్సా విధానాన్ని కనిపెట్టే క్రమంలో ఇమ్యునో థెరపీని ఆవిష్కరించుకున్నాం. ఈ చికిత్స... కీమో, రేడియేషన్ చికిత్సల్లాంటిది కాదు. ఈ చికిత్స క్యాన్సర్ పెరుగుదలను నియంత్రిస్తుంది. మిగతా చికిత్సల మాదిరిగా ఇతర ఆరోగ్యకరమైన కణాల్లో టాక్సిసిటీని పెంచదు.

మీకు తెలుసా?

ఇన్‌ఫ్లమేషన్‌కు ఇలా అడ్డుకట్ట

తీవ్రమైన ఆరోగ్య సమస్యలను తగ్గించుకోవడం కోసం ఎంతో మంది, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్‌ను అనుసరించడం మొదలుపెట్టారు. అయితే ఎలాంటి ఆహార నియమాలతో వాపు, నొప్పులను అదుపులో పెట్టుకోవచ్చో ప్రముఖ సెలెబ్రిటీ డైటీషియన్, రుజుత దివేకర్, సామాజిక మాధ్యమం ద్వారా ఇలా వివరిస్తున్నారు.

అస్తవ్యస్థ ఆహారపుటలవాట్లు, ఎక్కువ సమయాల పాటు విశ్రాంతిలో గడిపే అలవాట్లు, నిద్రలేమి లాంటి కారణాల వల్ల ఇన్‌ఫ్లమేషన్ తీవ్రమవుతుంది. ఇది దీర్ఘకాలంలో గుండె జబ్బులు, మధుమేహం, ఆటోఇమ్యూన్ డిజార్డర్ లాంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. వంటింటి చిట్కాలు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించగలుగుతాయని చాలా మంది నమ్ముతూ ఉంటారు. ఆ క్రమంలో పసుపు నీళ్లు, డిటాక్స్ రసాలు తాగడం, పచ్చి కూరగాయలు తినడం లాంటివి చేస్తూ ఉంటారు. అయితే శరీర ఇన్‌ఫ్లమేటరీ రెస్పాన్స్‌కు ఏకైక చిట్కా లాంటిదంటూ ఏదీ ఉండదు. సమతులమైన, సుస్థిరమైన ప్రయత్నాలతోనే ఈ సమస్యను అదుపులోకి తెచ్చుకోగలుగుతాం!

ఆహారం మాయాజాలం కాదు

సూపర్‌ఫుడ్స్ అని చెప్పుకునే ఆహార పోకడలు ఇన్‌ఫ్లమేషన్‌ను సమూలంగా నయం చేయలేవు.



ఫలానా ద్రవ, ఘన పదార్థంతో చిటికెలో ఇన్‌ఫ్లమేషన్‌ను క్రమబద్ధీకరించుకోవచ్చు అనుకుంటే అది అపోహ మాత్రమే! నిజానికి కొన్ని పదార్థాలకు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే గుణం ఉన్నప్పటికీ, పరిపూర్ణ ఆహార నియమాల్లో భాగంగా వాటిని మన భోజనంలో జోడించుకోగలిగినప్పుడే వాటి ఫలాన్ని పొందగలుగుతాం! అలా కాకుండా పచ్చికూరగాయలు లేదా పండ్లు, కూరగాయల స్మూదీలనే ప్రధాన భోజనంగా తీసుకోవడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ పూర్తిగా తగ్గిపోదు. బదులుగా పొట్టుతీయని, పాలిష్ పట్టని పదార్థాలతో సమతులమైన ఆహారం తీసుకోవాలి.

వ్యాయామం సరిపడా...

ఇన్‌ఫ్లమేషన్ క్రమబద్ధీకరణకు వ్యాయామం తోడ్పడుతుంది. అయితే అవసరానికి మించి లేదా అవసరమైనదానికంటే తక్కువ వ్యాయామంతో ఇన్‌ఫ్లమేషన్ తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. ఎక్కువ సమయం పాటు కదలకుండా ఉండిపోయేవారిలో ఇన్‌ఫ్లమేషన్ పెరగడంతో పాటు, శరీరం శక్తిని ఖర్చు చేసుకోలేని మెటబాలిక్ సమస్యలు కూడా పెరుగుతాయి. అలాగే వ్యాయామం చేయడంతో పాటు శరీరానికి వ్యాయామం నుంచి కోలుకునే సమయాన్ని కూడా ఇవ్వాలి. లేదంటే శరీరం ఒత్తిడికి లోనై, ఇన్‌ఫ్లమేషన్ పెరిగిపోతుంది. కాబట్టి బరువులతో కూడిన స్ట్రెంగ్త్ ట్రైనింగ్, యోగా, నడకలతో వ్యాయామ ప్రయోజనాలను పొందాలి.

> **ఒత్తిడి వద్దు**
>
> ఆధునిక జీవనశైలులతో ఒత్తిడి మోతాదులు ఎక్కువైనప్పుడు కూడా ఇన్‌ఫ్లమేషన్ వేధిస్తుంది. కాబట్టి ఇతరుల గుర్తింపు, మెప్పు కోసం పరితపించడం మానేసి, స్వీయ సంరక్షణ, మానసిక శ్రేయస్సు మీద దృష్టి పెట్టాలి. ధ్యానం, ప్రాణాయామం, నచ్చిన అభిరుచులకు సమయాన్ని కేటాయించడం లాంటివాటితో ఒత్తిళ్లను సహజసిద్ధంగా తగ్గించుకోవాలి.

నిద్ర కంటి నిండుగా..

ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంలో నిద్ర ముఖ్యమైన పాత్ర పోషిస్తుందనే విషయాన్ని చాలా మంది పట్టించుకోరు. శరీరం కోలుకునే ప్రక్రియ నిద్రలోనే జరుగుతుంది. నిద్రలేమి, ఒత్తిడి మోతాదులను పెంచి, దాంతో ఇన్‌ఫ్లమేషన్ తీవ్రమై, దీర్ఘకాలంలో ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి నిద్రవేళలకు ఒక క్రమం పాటిస్తూ, నిద్రకు ముందు ఫోన్లు, టివిల వాడకాన్ని తగ్గించాలి.

యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారం

ఇన్‌ఫ్లమేషన్‌కు విరుగుడు ఆహారంతో ప్రయోజనం ఉంటుంది. అయితే ఆ ఆహారం ప్రభావం... మెటబాలిజం (శరీరం శక్తిని ఖర్చుచేసుకునే వేగం), ఆహారపుటలవాట్లు, ఆహార మోతాదుల మీద ఆధారపడి ఉంటుంది. ఆహారం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలన్నీ సమపాళ్లలో దక్కాలంటే భోజన ప్రణాళికను తయారుచేసుకోవాలి. సమతులాహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ, కంటి నిండా నిద్రపోతూ, మానసిక ఒత్తిడిని అదుపులో పెట్టుకున్నంత కాలం ఇన్‌ఫ్లమేషన్ మన దరి చేరకుండా ఉంటుంది.

పోషకాహారం

మష్రూమ్స్ తిందాం



శరీరానికి అవసరమైన ప్రొటీన్లు పుట్టగొడుగుల్లో పుష్కలంగా ఉన్నాయి. జంతు మాంసకృత్తులు జీర్ణమవడానికి ఎక్కువ సమయం పడుతుంది. కానీ పుట్టగొడుగుల్లోని మాంసకృత్తులు అత్యంత సులువుగా జీర్ణమవుతాయి. 60 ఏళ్లు దాటిన వారిలో సహజంగానే మెదడు కణాలు క్షీణించి పోతుంటాయి. ఫలితంగా మతిమరుపును కలిగించే డిమెన్షియా వ్యాధి మొదలవుతుంది. అయితే వారానికి రెండు సార్లు, మొత్తం 300 గ్రాముల ఉడికించిన పుట్టగొడుగులు తిన్నవారిలో ఈ సమస్య 50 శాతం మేరకు తగ్గడాన్ని పరిశోధకులు కనుగొన్నారు. అయితే వారంలో రెండు దఫాలే కాకుండా తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తినే వారికి పుట్టగొడుగుల వల్ల కలిగే ప్రయోజనం మరింత ఎక్కువగా ఉంటుందని కూడా వారు కనిపెట్టారు. నాడీకణాల క్షీణత వల్ల వృద్ధుల్లో మతిమరుపుతో పాటు భాషా సామర్థ్యం తగ్గిపోతుంది. ఏకాగ్రత లోపిస్తుంది. అయితే పుట్టగొడుగులు ఈ లోపాల్ని చాలా వరకు పూరిస్తాయి. పుట్టగొడుగుల్లో ప్రత్యేకించి మన శరీరం తనకు తానుగా ఉత్పత్తి చేసుకోలేని ఒక అరుదైన అమినో యాసిడ్ ఉంటుంది. అది ఈ విశేష ప్రయోజనాలన్నీ కలిగిస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ ప్రత్యేకించి వృద్ధులు పుట్టగొడుగులను ఆహారంగా తీసుకోవడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పరిశోధకులు నొక్కి చెబుతున్నారు.

పరిశోధన

పిల్లల కణాలు తల్లుల్లో...

గర్భావస్థలో పిల్లల కణాలు బొడ్డుతాడు గుండా తల్లి శరీరంలోకి ప్రవహించి, శాశ్వతంగా అక్కడే ఉండిపోయి, జీవితాంతం తల్లి ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తూ ఉంటాయనే ఒక శాస్త్రీయ వాస్తవం వెలుగులోకొచ్చింది. ఆ వివరాలు...

శాస్త్రవేత్తలు... కొడుకుల కణాలను 70 ఏళ్ల తల్లి మెదడులో, కూతుర్ల కణాలను 40 ఏళ్ల తల్లి గుండెలో కనుగొన్నారు. అయితే ఆ కణాలు కేవలం ఉనికిని చాటుకోవడమే కాకుండా, తల్లి అవయవాలతో సమన్వయమవుతూ కొన్ని జీవక్రియలకు తోడ్పడుతూ ఉండడాన్ని కూడా శాస్త్రవేత్తలు గమనించారు. క్యాన్సర్ నుంచి రక్షణ కల్పించడంతో పాటు, దెబ్బతిన్న కణజాలాలను మరమ్మత్తు చేస్తున్నట్టు, గుండెపోటు తదనంతరం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తున్నట్టు కూడా శాస్త్రవేత్తలు కనిపెట్టారు. యూనివర్శిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో చేపట్టిన ఒక అధ్యయనంలో, రొమ్ము క్యాన్సర్ సోకిన మహిళను పరిశీలించినప్పుడు, ఆమె శరీరంలోని క్యాన్సర్ కణుతుల్లో పిల్లల కణాలను పరిశోధకులు కనిపెట్టారు. ఈ కణాలు క్యాన్సర్ కణాలతో పోరాడుతూ, వాటిని నాశనం చేసే ప్రయత్నంలో ఉన్నట్టు కనిపించాయి. ప్రసవం తర్వాత కూడా పిల్లల కణాలను మోస్తూ జీవించే తల్లికి, ఆ కణాలు జీవిత కాలం పాటు రక్షణ కల్పిస్తూనే ఉంటాయనే విషయం రుజువైంది కాబట్టి ఈ కణాలు తల్లి రోగనిరోధక వ్యవస్థను ఏ మేరకు ప్రభావితం చేస్తాయో, వ్యాధుల నుంచి కోలుకోవడంలో ఎంతటి పాత్రను పోషిస్తాయో తెలుసుకోవడం కోసం శాస్త్రవేత్తలు మరిన్ని పరిశోధనలకు పూనుకోబోతున్నారు.



అనీమియా

రక్తహీనత బలాదూర్

నీరసం, నిస్సత్తువ, కళ్లు తిరగడం, గుండె దడ, ఆయాసం, చికాకు, మానసిక కుంగుబాటు... ఇవన్నీ రక్తలేమి లక్షణాలే! వీటికి తోడు అతి నిద్ర, జుట్టు రాలిపోవడం, నోటి పూత, కాళ్లూ చేతుల్లో తిమ్మిర్లు కూడా వేధిస్తూ ఉంటాయి. ఈ లక్షణాలను వదిలించుకోవాలంటే రక్తలేమిని సరిదిద్దుకోవాలి. అందుకోసం...

ఆహారం ద్వారా రోజూ మనం తీసుకునే ఇనుము సహజంగా 10 నుంచి 12 శాతం మాత్రమే జీర్ణమవుతుంది. అందువల్ల ఆహారంలో కనీసం 10 నుంచి 15 మి.గ్రాముల ఐరన్ ఉండేలా చూసుకోవాలి. శాకాహారంతో పోలిస్తే, మాంసాహారంలోనే ఇనుము ఎక్కువ. అయితే, ఆకు కూరల్లోనూ, టీ వంటి పానీయాల్లో ఉండే ఫైలేట్స్ , ఫాస్ఫేట్స్ వల్ల ఇనుము అరుగుదల కాస్త తగ్గుతుంది. అయితే పండ్లలో ఉండే విటమిన్- సి వల్ల ఇనుము అరుగుదల పెరుగుతుంది.

రక్తహీనత కారణాలు

- రుతుస్రావం, గర్భధారణల కారణంగా, కొంత మంది స్త్రీలు రక్తహీనతకు గురవుతారు. రుతుస్రావం వల్ల స్త్రీలు నెలకు 20 మిల్లీగ్రాముల దాకా ఐరన్ కోల్పోతారు. పౌష్టికాహార లోపం వల్ల, పూర్తిగా శాకాహారం వల్ల, బలమైన పోషకాహారం తీసుకోకుండానే బిడ్డలకు పాలివ్వడం వల్ల ఐరన్ లోపం ఏర్పడవచ్చు
- పెప్టిక్ అల్సర్లు, గ్యాస్ట్రైటిస్, ఇసోఫెజైటిస్, డెవర్టిక్యులైటిస్, మొలలు, పేగుల్లో కణుతులు, అన్నాశయ క్యాన్సర్ల వల్ల కూడా రక్తహీనత ఏర్పడవచ్చు. పేగులకు లేదా అన్నాశయానికి జరిగే శస్త్ర చికిత్సల కారణంగా, వాంతులు లేదా విరోచనాల ద్వారా రక్తాన్ని కోల్పోవడం వల్ల కూడా రక్తహీనత రావచ్చు
- కొన్ని రకాల ఔషధాలు, కార్టికోస్టిరాయిడ్లు, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటార్స్ వంటి ఔషధాల వల్ల కూడా రక్తహీనత రావచ్చు. మూత్ర పిండాల జబ్బుల వంటి దీర్ఘకాలిక వ్యాధుల్లో కూడా రక్తహీనత ఏర్పడుతుంది.

> **వైద్య పరీక్షల్లో....**
>
> హిమోగ్రామ్ వంటి రక్తపరీక్షల ద్వారా, హిమోగ్లోబిన్, హిమటోక్రిట్ స్థాయిలు మామూలు కంటే తక్కువగా ఉన్నాయేమో గమనించాల్సి ఉంటుంది. అదే క్రమంలో సీరం ఐరన్, సీరం ఫెరిటిన్ వంటి కొన్ని ఇతర పరీక్షలు కూడా చేయాల్సి ఉంటుంది.



చికిత్సలున్నాయి...

ఐరన్ మాత్రలు వేసుకోవడం వల్ల కొందరికి వాంతులు, విరోచనాలు లేదా మలబద్ధకం, పొట్ట నొప్పి ఇబ్బంది పెట్టవచ్చు. మరికొందరికి నలుపు లేదా ఆకుపచ్చని రంగులో విరోచనాలు కావచ్చు. కాకపోతే ఈ దుష్ప్రభావాలు అతి తక్కువ మందిలోనే కనిపిస్తాయి. మాత్రలు పడని వారు ఇంజక్షన్ల రూపంలో ఐరన్ తీసుకోవచ్చు. ఈ చికిత్సలతో ఒకటి రెండు వారాల్లోనే హిమోగ్లోబిన్ పెరగడం ప్రారంభమై, 6 నుంచి 8 వారాల్లో హిమోగ్లోబిన్ మామూలు స్థాయికి వచ్చేస్తుంది.

స్పోర్ట్స్

గుంటూరు ● మంగళవారం 3 ఫిబ్రవరి 2026

డబ్ల్యూపీఎల్‌లో నేడు

గుజరాత్ X ఢిల్లీ (రా. 7.30)

బాయ్‌కాట్ నష్టం రూ.2200 కోట్లు!



- భారత్-పాక్ పోరు నిర్వహణపై ఉత్కంఠ
- ఐసీసీ నిర్ణయం కోసం ఎదురుచూపులు

న్యూఢిల్లీ: ఐసీసీ నిర్వహించే మెగా టోర్నీల్లో భారత్-పాకిస్థాన్ మ్యాచ్‌లకు ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. ట్రోఫీకే తలమానికమైన ఈ సమరంపై విశ్వవ్యాప్తంగా ఫైనల్‌కు మించిన ఆసక్తి ఏర్పడుతుంది. అటు టిక్కెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోవడంతో పాటు బ్లాక్ మార్కెట్‌లో అయితే లక్షల్లో పలుకుతాయి. ఇక ఐసీసీకే కాకుండా బ్రాడ్‌కాస్టర్లకు కూడా కాసుల పంట పండుతుంది. అందుకే ఈ రెండు జట్లను ఒకే గ్రూప్‌లో ఆడిస్తారు. అయితే ఈనెల 7 నుంచి జరిగే టీ20 వరల్డ్‌కప్‌లో తమ జట్టు భారత్‌తో ఆడబోదని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించడం అందరినీ షాక్‌కు గురిచేస్తోంది. ఎందుకంటే మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం ఈ మ్యాచ్ జరగకపోతే ఏకంగా 250 మిలియన్ యూఎస్ డాలర్ల (రూ.2200 కోట్లు) నష్టం ఏర్పడనుందని సమాచారం. ప్రసార హక్కులు, ప్రకటనల రేట్లు, స్పాన్సర్‌షిప్, టికెట్ల విక్రయాలు, ఇతర వాణిజ్య కార్యకలాపాల ఆధారంగా ఈ విలువ లెక్కించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో మరే మ్యాచ్‌కు కూడా ఇంత విలువ కనిపించదు. బ్రాడ్‌కాస్టర్ స్టార్ గ్రూప్ తమ వ్యాపార ప్రకటనల రూపంలోనే రూ.250 కోట్ల వరకు కోల్పోనుంది. దాయాదుల మ్యాచ్ సందర్భంగా ప్రకటనల రేటు 10 సెకన్లకే రూ.40 లక్షల వరకు పలుకుతుంది. వాస్తవానికి ప్రపంచకప్‌లో ఓ మ్యాచ్ సగటు విలువ రూ.138 కోట్లు మాత్రమే. మరోవైపు షెడ్యూల్ ప్రకారం ఈనెల 15న జరగాల్సిన భారత్-పాక్ మ్యాచ్ ఆగిపోతే ఇరు బోర్డులకు కూడా రూ.200 కోట్ల నష్టం రానుంది. అత్యంత ధనిక బోర్డు బీసీసీఐకి ఈ నష్టం చిన్నదే కావచ్చు. కానీ పీసీబీపై మాత్రం గట్టి దెబ్బే పడనుంది. ఆ బోర్డుకు ఐసీసీ నుంచి అందే వార్షిక ఆదాయమే రూ.325 కోట్లు. దీనికి తోడు మ్యాచ్ నుంచి స్వచ్ఛందంగా తప్పుకొంటుంది కాబట్టి బీమా రక్షణ కూడా ఉండదు. అలాగే ఐసీసీ విధించే పెనాల్టీ, ప్రసారకర్తల నుంచి చట్టపరమైన చర్యలను కూడా పాక్ బోర్డు ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీంతో ఒక్క బాయ్‌కాట్ నిర్ణయంతో పీసీబీ ఆర్థిక పునాదులు కదిలే పరిస్థితి నెలకొననుంది.



భారత మహిళలకు కఠిన పరీక్ష

నేటి నుంచి ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

క్వింగ్‌డావో (చైనా): పీవీ సింధు తప్పుకోవడంతో.. ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టుకు కఠిన సవాల్ ఎదురుకానుంది. మంగళవారం టోర్నీ మొదలవనుంది. అయితే, ఫిట్‌నెస్ లేమితో సింధు తప్పుకోవడంతో ఆ లోటును 17 ఏళ్ల షట్లర్ తన్వీ శర్మ భర్తీ చేసే అవకాశం ఉంది. గత రెండేళ్లుగా తన్వీ చెప్పుకోదగ్గ ప్రదర్శనతో ఆకట్టుకొంటోంది. ఉన్నతి హుడా, మాళవిక బన్సోడ్, రక్షిత శ్రీ భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నారు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రితోపాటు ప్రియ, శ్రుతి, తనీషా ఆడనున్నారు. గ్రూప్-వైలో బుధవారం జరిగే తొలి మ్యాచ్‌లో మలేసియాతో భారత్ తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, తరుణ్, కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, ఆయుష్.. డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ ప్రధానం కాగా.. సాయి ప్రతీక్, పృథ్వీ కృష్ణమూర్తి, హరిహరన్ మిగతా ఆటగాళ్లు. గ్రూప్-సిలో సింగపూర్, జపాన్‌తో భారత్ తలపడనుంది. ప్రతి గ్రూప్‌లో టాప్-2లో నిలిచిన జట్లు క్వార్టర్స్ చేరతాయి.

భారత్ 'ఎ' తరఫున తిలక్

న్యూఢిల్లీ: గాయం నుంచి కోలుకున్న తిలక్ వర్మ మ్యాచ్ ప్రాక్టీస్ కోసం టీ20 వరల్డ్‌కప్ వామప్ మ్యాచ్‌లు ఆడుతున్నాడు. ఇందులో భాగంగా సోమవారం యూఎస్‌ఏతో జరిగిన తొలి వామప్‌లో బరిలోకి దిగాడు. ఈనెల 6న నమీబియాతో జట్టు తలపడనుంది. భారత్ 'ఎ'కు ఆయుష్ బదోని నేతృత్వం వహిస్తుండగా, తిలక్‌తో పాటు మయాంక్, రియాన్, బిష్ణోయ్‌లకు చోటు కల్పించారు.

మిగిలింది కంగారూ టాటూనే!



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌తో కెరీర్ స్లామ్ సాధించిన వరల్డ్ నెంబర్ వన్ కార్లోస్ అల్కారజ్ ఈ విజయాన్ని చిరస్మరణీయం చేసుకోవాలనుకుంటున్నాడు. ఇందులో భాగంగా తన శరీరంపై కంగారూను పచ్చబొట్టుగా వేయించుకోనున్నాడు. అలాగే యూఎస్, వింబుల్డన్, ఫ్రెంచ్ ఓపెన్‌లను గెలిచాక, వాటిని తొలిసారి అందుకున్న తేదీలతో పాటు స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ, బ్లూ బెర్రీ, ఈఫిల్ టవర్‌లను ఇప్పటికే తన శరీరంపై టాటూగా వేయించుకోవడం విశేషం. ఇప్పుడు వీటికి జతగా త్వరలో కంగారూ రాబోతోందని అల్కారజ్ తెలిపాడు.

పాక్‌పై చర్యలు తీసుకోవాలి

గవాస్కర్, హర్భజన్



న్యూఢిల్లీ: పాకిస్థాన్ యూటర్న్ తీసుకుంటుందని తాను ఊహించానని మాజీ కెప్టెన్ గవాస్కర్ చెప్పాడు. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించిన పాక్‌పై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఐసీసీని డిమాండ్ చేశాడు. ఇక, భారత్‌తో మ్యాచ్ ఆడడంలేదని చివరి నిమిషంలో ప్రకటించిన పాకిస్థాన్‌ను ఏమాత్రం ఉపేక్షించొద్దని మాజీ ఆటగాడు హర్భజన్ సింగ్.. ఐసీసీని కోరాడు. 'పాక్ నిర్ణయం ఐసీసీకి నష్టం చేకూరుస్తుంది. అందువల్ల ఆ జట్టుపై చర్యలు తీసుకోవాలి' అని భజ్జీ అన్నాడు.

అర్జున్‌కు 13వ స్థానం

వింగ్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ చెస్ మాస్టర్స్ టోర్నీ ఆఖరిరౌండ్‌లో పరాజయం పాలైన అర్జున్ ఇరిగేసి (4.5 పాయింట్లు)..చివరికి 13వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. 13వ రౌండ్‌లో అబ్దుసత్తొరోవ్ (ఉజ్బెకిస్థాన్) చేతిలో అర్జున్ పరాజయం పాలయ్యాడు. గుకేష్ 9, ప్రజ్ఞానంద 11వ స్థానంలో నిలిచారు. అబ్దుసత్తొరోవ్ (9) టైటిల్ సాధించాడు.

మాకు మరో మార్గం లేదు

ప్రభుత్వ సూచనలు పాటిస్తామన్న పాక్ కెప్టెన్ ఆఘా



కొలంబో చేరిన జట్టు

కరాచీ: భారత్‌తో టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌ను బహిష్కరిస్తూ తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నోరు మెదపడంలేదు. అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని శిరసావహించడం తప్ప తమకు మరో మార్గం లేదని బోర్డు వర్గాలు భావిస్తున్నట్టు ఓ అధికారి వెల్లడించారు. ఈనెల 7న నెదర్లాండ్స్‌తో మ్యాచ్ ద్వారా వరల్డ్ కప్‌ను పాకిస్థాన్ జట్టు ప్రారంభించనుంది. ఇక తమ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సంబంధించి తమకు అందే సూచనలను జట్టు పాటిస్తుందని పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా తెలిపాడు. 'మేం బోర్డుతో కాంట్రాక్టు ఉన్న క్రికెటర్లం. అందువల్ల ప్రభుత్వం, బోర్డు తీసుకొనే నిర్ణయాలను అమలు చేస్తాం' అని లాహోర్ నుంచి సోమవారం కొలంబో బయలుదేరిన సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఆఘా అన్నాడు. కాగా.. పాక్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆ దేశ మాజీ కెప్టెన్లు షాహిద్ అఫ్రీది, రషీద్ లతీఫ్ సమర్థించారు. 'బీసీసీఐకి ఐసీసీ అణిగిమణిగి ఉండడం చూస్తే.. దానికి వ్యతిరేకంగా గళం విప్పాల్సిన సమయం ఆసన్నమైంది' అని లతీఫ్ పేర్కొనగా.. క్రీడలతో రాజకీయాలను ముడిపెట్టడాన్ని తాను సమర్థించనని, కానీ పాక్ ప్రభుత్వ బహిష్కరణ నిర్ణయాన్ని అర్థం చేసుకోగలనని అఫ్రీది అన్నాడు.

ప్రతిభకు ఏదీ గుర్తింపు?



- ఇల్లుగడవక పనులకు వెళ్లాల్సిన దుస్థితి
- ఆసియా క్రీడల పతక విజేత అగచాట్లు
- అగసర నందినికి అందని సాయం

ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో అత్యంత క్లిష్టమైన ఈవెంట్ మహిళల హెప్టాథ్లాన్. ఏడు అంశాల సమాహారమైన ఈ ఈవెంట్‌లో తలపడే అథ్లెట్లు.. అటు వేగంగా పరిగెత్తడంతో పాటు త్రో చేయడంలోనూ సిద్ధహస్తులై ఉండాలి. దిగ్గజ అథ్లెట్లు జేజే శోభ, స్వప్నా బర్మన్ తర్వాత ఈ ఈవెంట్‌లో వినిపిస్తున్న పేరు అగసర నందిని. అంతేకాదు.. ఈ ఈవెంట్‌లో ఇండియా నెంబర్ వన్ నందినియే. ఆమె ఆసియా క్రీడలు, ఆసియా చాంపియన్‌షిప్ రెండింట్లోనూ పతకాలు గెలిచిన మూడో భారతీయ అథ్లెట్ నందిని. ఒలింపిక్స్‌లో పతకం సాధించే సత్తా ఉన్నా, ప్రోత్సహించే వారు కరవై రోజు గడవడానికి బర్త్‌డే ఫంక్షన్ల స్టేజీ డెకరేషన్.. ఇతరత్రా అలంకరణ పనులకు వెళ్తున్న దయనీయ స్థితి ఆమెది. తండ్రి టీ అమ్ముతూ, తల్లి నాలుగిళ్లలో పని చేస్తే కానీ గడవని పరిస్థితి ఆ కుటుంబానిది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో 30కి పైగా పతకాలు కొల్లగొట్టినా గుర్తింపు, ప్రోత్సాహానికి నోచుకోని హైదరాబాద్ అమ్మాయి నందిని ఆవేదనను ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.





2025	ఆసియా చాంపియన్‌షిప్స్	స్వర్ణం
2023	ఆసియా క్రీడలు	కాంస్యం
2025	జాతీయ చాంపియన్‌షిప్	స్వర్ణం
2025	జాతీయ క్రీడలు	స్వర్ణం

ఊహ తెలిసినప్పటి నుంచి అథ్లెటిక్స్‌నే ప్రాణంగా భావించా. పదేళ్ల అకుంఠిత దీక్షతో హాంగ్జౌ ఆసియా క్రీడల్లో (2023) కాంస్యం, గుమి ఆసియా చాంపియన్‌షిప్ (2025)లో స్వర్ణం సాధించిన తర్వాత కూడా నాకు లభించాల్సిన గౌరవం, గుర్తింపు, ప్రోత్సాహకం దక్కకపోవడం తీవ్రంగా బాధిస్తోంది. ఆసియా క్రీడల్లో పతకం సాధించాక నా కష్టాలన్నీ తీరతాయని భావిస్తే నిరాశే ఎదురైంది. నాతో పాటు ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన పారుల్ చౌధురి (ఉత్తరప్రదేశ్), తజిందర్‌పాల్ సింగ్ (పంజాబ్)కు గ్రూప్-1 ఉద్యోగాలు, భారీ నగదు పురస్కారాలు ఇచ్చి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవించాయి. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ యర్రాజి జ్యోతికి కూడా వచ్చే కామన్వెల్త్ క్రీడలు, ఒలింపిక్స్ సన్నద్ధత కోసం ఇటీవలే ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.30 లక్షల నగదు ప్రోత్సాహకం, ఇంటి స్థలం, ఉద్యోగం ప్రకటించింది. తెలంగాణలో కూడా గతంలో కొందరు క్రీడాకారులకు ఇంటి స్థలాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, నజరానాలు, ఒలింపిక్స్ సన్నద్ధత కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలు లభించాయి. నాపైన మాత్రం ఎందుకు చిన్న చూపు చూస్తున్నారో అర్థం కావడం లేదు.

గాయంతోనే బరిలోకి దిగా..

ఆసియా చాంపియన్‌షిప్‌లో షాట్‌పుట్ విసిరాక మోచేతి కండరాలకు గాయమైంది. ఎలాగైనా పతకం అందించాలన్న పట్టుదలతో నొప్పిని భరిస్తూనే జావెలిన్ కూడా విసిరి.. స్వర్ణపతకం నెగ్గా. స్వప్నా బర్మన్ తర్వాత ఈ ఘనత సాధించిన ఏకైక భారత అథ్లెట్‌ను నేనే. ఈ ప్రదర్శనతో వరల్డ్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌కు అర్హత పొందిన తొలి తెలుగమ్మాయిని కూడా నేనే. ఆసియా చాంపియన్‌షిప్ పతకానికి ఇచ్చే నగదు ప్రోత్సాహకం ఇప్పటికీ అందలేదు. నా భవిష్యత్‌కు, నాపై ఆధారపడిన నా కుటుంబ సభ్యులకు ఎలాంటి భరోసా, ఆసరా లేకపోవడం నన్ను మానసిక వేదనకు గురి చేస్తోంది.

హెప్టాథ్లాన్‌లో నెంబర్ వన్..

హెప్టాథ్లాన్‌లో గత రెండేళ్లుగా జాతీయ స్థాయిలో నేనే నెంబర్ వన్. గత మేలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో అయిన గాయానికి చికిత్స కూడా తీసుకోలేకపోయా. గాయం కారణంగా నేను గత ఆరు నెలలుగా ఎలాంటి పోటీల్లోనూ పాల్గొనడం లేదు. అయినా ప్రస్తుతం 27వ ర్యాంక్‌లో ఉండడంతో ఇప్పటినుంచి మళ్లీ పోటీల్లో పాల్గొంటే ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. అయితే, కనీస గుర్తింపు, గౌరవం లభించకపోయేసరికి ఇన్ని కష్టాలు, బాధలు పడేకంటే పరుగు ఆపివేస్తేనే మంచిదన్న బాధ కలుగుతోంది. స్వతహాగా క్రీడాకారుడైన సీఎం రేవంత్ రెడ్డి గారు నా సమస్యల్ని తెలుసుకొని సాయం అందిస్తే జపాన్ వేదికగా ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే ఆసియా క్రీడల్లో తిరిగి దేశానికి పతకం అందించగల సత్తా నాలో ఉంది.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

బిజినెస్

వచ్చే ఏడాది ఎల్ఐసీ ఎఫ్‌పీఓ

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో మలి విడత పబ్లిక్ ఆఫరింగ్ (ఎఫ్‌పీఓ) ద్వారా ఎల్ఐసీలో తన వాటాను కేంద్ర ప్రభుత్వం మరింత తగ్గించుకోనుందని ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి ఎం నాగరాజు సోమవారం తెలిపారు. ప్రస్తుతం ఎల్ఐసీలో కేంద్రం 96.5% వాటా కలిగి ఉంది. 2022 మే నెలలో కేంద్రం కంపెనీలోని 3.5% వాటాను ఐపీఓ ద్వారా విక్రయించింది. తద్వారా సర్కారు ఖజానాకు రూ.21,000 కోట్ల ఆదాయం సమకూరింది. 2027 మే నాటికి ప్రభుత్వ రంగ కంపెనీల్లో పబ్లిక్ షేర్‌హోల్డర్ల వాటా కనీసం 10 శాతానికి పెరగాలన్న సెబీ నిబంధన ప్రకారంగా.. కేంద్రం ఎల్ఐసీలో మరో 6.5% వాటా విక్రయించాల్సి ఉంటుంది. దేశంలో అతిపెద్ద బీమా కంపెనీ అయిన ఎల్ఐసీ.. షేరు బీఎస్ఈలో సోమవారం రూ.804 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) రూ.5.08 లక్షల కోట్లుగా ఉంది.

పీఎస్‌బీల్లో 49 శాతం ఎఫ్‌డీఐ!

ప్రభుత్వ రంగ బ్యాంకుల ఈక్విటీలో మరిన్ని విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం పీఎస్‌బీల ఈక్విటీలో 20% వరకు ఎఫ్‌డీఐని అనుమతిస్తారు. ఈ పరిమితిని 49 శాతానికి పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రతిపాదనపై ఇప్పటికే వివిధ మంత్రిత్వ శాఖల మధ్య చర్చలు జరుగుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) కార్యదర్శి ఎం నాగరాజు చెప్పారు. పీఎస్‌బీల ఈక్విటీని మరింత విస్తరించే ఉద్దేశంతో ఈ ప్రతిపాదన చేసినట్టు తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	500
వరంగల్	487	గోదావరి	470
చిత్తూరు	573	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	130	విజయవాడ	133
వరంగల్	130	గుంటూరు	133
కరీంనగర్	130	ఒంగోలు	133
మహబూబ్‌నగర్	130	చిత్తూరు	117
కర్నూలు	130	నెల్లూరు	122
విశాఖపట్నం	125	అనంతపురం	122
గోదావరి	133		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,47,170 ▼	1,34,900 ▼	3,00,000 ▼
విజయవాడ	1,57,000 ▼	1,45,000 ▼	2,67,000 ▼
విశాఖపట్నం	1,57,199 ▼	1,47,200 ▼	3,00,000 ▼
రాజమండ్రి	1,51,530 ▼	1,38,900 ▼	2,73,009 ▼
ప్రొద్దుటూరు	1,49,000 ▼	1,37,080 ▼	2,50,000 ▼
ముంబై	1,48,750 ▲	1,36,250 ▲	2,59,500 ▲

బులియన్ 'బేర్'



మూడు రోజుల్లో వెండి రూ.1.44 లక్షలు డౌన్

17 % నష్టపోయిన పసిడి ధర

న్యూఢిల్లీ: బులియన్ మార్కెట్ ఇన్వెస్టర్ల కంట రక్తకన్నీరు కార్పిస్తోంది. ఇంకా, ఇంకా పెరుగుతుందని అత్యాశకు పోయి గత నెల రోజులుగా ఎగబడి బంగారం, వెండి కొనిపెట్టుకున్న మదుపరులు, కొనుగోలుదారులు ఇపుడు ఎరక్కపోయి ఇరుక్కుపోయామని లబోదిబోమంటున్నారు. సోమవారంనాడు కూడా బులియన్ మార్కెట్‌లో మహాపతనం కొనసాగింది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.52,000 నష్టంతో రూ.2.6 లక్షల వద్ద ముగిసింది. పది గ్రాముల మేలిమి బంగారం రూ.12,800 పతనమై రూ.1,52,700 వద్ద ముగిసింది. దీంతో గత మూడు రోజుల్లోనే ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,44,500 (36%), 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.30,300 (17%) నష్టపోయాయి.

అంతర్జాతీయ మార్కెట్: అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లోనూ సోమవారం బంగారం, వెండి ధరలు కుదేలయ్యాయి. ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి బంగారం రెండు శాతం నష్టంతో 4,715 డాలర్ల వద్ద, వెండి 1.4 శాతం నష్టంతో 79 డాలర్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకాయి.

ఫ్యూచర్స్ మార్కెట్: ఈ మార్కెట్లో పసిడి ధర మాత్రమే కొద్దిగా కోలుకుంది. ఏప్రిల్‌లో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి బంగారం ఎంసీఎక్స్‌లో సోమవారం ప్రారంభంలో ఒక దశలో రూ.10,688 నష్టంతో (7.2%) రూ.1,37,065 ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని తాకింది, చివరికి కొద్దిగా కోలుకుని రూ.259 స్వల్ప లాభంతో రూ.1,48,012 వద్ద ముగిసింది. వెండి వరుసగా మూడో రోజూ నష్టాలతోనే ముగిసింది. కిలోకు రూ.39,847 (15%) నష్టంతో రూ.2,25,805 ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకింది. చివరికి రూ.15,410 (5.8%) నష్టంతో రూ.2,50,242 వద్ద ముగిసింది.

పతనానికి కారణాలు

- మదుపరుల లాభాల స్వీకరణ అమ్మకాలు.
- ప్రధాన కరెన్సీలతో అమెరికా డాలర్ మారకం రేటు పుంజుకోవడం.
- అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గడం.
- అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభిస్తాయనే భయాలు సద్దుమణగడం
- కేంద్ర బడ్జెట్‌లో పసిడి, వెండి దిగుమతులపై సుంకాల పెంపు లేకపోవడం.
- అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పసిడి, వెండి ధరలు తగ్గడం.

పెట్టుబడులు, వృద్ధి పైనే ఫోకస్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్




న్యూఢిల్లీ: పెట్టుబడులు ప్రాధాన్య సాధనంగా ఆర్థిక వృద్ధిని పెంచడంపై 'బడ్జెట్ 2026-27' దృష్టి సారించిందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అలాగే ప్రభుత్వం వృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నదని ద్రవ్యలోటు నియంత్రణ లక్ష్యం తెలుపుతుందన్నారు. బడ్జెట్ విశేషాలను పంచుకునేందుకు సోమవారం మీడియాతో సమావేశంలో ఆమె ప్రస్తావించిన ముఖ్యాంశాలు..

- అంతర్జాతీయ అనిశ్చితుల కారణంగానే బంగారం ధరలు తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతున్నాయి. ఆర్‌బీఐతోపాటు చాలా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు బంగారం నిల్వలను పెంచుకుంటున్నాయి. ఏ దేశ కరెన్సీ పైనా నమ్మకం లేకపోవడం వల్లే ఇన్వెస్టర్లు బంగారం కొనుగోలుకు ఎగబడుతున్నారు.
- డెరివేటివ్ ట్రేడింగ్‌లో స్పెక్యులేషన్‌ను తగ్గించేందుకే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) పెంచాం. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో తమ పిల్లలు డబ్బులు పోగొట్టుకుంటున్నారని, ప్రభుత్వం కలుగ జేసుకోవాలని చాలా మంది తల్లిదండ్రులు నాకు ఫోన్ కాల్స్ ద్వారా ఫిర్యాదు చేశారు.
- ఈసారి ప్రభుత్వ ప్రాధాన్యం వృద్ధి. ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి కట్టడి చేస్తాం. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, ఆస్తుల నగదీకరణను కొనసాగిస్తాం. ఐడీబీఐ బ్యాంక్‌లో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ పురోగతిలో ఉంది.
- జీఎస్‌టీ రేట్ల తగ్గింపు, వ్యక్తిగత ఆదాయం పన్ను మినహాయింపు పరిమితి పెంపుతో పెరిగిన వినియోగం ముమ్ముందూ కొనసాగుతుందన్న నమ్మకం ఉంది.

బడ్జెట్ సెషన్ ద్వితీయార్ధంలో ఐబీసీ సవరణ బిల్లు

ఈ మార్చి 9 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సెషన్ ద్వితీయార్ధంలో ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్ (ఐబీసీ) సవరణ బిల్లు, 2025ను ప్రవేశపెట్టనున్నట్లు సీతారామన్ తెలిపారు. ఈ బిల్లుపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ తన నివేదిక ఇప్పటికే సమర్పించిందన్నారు. దివాలా స్మృతి చట్టంలో ప్రతిపాదించిన సవరణలు దివాలా పరిష్కార చర్యలను వేగవంతం, సమర్థవంతం చేయడంతోపాటు చట్టాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా మార్చనున్నాయని ఆమె పేర్కొన్నారు.

కారు.. గిరాకీ ఫుల్లు!



న్యూఢిల్లీ: గత నెలలోనూ కార్లకు బలమైన గిరాకీ నమోదైంది. మారుతి సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా(ఎం అండ్ ఎం), హ్యుండయ్ మోటార్ టోకు విక్రయాలు మెరుగైన వృద్ధిని నమోదు చేశాయి. గత ఏడాది దసరా, దీపావళి పండగ సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రయాణికుల వాహనాలపై జీఎస్‌టీని గణనీయంగా తగ్గించడంతో పాటు మార్కెట్లో కి కొత్త మోడళ్ల విడుదల ఇందుకు ప్రధానంగా దోహదపడ్డాయని ఇండస్ట్రీ వర్గాలు తెలిపాయి. దేశంలో అతిపెద్ద కార్ల కంపెనీ మారుతి సుజుకీ దేశీయ టోకు అమ్మకాలు గతనెలలో 1,74,529 యూనిట్లకు పెరిగాయి. జనవరిలో కంపెనీ మొత్తం విక్రయాలు (దేశీయంగా అమ్మకాలు+ఎగుమతులు) సరికొత్త రికార్డు స్థాయి 2,36,963 యూనిట్లకు చేరాయని మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు. మార్కెట్లో మారుతి కార్లకు రోజుకు 9,000- 10,000 వరకు బుకింగ్స్ లభిస్తున్నాయన్నారు.

- టాటా మోటార్స్ ప్యాసింజర్ వాహన దేశీయ అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన 46% వృద్ధితో 70,222 యూనిట్లకు ఎగబాకాయి.
- ఎం అండ్ ఎం తన డీలర్లకు 63,510 యూనిట్ల వాహనాలను సరఫరా చేసింది. 2025 జనవరితో పోలిస్తే 25% అధికం.
- హ్యుండయ్ మోటార్ హోల్‌సేల్స్ 9% పెరిగి 59,107 యూనిట్లుగా నమోదయ్యాయి.
- టయోటా కిర్లోస్కర్ మోటార్ దేశీయ అమ్మకాలు 17% వృద్ధితో 30,630 యూనిట్లకు పెరిగాయి.
- కియా ఇండియా సేల్స్ 10% పెరిగి 27,603 యూనిట్లకు చేరగా.. రెనో ఇండియా అమ్మకాలు 34% ఎగబాకి 3,715 యూనిట్లకు చేరాయి.

ధరలు పెంచే యోచనలో మారుతి

మారుతి సుజుకీ కార్లు మరింత ప్రియం కానున్నాయి. కార్ల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగిన నేపథ్యంలో కొంత భారాన్ని కస్టమర్ల పైకి బదిలీ చేయాలని భావిస్తున్నట్లు పార్థో బెనర్జీ తెలిపారు. ఉత్పత్తి అవరోధాల కారణంగా ప్రస్తుతం 1.75 లక్షల యూనిట్లకు పైగా ఆర్డర్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

రేసు గుర్రాల్లా సెన్సెక్స్, నిఫ్టీ

మళ్లీ 25,000 పాయింట్ల పైకి నిఫ్టీ

ముంబై: సెక్యూరిటీ లావాదేవీల పన్నుపై ఏర్పడిన భయాలు తగ్గడంతో సోమవారం సెన్సెక్స్, నిఫ్టీ సోమవారం రేసు గుర్రాల్లా పరిగెత్తాయి. సెన్సెక్స్ 943.52 పాయింట్లు లాభపడి 81,666.46 వద్ద ముగియగా, నిఫ్టీ 262.95 పాయింట్ల లాభంతో 25,088.40 వద్ద ముగిసింది. ఇంట్రా డేలో సెన్సెక్స్ 1,345 పాయింట్లు కోలుకుంది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ మార్కెట్ అంచనాలకు అనుగుణంగా ఉండడం, తగ్గుతున్న కమోడిటీల ధరలు, భారత-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చలు త్వరలోనే ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్న వార్తలు, ముడి చమురు ధర భారీగా తగ్గడం కూడా సోమవారం మార్కెట్‌కు కలిసి వచ్చాయి. దీంతో ఇన్వెస్టర్లు బ్లూచిప్ షేర్లు, ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకింగ్, ఆటోమొబైల్ కంపెనీల షేర్లను ఎగబడి కొన్నారు.

కోలుకున్న 'బ్రోకరేజి' షేర్లు : ఆదివారం కుప్పకూలిన స్టాక్ బ్రోకరేజి కంపెనీల షేర్లు సోమవారం బాగా కోలుకున్నాయి. ఏంజెల్ వన్ కంపెనీ షేర్లయితే బీఎస్ఈలో నాలుగు శాతం లాభంతో రూ.2,405.05 వద్ద ముగిశాయి. సోమవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభంలో సూచీలతో పాటు ఈ కంపెనీల షేర్లూ నష్టపోయాయి. అయితే కొద్ది సేపటికే మార్కెట్ లాభాల బాట పట్టడంతో ఈ షేర్లూ లాభాల బాట పట్టాయి.

రూ.36,000 కోట్ల ఎఫ్‌పీఐ పెట్టుబడులు ఔట్: దేశీయ స్టాక్ మార్కెట్‌లో విదేశీ పోర్టుఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ) అమ్మకాల హోరు కొనసాగుతోంది. గత నెలలోనూ ఎఫ్‌పీఐలు దేశీయ స్టాక్ మార్కెట్ నుంచి రూ.35,962 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. గత ఏడాది మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా ఈ సంస్థలు రూ.1.66 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి.


పీఎఫ్‌సీ-ఆర్‌ఈసీ విలీనం!?: న్యూఢిల్లీ: విద్యుత్ రంగానికి రుణాలిచ్చే ప్రభుత్వ రంగ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), దాని అనుబంధ విభాగం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్‌ఈసీ) లిమిటెడ్ ఏకం కానున్నాయి. పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీలను పునర్వ్యవస్థీకరించనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రకటించారు. ఆ ప్రక్రియలో భాగంగా, పీఎఫ్‌సీలో ఆర్‌ఈసీని విలీనం చేయాలని కేంద్రం భావిస్తున్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దేశంలో విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడంలో ఈ రెండు కంపెనీలదే కీలకపాత్ర.

వికసిత్ భారత్ లక్ష్యం

▸ బడ్జెట్‌పై కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, బీజేపీ ఎంపీల వెల్లడి

న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడమే ధ్యేయంగా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. సోమవారం ఢిల్లీలోని తన నివాసంలో బీజేపీ ఏపీ ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, సీఎం రమేశ్, పాకా సత్యనారాయణలతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, బెంగళూరు-చెన్నై కారిడార్లు ఏపీ మీదుగా వెళ్లడం వల్ల రాష్ట్రంలోని పట్టణాల మధ్య కనెక్టివిటీ పెరుగుతుందని చెప్పారు. దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యం దక్కినట్లు తెలిపారు. జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, బీజేపీ ఎంపీలు ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుది నిర్మాణాత్మక వైఖరి కాగా, జగన్‌ది విధ్వంసకర వైఖరి అని సీఎం రమేశ్ విమర్శించారు. కాగా, కేంద్రబడ్జెట్‌ను ఆంధ్రప్రదేశ్‌కు స్పష్టమైన దిశ చూపించేదిగా ఏపీ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వ్యాఖ్యానించారు.

ఫిబ్రవరి నుంచే వేడి!



▸ దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి

▸ రాయలసీమ, దక్షిణ కోస్తాలో సాధారణంగానే రాత్రి ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): దాదాపు రెండునెలల పాటు ప్రజలను వణికించిన చలి.. ఫిబ్రవరి నెలలో తగ్గనున్నది. దేశంలోని అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. అయితే తమిళనాడు, రాయలసీమ, దక్షిణ కోస్తాంధ్ర, దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగానే నమోదవుతాయి. ఇదే సమయంలో వాయవ్యభారతంలో చలిగాలులు నమోదయ్యే రోజుల సంఖ్య తగ్గనుంది. మధ్యభారతంలో, కేరళలోని కొన్ని ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా, దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. ఫిబ్రవరిలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు, వర్షపాతంపై భారత వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది. దీని ప్రకారం ఈ నెలలో సగటు కంటే తక్కువగా వర్షపాతం నమోదుకానుంది. వర్షాలపై ఆధారపడి పంటలు సాగుచేసే వాయవ్య, దానికి ఆనుకొని మధ్య, తూర్పుభారతంలో ఎక్కువరోజులు పొడివాతావరణం కొనసాగుతుంది. దీర్ఘకాల సగటు వర్షపాతం లెక్కల మేరకు వాయవ్య భారతంలో ఈనెలలో 65 మి.మీ.లు, దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో 22.7 మి.మీ.ల వర్షపాతం నమోదుకావాలి. అయితే దీర్ఘకాల సగటులో 81 శాతం వర్షపాతం కురిసే అవకాశం ఉందని బులెటిన్‌లో పేర్కొన్నారు.

ఈ నెలంతా వేడి...

రాష్ట్రంలో ఫిబ్రవరి నెలలో వేసవి తీవ్రత ఛాయలు కనిపించే అవకాశం ఉందని తాజా బులెటిన్ బట్టి అంచనా వేయవచ్చని వాతావరణ నిపుణులు విశ్లేషించారు. ఈ నెలలో రాయలసీమ, దక్షిణ కోస్తాలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణంగా, ఉత్తరకోస్తాలో సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. పగటి ఉష్ణోగ్రతలు మాత్రం రాయలసీమ,కోస్తాలోని అన్ని ప్రాంతాల్లోనూ సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయ అంచనావేస్తున్నారు.

సీమలో తగ్గిన రాత్రి ఉష్ణోగ్రతలు

కోస్తా జిల్లాలపైకి తూర్పుగాలులు వీస్తుండడంతో అనేకచోట్ల స్వల్పంగా మేఘాలు ఆవరించాయి. రాయలసీమలో ఆకాశం నిర్మలంగా మారింది. దీంతో రాత్రి పూట చలి తీవ్రత కొనసాగింది. విశాఖ ఏజెన్సీ కంటే రాయలసీమలోని పలు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయి. సోమవారం కడపలో 15.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

బతుకు..బండికి ఆమే డ్రైవర్..!


కర్నూలులో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఆర్టీసీ బస్సు నడుపుతున్న విశ్వవాణి

▸ ఆర్టీసీ బస్సు నడిపిన తొలి మహిళ

▸ రిపబ్లిక్ డే వేడుకల్లో స్టీరింగ్ పట్టిన విశ్వవాణి

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

మహిళలు కార్లు, ఆటోలు నడపడం చూశాం.. భారీ వాహనాల వద్దకు వచ్చేసరికి ఈ సంఖ్య చాలా చాలా తక్కువగా ఉంటుంది. అయితే.. ఈ లోటును భర్తీ చేస్తూ నవ్యాంధ్రలో హెవీ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణను పూర్తిచేసిన తొలి ఎస్సీ మహిళా డ్రైవర్‌గా కర్నూలుకు చెందిన విశ్వవాణి రికార్డు సృష్టించారు. ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో కర్నూలు ఆర్టీసీ సంస్థలో బస్సు డ్రైవింగ్ శిక్షణను విజయవంతంగా పూర్తిచేశారు. సోమవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో ఉన్నతాధికారుల సమక్షంలో ఆర్టీసీ బస్సు నడిపి శభాష్ అనిపించుకున్నారు. కర్నూలు కలెక్టర్ అట్టాడ సిరి చేతుల మీదుగా ప్రశంసాపత్రం కూడా అందుకున్నారు. అయితే ఆమె ఆర్టీసీలో డ్రైవర్ ఉద్యోగమిచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

తల్లిదండ్రులకు అండగా నిలవాలని..

కర్నూలు నగరం పాత బస్టాండ్ ఏరియాకు చెందిన సిద్దేశ్వరరావు, మణెమ్మ దంపతులకు కుమారుడితో పాటు కుమార్తె విశ్వవాణి సంతానం. చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న సామాన్య మధ్య తరగతి కుటుంబం వారిది. అన్నకు కూడా ఉద్యోగం లేకపోవడంతో స్వయం ఉపాధి (సెల్ఫ్ ఎంప్లాయిమెంట్) పైనే ఆధారపడాల్సి వచ్చింది. బీఎస్సీ చదువుకున్న విశ్వవాణి.. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పొంది తల్లిదండ్రులకు చేదోడుగా నిలవాలని భావించింది. కర్నూలు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసిదేవిని కలసి తన మనసులోనిమాట వెల్లడించింది. ఆ సమయంలో ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ్ యోజన (పీఎం-ఏజేఏవై) పథకం కింద ఎస్సీ యువతకు హెవీ మోటర్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమం ఉందని, 20 మంది యువతకు ఆర్టీసీ సంస్థ శిక్షణ ఇస్తుందని తులసిదేవి వివరించారు. శిక్షణలో ప్రతిభ చూపితే ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. తొలుత కాస్త భయపడిన విశ్వవాణికి తల్లిదండ్రులు ధైర్యం చెప్పడంతో శిక్షణలో చేరారు. ఈ శిక్షణకు వచ్చిన 20 మందిలో విశ్వవాణి ఒక్కరే మహిళ. అయినా కూడా అధైర్యపడకుండా పురుషులతో పోటీపడి శిక్షణ పూర్తి చేసుకున్నారు. శిక్షణలో ప్రతిభ చూపి హెవీ మోటర్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా సాధించారు. సోమవారం జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో కర్నూలు కలెక్టర్ అట్టాడ సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సహా జిల్లా ఉన్నాధికారుల సమక్షంలో ఆర్టీసీ బస్సును నడిపి అందరి ప్రశంసలు అందుకున్నారు. అనంతరం కలెక్టర్ సిరి ఆమెకు ఆమెకు ప్రశంసాపత్రం అందజేశారు.


కర్నూలు కలెక్టర్ డాక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న విశ్వవాణి

జీవనభృతి కోసమే డ్రైవింగ్ నేర్చుకున్నా

"నాన్న కష్టపడితే తప్ప పూట గడవని కుటుంబం మాది. దీంతో జీవనభృతి కోసమే ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో ఆర్టీసీ సంస్థలో బస్సు డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేశాను. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న తొలి ఎస్సీ మహిళను నేనే కావడం సంతోషంగా ఉంది. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసిదేవి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే శిక్షణ పూర్తి చేయగలిగాను. ప్రభుత్వం ఆర్టీసీ సంస్థలో డ్రైవర్ ఉద్యోగం ఇచ్చి.. మాలాంటి వారిని ప్రోత్సహించాలి." - విశ్వవాణి, కర్నూలు

అంబటి ఇంటిపై దాడి ఘటనలో..

టీడీపీ నేతలపై కేసు నమోదు

▸ కార్పొరేటర్ బుజ్జి సహా పలువురిపై ఫిర్యాదు చేసిన రాంబాబు

▸ దాని ఆధారంగా స్పందించిన పోలీసులు

▸ అంబటి రాంబాబును కస్టడీకి ఇవ్వండి

▸ కోర్టులో పోలీసుల పిటిషన్

▸ రాష్ట్ర వ్యాప్తంగా రాంబాబు పై కేసులు

గుంటూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నాయకుడు అంబటి రాంబాబు ఇంటిపై జరిగిన దాడి ఘటనకు సంబంధించి తెలుగు దేశం పార్టీ నేతలపై కేసు నమోదు అయింది. అంబటి రాంబాబు ఫిర్యాదు మేరకు గుంటూరులోని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ లో సోమవారం కేసు నమోదు చేశారు. టీడీపీ కార్పొరేటర్ వేములపల్లి శ్రీ రాంప్రసాద్ అలియాస్ ఇసుక బుజ్జితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు తన ఇంటిపై దాడి చేసి కార్లు, ఫర్నిచర్ ధ్వంసం చేశారని, కిటికీ అద్దాలు పగలగొట్టారని అంబటి రాంబాబు ఫిర్యాదు చేశారు. తన ఇంటికి వచ్చే దారులన్నింటినీ మూసి, తనను అక్రమంగా నిర్బంధించి, దౌర్జన్యం చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా టీడీపీ కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదుచేశారు. కాగా, అంబటి రాంబాబును విచారించేందుకు పోలీసు కస్టడీకి ఇవ్వాల్సిందిగా నల్లపాడు పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కస్టడీ పిటిషన్ మంగళవారం బెంచ్ పైకి రానుంది. కస్టడీకి అనుమతి వచ్చిన పక్షంలో ఆయనను రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తీసుకురానున్నారు. సీఎంను అసభ్య పదజాలంతో దూషించిన ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా అంబటి రాంబాబుకు వ్యతిరేకంగా పోలీస్ స్టేషన్లో కేసులు నమోదయ్యాయి. అనంతపురం, అనకాపల్లితో పాటు రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. ఈ కేసులన్నింటిలో పోలీసులు కోర్టులో పీటీ వారంట్లు వేయనున్నట్లు తెలుస్తోంది.

అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా!

వైసీపీ హయాంలో తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను సానుభూతిపరులతో పాటు సామాన్య ప్రజలను సైతం కేసుల పేరుతో వేధింపులకు గురి చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే సాగుతో చట్టాన్ని పెద్దఎత్తున దుర్వినియోగం చేశారు. పార్టీ జాతీయ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. ఇలా ఎన్ని దాడులు చేసినా టిడిపి నేతలు ఇచ్చిన ఫిర్యాదులను ఆనాడు పోలీసులు కనీసం తీసుకోవడానికి కూడా సాహసించలేదు. కానీ, అంబటి రాంబాబు కార్యాలయంపై దాడికి పాల్పడిన ఘటనలో ఇప్పుడు పోలీసులు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేశారు. ఇదే వైసీపీకీ, టీడీపీకీ ఉన్న తేడా అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

జోగి ఇంటిపై దాడి ఘటనలో

40 మందిపై కేసులు

▸ ఇప్పటివరకు 12 మంది అరెస్టు..

▸ స్టేషన్ బెయిల్‌పై విడుదల

విజయవాడ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి జోగి రమేశ్ ఇంటిపై దాడి కేసులో పోలీసులు మొత్తం 40 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలను నిందితులుగా చేర్చారు. వారిలో 12 మందిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అనంతరం వారిని స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. మరోపక్క జోగి రమేశ్ కార్యాలయంలో పనిచేసే మూలపాడు రాంబాబు అనే వ్యక్తి ఈ దాడిపై మరో ఫిర్యాదు చేశారు. 250 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేశారని పేర్కొన్నారు.

రాజ్యసభలో అంబటి, జోగి అంశం ప్రస్తావన

▸ వైస్ చైర్మన్ తీవ్ర అభ్యంతరం

▸ పద్ధతి కాదంటూ వైసీపీ ఎంపీపై ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేశ్‌ల అంశాన్ని ఆ పార్టీ ఎంపీ పిల్లి సుభాశ్ చంద్రబోశ్ రాజ్యసభలో లేవనెత్తారు. దీనిపై సభాధ్యక్ష స్థానంలో ఉన్న వైస్ చైర్మన్ దినేశ్ శర్మ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. సభలో లేని వ్యక్తుల గురించి ఇక్కడ ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో పిల్లి సుభాశ్ చంద్రబోశ్ వీరిద్దరి అంశం ప్రస్తావించారు.

సర్పంచ్‌గా పోటీ చేయాలని..

కన్నకూతురినే చంపేశాడు!

▸ ముగ్గురు పిల్లలుంటే అర్హత ఉండదని ఘాతుకం

▸ ఆరేళ్ల పాపను నిజాంసాగర్ కెనాల్‌లో తోసేసిన ఘోరం

నిజామాబాద్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి ముగ్గురు పిల్లల నిబంధన అడ్డుగా ఉందని ఓ తండ్రి ఏకంగా కన్నకూతురినే చంపిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్రలోని కేరూర్ నుంచి నిజామాబాద్ జిల్లాకు చిన్నారిని తీసుకొచ్చి, నిజాంసాగర్ కెనాల్‌లోకి తోసేసి వెళ్లిపోయాడు. బోధన్ పోలీసులు ఈ కేసును వేగంగా ఛేదించారు. మహారాష్ట్రలోని ముఖేడ్ తాలూకా కేరూర్‌కు చెందిన కొండమంగలే పాండురంగ సెలూన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. పంచాయతీ ఎన్నికల్లో కేరూర్ సర్పంచ్‌గా పోటీ చేయాలనుకున్నాడు. ముగ్గురు పిల్లలు ఉంటే పోటీకి అర్హత ఉండదని భావించి, తన కూతురు ప్రాచీ(6)ని గత నెల 29న నిజామాబాద్ జిల్లా ఎడపల్లి వద్దకు తీసుకొచ్చి నిజాంసాగర్ కెనాల్‌లోకి తోసివేసి పరారయ్యాడు. చిన్నారి మృతదేహం లభ్యం కావడంతో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి పాప సంబంధీకుల కోసం గాలించారు. సోషల్ మీడియా గ్రూపుల్లో సమాచారం షేర్ చేయగా సుధీర్ అనే కానిస్టేబుల్ వాట్సాప్ స్టేటస్‌ను ముఖేడ్ గ్రామస్థులు చూసి పాపను గుర్తించి సమాచారం ఇచ్చారు. పోలీసులు ముఖేడ్ వెళ్లి పాప పాండురంగ కూతురని గుర్తించారు. అతనికి తొలి సంతానంగా కవలలు(ఆడపిల్లలు), తర్వాత మరో బాబు ఉన్నాడు. అయితే ముగ్గురు పిల్లలు ఉంటే సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి అర్హత ఉండదని..బాబును ఎవరికైనా దత్తత ఇవ్వాలని ప్రయత్నించాడు. ఆ ప్రయత్నాలు ఫలించకపోవడంతో వారిలో ఒకర్ని కడతేర్చాలని ప్రస్తుత కేరూర్ సర్పంచ్ షిండే గణేశ్‌కలిసి పథకం పన్నాడు. కవలల్లో చిన్నారి ప్రాచీని బైక్‌పై తీసుకెళ్లి ఎడపల్లి వద్ద నిజాంసాగర్ కెనాల్‌లో తోసేసి వారిద్దరూ పారిపోయారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

అందుకే విడిపోయాం

మృణాల్ ఠాకూర్



తన మాజీ ప్రియుడితో బంధం ముగిసిపోయినందుకు ఎలాంటి బాధ లేదు అని మృణాల్ ఠాకూర్ అన్నారు. ఆమె బాలీవుడ్‌లో నటించిన తాజా చిత్రం 'దో దీవానే షహర్ మే' ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ చిత్ర ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె తన మాజీ ప్రేమికుడిని ప్రస్తావించారు. 'నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండడం కష్టమని నా మాజీ ప్రియుడు నాకు బ్రేకప్ చెప్పారు. నేను యాక్టింగ్ చేయడం కూడా ఆయనకు నచ్చేదికాదు. మేమిద్దరం విడిపోవడానికి అది కూడా ఓ కారణం. ఆయన నాకు బ్రేకప్ చెప్పినందుకు నేను ఏ రోజూ బాధపడలేదు. తన మనస్తత్వం గురించి జాలి పడ్డాను. అలాంటి వాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం. అలాంటి వాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే రకమైన భావనలతో పెరుగుతారు. అది నాకు ఇష్టం లేదు' అని మృణాల్ ఠాకూర్ పేర్కొన్నారు. కొంతకాలంగా మృణాల్ తమిళ హీరో ధనుష్‌తో రిలేషన్‌లో ఉన్నారంటూ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ వార్తల్ని ఆమె ఖండించారు. ఆ తర్వాత క్రికెటర్ శ్రేయస్ అయ్యర్‌తో డేటింగ్‌లో ఉన్నారంటూ మరికొన్ని వార్తలు రావడంతో.. వాటినీ ఖండించారు.

సీతారామం జంట మరోసారి

దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్ జంటగా సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహ్మాన్ స్వరపరిచిన 'భీగీ భీగీ' అనే పాటను తాజాగా విడుదల చేశారు. రెహ్మాన్ తనయుడు ఏ ఆర్ అమీన్, జస్లీన్ రాయల్ ఆలపించిన ఈ గీతం ప్రస్తుతం అందర్నీ విశేషంగా అలరిస్తోంది. ఈ పాటతో ఇటీవలే దుల్కర్, మృణాల్ జంటగా నెట్టింట వైరల్ అయిన ఓ ఫొటోపై జరిగిన డిబేట్‌కు స్పష్టత వచ్చింది. కాగా వీరిద్దరూ కలసి నటించిన 'సీతారామం' ప్రేక్షకుల్ని విశేషంగా అలరించింది.

తెరపై దేవుడినే చూస్తారు



అరుణ్ గోవిల్



బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకుంటున్న చిత్రం 'రామాయణ'. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి నటిస్తున్నారు. 1987-88లో విశేషాదరణ పొందిన టెలివిజన్ సీరియల్ 'రామాయణ్'లో అరుణ్ గోవిల్ శ్రీరాముడి పాత్రలో మెప్పించారు. ఇప్పుడు ఆయన 'రామాయణ'లో దశరథుడి పాత్రలో కనిపించనున్నారు. ఇటీవలె ఈ సినిమా నుంచి శ్రీరాముడి లుక్‌లో రణ్‌బీర్ కపూర్ ఫొటో బయటకు వచ్చింది. దీంతో చాలామంది రామాయణ్ సీరియల్‌లోని అరుణ్ గోవిల్ గెటప్‌తో పోల్చారు. ఈ క్రమంలో అరుణ్ గోవిల్ స్పందించారు. 'ఏదైనా సినిమా వస్తుందంటే దానిని పోల్చడానికి ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. రాముడి రూపం ఇలా ఉంటుంది అని వారు ముందుగానే ఒక అంచనాకు వచ్చినప్పుడు ఇలాంటి పోలికలు రావడం సహజం. ప్రేక్షకులు తెరపై మనల్ని చూడరు. మన పాత్రలో ఉన్న దేవుడినే చూస్తారు. బహుశా దేవుడు ఇలానే ఉంటాడేమో అని ప్రేక్షకులు అనుకోవాలి. అంతలా మనల్ని ప్రభావితం చేయాలి' అని అన్నారు. అలాగే 'రామాయణ' చిత్రాన్ని 'ఆదిపురుష్'తో పోల్చవద్దని, ప్రతి చిత్రం దేనికదే ప్రత్యేకమని పేర్కొన్నారు.

ఇక్కడ సింగీతం.. అక్కడ ఆడూర్ గోపాలకృష్ణన్!





భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పుడు అందరి దృష్టీ ఇద్దరు దర్శకులమీదే ఉంది. వారిలో ఒకరు తెలుగు దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, మరొకరు మలయాళ దర్శకుడు ఆడూర్ గోపాలకృష్ణన్. వాళ్లిద్దరూ వయసుని జయించారని చెప్పాలి. ఎందుకంటే సింగీతం వయసు 94 ఏళ్లు. ఆడూర్ గోపాలకృష్ణన్‌కు 84 ఏళ్లు. ముదిమి వయసులో కూడా వీళ్లిద్దరూ ఉత్సాహం చూపుతూ మెగాఫోన్ చేతపట్టి అందర్నీ ఆశ్చర్య పరిచారు. వైవిధ్యమైన చిత్రాలకు, ప్రయోగాత్మక చిత్రాలకు పెట్టింది పేరు సింగీతం. 'పుష్పక విమానం', 'మయూరి', 'విచిత్ర సోదరులు', 'ఆదిత్య 369', 'భైరవ ద్వీపం' వంటి చిత్రాలు ఆయన ప్రతిభకు, ప్రయోగాలకు అద్దం పడతాయి. విశిష్ట దర్శకుడు కేవీ రెడ్డి శిష్యుడైన సింగీతం రూపొందించిన ప్రయోగాత్మక చిత్రాలు మాస్ ప్రేక్షకులను సైతం అలరించడం విశేషం. తన భావాలతో యువతరం దర్శకులతో పోటీ పడే సింగీతం ఇప్పుడు తన 61వ చిత్రాన్ని రూపొందించడానికి సిద్ధమవుతున్నారు. 'మహానటి', 'కల్కి' వంటి విభిన్న సినిమాలు తీసిన దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ సినిమాకు నిర్మాత కావడం విశేషం. అనుభవం, ఆధునిక భావాల కలబోతగా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు ఇప్పుడే మొదలయ్యాయి.

ఇక మలయాళ దర్శకుడు ఆడూర్ గోపాలకృష్ణన్ విషయానికి వస్తే ఆయనకు 84 ఏళ్లు. 'తగ్గేదేలా' అంటూ ఈ వయసులో కూడా ఉత్సాహం చూపుతూ 'పాదయాత్ర' పేరుతో ఒక సినిమా రూపొందిస్తున్నారు. తన చిత్రాలకు పదహారు సార్లు జాతీయ అవార్డులు పొంది రికార్డ్ సృష్టించిన గోపాలకృష్ణన్ యాభై ఏళ్ల తన సినీ జీవితంలో కేవలం 12 చిత్రాలకు మాత్రమే దర్శకత్వం వహించారు. వాస్తవ జీవితానికి అద్దం పట్టే కథలను ఎన్నుకుని సినిమాలు రూపొందించడం గోపాలకృష్ణన్‌కు అలవాటు. ప్రస్తుతం ఆయన దర్శకత్వం వహిస్తున్న 'పాదయాత్ర' చిత్రం 1950లో వచ్చిన ఓ నవల ఆధారంగా రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాలో మమ్ముట్టి ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. 30 ఏళ్ల అనంతరం వీరిద్దరూ కలసి పని చేస్తుండడం మరో విశేషం. మమ్ముట్టితో గోపాలకృష్ణన్ తీస్తున్న నాలుగో సినిమా ఇది.



బరాబర్ బ్రేకనిస్తుంది

ఆది సాయికుమార్

చంద్రహాస్, మేఘన ముఖర్జీ జంటగా సంపత్ రుద్ర తెరకెక్కించిన చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. గెడా చందు, గాయత్రి చిన్ని, ఏవీఆర్ నిర్మించారు. ఈ నెల 6న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆది సాయికుమార్ మాట్లాడుతూ 'బరాబర్ ప్రేమిస్తా' సినిమా చంద్రహాస్‌కు మంచి బ్రేకనిస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. ఈ వేడుకలో దర్శకుడు జయంత్ సి పరాన్జీ, నటుడు జేడీ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కశ్మీర్ నేపథ్యంలో...



రామ్, ఆదిత్య సూరజ్ సింగ్, కుసుమ, శశికళ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వింటర్'. సురేశ్ లంకలపల్లి దర్శకత్వంలో రియాజ్ అహ్మద్ టీ, శ్రీనివాస రావు నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రాన్ని ఘనంగా ప్రారంభించారు మేకర్స్. కశ్మీర్‌లో జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. రిజ్వాన్ అలీ విలన్ పాత్రను పోషిస్తున్నారు. ఇతర వివరాల్ని త్వరలోనే ప్రకటించనున్నారు.

కొత్తగా..

చిన్న చిత్రాలే పరిశ్రమకు ప్రాణం

- మురళీమోహన్



శివ కంఠమనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. నిర్మాత ముప్పా వెంకయ్య చౌదరి నిర్మాణ సారథ్యంలో కేఎస్ శంకర్ రావు, ఆర్ వేంకటేశ్వర రావు నిర్మించారు. ఈ నెల 13న 'అమరావతికి ఆహ్వానం' విడుదలవుతోంది. ఈ సందర్భంగా నటుడు, నిర్మాత మురళీమోహన్ ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసి చిత్రబృందానికి బెస్ట్ విషెస్ తెలిపారు. చిన్న చిత్రాలే పరిశ్రమకు ప్రాణమని అన్నారు. వేంకటేశ్వర రావు మాట్లాడుతూ 'ఈ హారర్ థ్రిల్లర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వస్తుందనే నమ్మకం ఉంది. అందర్నీ ఆకట్టుకుంటుంది' అని చెప్పారు.

రీ రిలీజ్‌లతో నష్టం



ప్రస్తుతం నడుస్తున్న రీ రిలీజ్ ట్రెండ్ వల్ల చిన్న సినిమాలకు, నిర్మాతలకు తగిన గుర్తింపు లభించడం లేదు. చిన్న సినిమాలకు వారాంతపు వసూళ్లే కీలకం. పరిశ్రమ పెద్దలు ఈ విషయం ఆలోచించాలి' అని నిర్మాత కే హిమబిందు కోరారు. రాజేశ్ మేరు, నవ్య చిట్యాల జంటగా నటించిన 'లగ్గం టైం' చిత్రాన్ని హిమబిందు నిర్మించారు. ప్రజోత్ కే. వెన్నం దర్శకుడు. ఈనెల 6న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో కె. హిమబిందు మాట్లాడుతూ 'లగ్గం టైం' చిత్రం చూసిన ప్రేక్షకులు హాయిగా నవ్వుకుంటారు' అని అన్నారు. ఆరంభం నుంచి ముగింపు వరకూ ప్రేక్షకులను అలరించే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే చిత్రమిదని రాజేశ్ మేరు చెప్పారు.

అందర్నీ అలరిస్తుండడం సంతోషం



బెల్లం రామకృష్ణా రెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'దేవగుడి' ఇటీవలే విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో బెల్లం రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమా అందర్నీ అలరిస్తుండడం సంతోషాన్ని ఇస్తోంది. ఇది టీమ్ పడిన కష్టానికి ప్రతిఫలం. ఇందులోని కథనానికి, పాటలకు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు వస్తున్నాయి. ఇందులో జాతర సీక్వెన్స్‌కు విపరీతమైన ఆదరణ వస్తోంది. ఇంతటి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మంచి కంటెంట్ ఉంటే తప్పకుండా చిన్న సినిమా అయినా ఆదరిస్తారని మరోసారి నిరూపించారు అని అన్నారు. ఈ చిత్రంలో అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రల్లో నటించారు.

హీరోయిన్లు ప్రచారానికి రాలేదు



వెంకటేశ్ పెద్దపాళెం, అపర్ణ మల్లిక్, హీనా సోనీ ప్రధాన పాత్రధారులుగా బాహుబలి పళని కె తెరకెక్కించిన చిత్రం 'ఒన్ బై ఫోర్'. ఈ సినిమా ఇటీవలే విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో పళని కె మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని ప్రేక్షకులు బ్లాక్‌బస్టర్ చేసినందుకు సంతోషంగా ఉంది. ఈ చిత్రం ప్రమోషన్స్ కోసం హీరోయిన్లు సపోర్ట్ చేయకపోవడంతో మాకు నష్టం వచ్చింది' అని అన్నారు. రంజన రామ్‌దాస్ గుంజల్, రోహిత్ రామ్‌దాస్ ఈ చిత్రాన్ని నిర్మించారు.



'పిల్లా ఏఐ' యాప్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, పిల్లా ఏఐ వ్యవస్థాపకులు

చిన్న, మధ్యతరహా వ్యాపారుల కోసం 'పిల్లా ఏఐ'

▸▸ కొత్త యాప్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్యతరహా వ్యాపారుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'పిల్లా ఏఐ' యాప్ అందుబాటులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా రూపొందించిన ఈ వాయిస్ ఆధారిత బిల్లింగ్, అకౌంటింగ్ యాప్‌ను సీఎం చంద్రబాబు అమరావతి సచివాయలంలో సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ యాప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో పనిచేస్తుంది. ఎటువంటి అకౌంటింగ్ పరిజ్ఞానం లేకపోయినా.. వ్యాపారులు వాయిస్ కమాండ్ ద్వారా తమ రోజువారీ వ్యాపార వ్యవహారాలను సులభంగా చక్కబెట్టవచ్చని సీఎం తెలిపారు. తెలుగుతోపాటు ఐదు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్ ద్వారా బిల్లులు, ఇన్వాయిస్‌లు, బ్యాలెన్స్ షీట్, బ్యాంకు స్టేట్‌మెంట్లు సులువుగా రూపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, 'పిల్లా ఏఐ' వ్యవస్థాపకులు సురేశ్, రామ్మోహన్, సాయిప్రణీత్ పాల్గొన్నారు.

18, 19 తేదీల్లో విశాఖలో ఐఎఫ్ఆర్, మిలాన్

▸▸ హాజరుకానున్న రాష్ట్రపతి, రక్షణ మంత్రి, గవర్నర్, సీఎం తదితరులు

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 18న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్), 19న మిలాన్-2026 జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై సోమవారం అమరావతి సచివాలయంలో సీఎస్ విజయానంద్‌తో విశాఖ తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్, ఇతర నౌకాదళ అధికారులు సమావేశమయ్యారు. 'ఐఎఫ్ఆర్‌కు శ్రీలంక, ఇరాన్ తదితర 19 దేశాల నౌకలు, సుమారు 4 వేల మంది వరకూ ప్రతినిధులు హాజరవుతారు. అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలకు చెందిన మూడు నౌకలు 150 మంది వరకూ ప్రతినిధులు పాల్గొంటున్నారు. మన దేశానికి సంబంధించి 90 నౌకలు, 45 విమానాలు, సుమారు 600 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. 18న విశాఖ సముద్రతీరంలో ఐఎఫ్ఆర్, 19న సిటీ పరేడ్ ఉంటాయి. ఫ్లీట్ రివ్యూకు రాష్ట్రపతి, రక్షణ మంత్రి, రాష్ట్ర గవర్నర్, సీఎం హాజరవుతారు' అని వివరించారు.

అమరావతిలో 'ఏఐ లివింగ్ ల్యాబ్స్' వర్సిటీ

▸▸ రాష్ట్ర ఐటీ శాఖ ప్రతిపాదనలు.. నేడు క్యాబినెట్ ఆమోదం!

అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మరో ప్రతిష్టాత్మక కృత్రిమ మేధ యూనివర్సిటీ రానుంది. 'ఏఐ లివింగ్ ల్యాబ్స్' పేరిట ఈ వర్సిటీని ఏర్పాటు చేసేందుకు సంబంధించి ఐటీ శాఖ ప్రతిపాదనను మంగళవారం జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. యూనివర్సిటీల్లో సాధారణంగా యూజీ విద్య మొదలుకొని ఆపై కోర్సులు ఉంటాయి. కానీ, ఏఐ లివింగ్ ల్యాబ్స్ వర్సిటీలో పాఠశాల విద్యార్థుల నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో విద్యా బోధన అందిస్తారు. ఇప్పటికే అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ రానున్న నేపథ్యంలో.. ఏఐ లివింగ్ ల్యాబ్స్ అనుబంధంగా వ్యవహరిస్తుందని ప్రభుత్వ అధికారులు పేర్కొంటున్నారు. కాగా.. ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ మంగళవారం హైదరాబాద్‌లో దాదాపు డజను ప్రముఖ ఐటీ కంపెనీలతో సమావేశం కానున్నారు.

నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండలి సమావేశం మంగళవారం ఉదయం 10.30కు జరగనుంది. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యిపై సిట్ వేసిన చార్జిషీటులోని అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది.

మత మార్పిళ్లతో హిందూ ధర్మానికి నష్టం

▸▸ రెడ్డి సామాజికవర్గ సమావేశంలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

తిరుపతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోకుంటే.. భారత్ మరో ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌గా మారిపోయే ప్రమాదం ఉందని వైసీపీ మాజీ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. భక్త మల్లారెడ్డి గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతిలో నిర్వహించిన హిందూ ధర్మ పరిరక్షణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రెడ్డి అనుబంధ సామాజిక వర్గీయులు పాల్గొన్న ఈ సమావేశంలో విజయసాయిరెడ్డి మాట్లాడుతూ మత మార్పిడులను వ్యతిరేకిద్దామని పిలుపునిచ్చారు. మత మార్పిళ్లతో హిందూ ధర్మానికి నష్టమని హెచ్చరించారు. 'హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రెడ్డి సామాజిక వర్గంపై ఉంది. మత మార్పిడిలను నిలువరించి, హిందూ ధర్మాన్ని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిలోనూ ఉంది. నా వంతుగా అందరితో కలసి అడుగులు వేస్తాను. ఎల్లవేళలా హిందూ ధర్మాన్ని కాపాడేందుకు కష్టపడతానని దేవదేవుడు శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తూ చెబుతున్నాను' అని అన్నారు.

టీడీపీ ఎంపీలకు స్పీకర్ ఓం బిర్లా తేనీటి విందు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఎంపీలకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తేనీటి విందును ఇచ్చారు. సోమవారం లోక్‌సభ వాయిదా పడినంతరం స్పీకర్ కార్యాలయంలో ఆయనతో టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో ఎంపీలు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలన చర్చకు వచ్చింది.

రాష్ట్రాన్ని రావణ కాష్ఠంలా మార్చొద్దు: సీపీఐ

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పరస్పర దాడులతో రాష్ట్రాన్ని రావణ కాష్ఠంలా మార్చొద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య టీడీపీ, వైసీపీలకు హితవు పలికారు.'రాష్ట్రంలో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు ఆ రెండు పార్టీల నేతలు పరస్పర దూషణలకు దిగి, దాడులకు తెగబడుతున్నారు. రాష్ట్రం ప్రజల ఆస్తి. చంద్రబాబు, జగన్, పవన్, లోకేశ్‌ల సొత్తు కాదు. వైసీపీ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేశ్‌లు హుందాతనాన్ని కోల్పోయి అనుచిత వ్యాఖ్యలు చేయడం.. టీడీపీ శ్రేణులు సంయమనం కోల్పోవడం శోచనీయం. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం దుర్మార్గం' అని సోమవారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు.

'గీతం'కు భూ క్రమబద్ధీకరణపై హైకోర్టులో పిటిషన్

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని గీతం విశ్వవిద్యాలయానికి 54.79 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని అడ్డుకోవాలంటూ విశాఖకు చెందిన న్యాయవాది నిమ్మి గ్రేస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ వద్ద విచారణకు రానుంది.


రాష్ట్రానికి 6,372 కోట్ల సాస్కీ నిధులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఏపీకి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి 27 వరకు రూ.6,372.40 కోట్ల సాస్కీ(మూలధన పెట్టుబడి కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సాయం) నిధులను కేంద్రం విడుదల చేసింది. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ఈ మేరకు సోమవారం లిఖితపూర్వక సమాధానమిచ్చారు. తెలంగాణకు వరుసగా మూడేళ్లలో రూ.6,500 కోట్లు విడుదల చేశామన్నారు.

ఇద్దరు పశువైద్యులకు జాతీయ అవార్డులు

అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత సేవలు అందించిన ఇద్దరు పశువైద్య అధికారులకు జాతీయ స్థాయి అవార్డులు దక్కాయి. ఒంగోలు వెటర్నరీ పాలి క్లినిక్ డిప్యూటీ డైరెక్టర్ నల్లపాటి జగత్ శ్రీనివాస్, విశాఖపట్నంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న మాదిన ప్రసాదరావుకు 'డాక్టర్ సీఎం సింగ్ సుశ్రుత గౌరవ్ రత్న సమ్మాన్-2025' అవార్డులు లభించాయి. సోమవారం విజయవాడలో వెటర్నరీ డైరెక్టర్ దామోదర్‌నాయుడు ఇద్దరికీ అవార్డుల సర్టిఫికెట్లను అందించి ఘనంగా సన్మానించారు.

మనం చెప్పే మంచి ప్రజల్లోకి వెళ్లే లోపు వైసీపీ నాయకులు జనాల్లో భయం సృష్టిస్తున్నారు. మళ్లీ మేమొస్తే అంటూ రకరకాలుగా బెదిరిస్తున్నారు. గతంలో ఇలాంటి కామెంట్లు చేసే ఆ పార్టీ 151 నుంచి 11 స్థానాలకు పడిపోయింది. అయినా వాళ్ల ప్రవర్తనలో మార్పు రాలేదు.
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



జనసేన జనరల్ బాడీ సమావేశంలో పార్టీ నేతలతో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

అది నెయ్యే కాదు!

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాసులకు కక్కుర్తిపడి వైసీపీ నాయకులు తిరుమలలో అపచారం చేశారని విమర్శించారు. 'నిబంధనలు అడ్డగోలుగా మార్చేసి టన్నుల కొద్ది కల్తీ నెయ్యి కొనుగోలు చేసి ప్రసాదాల్లో కలిపేశారు. రూ.400కి కిలో నాణ్యమైన నువ్వుల నూనె కూడా దొరకదు. అలాంటిది నెయ్యి ఎక్కడ నుంచి దొరుకుతుంది? అధికారంలో ఉన్నప్పుడు చేయాల్సిందంతా చేసి ఇప్పుడు బొంకులు మాట్లాడుతున్నారు. వైసీపీ చేసిన అపచారాలను ప్రజల్లోకి మనం బలంగా తీసుకెళ్లాలి' అని నిర్దేశించారు. వైసీపీ నేతలంటే తనకు వ్యక్తిగత ద్వేషం, వైరం లేదని స్పష్టం చేశారు. 'వాళ్ల భాష, క్రిమినాలిటీతోనే సమస్య. ఇళ్లలోకి వస్తాం.. దాడులు చేస్తాం.. నరికేస్తామంటూ నోటికొచ్చినట్లు మాట్లాడతారు. వాళ్ల భాష సరిగా లేని కారణంగానే ఈ రోజు దాడులు జరుగుతున్నాయి. దాడులను, హింసను ఏ రాజకీయ పార్టీ సమర్థించదు. సీఎం చంద్రబాబు కూడా చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని పదేపదే చెబుతున్నారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం. మరో 15 ఏళ్లు కూటమి అధికారానికి ఢోకా లేదు. ప్రజలు చాలా తెలివైనోళ్లు, బాగా ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు' అని స్పష్టం చేశారు. జనసేన ఒక కులానికో, కుటుంబానికో చెందిన పార్టీ కాదన్నారు. ఒక కులం మీద ఆధారపడి పుట్టిన పార్టీలు ఎక్కువ కాలం నిలబడవని చెప్పారు. సంస్థాగతంగా పార్టీ బలోపేతానికి 32 మందితో క్రమశిక్షణ కమిటీని నియమిస్తున్నట్లు ప్రకటించారు. పార్లమెంటులో మహిళలకు 33శాతం కోటా కల్పిస్తూ చట్టం చేశారని, మన పార్టీలోనూ మహిళల నాయకత్వం పెరగాలని సూచించారు.

రెండు తీర్మానాలకు ఆమోదం..

వైసీపీ హయాంలో సింథటిక్ నెయ్యి తయారు చేసి, లడ్డూ ప్రసాదానికి సరఫరా చేసిన మహాపచారంపై శాసనసభలో చర్చించాలని.. సిట్ నివేదికలోని వాస్తవాలు తెలియజెప్పే కార్యక్రమాన్ని జనసేన పక్షాన చేపట్టాలని జనరల్‌బాడీ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టారు. భారత భవిష్యత్ శక్తిని ఆవిష్కరించే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు, ప్రధాని మోదీకి అభినందనలు తెలియజేస్తూ మరో తీర్మానం ప్రవేశపెట్టారు. వాటిని ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడారు. వైసీపీ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టేలా ప్రజలకు వివరిస్తామన్నారు. పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీని పునర్వ్యవస్థీకరిస్తున్నామని చెప్పా రు. మార్చి 14న జనసేన ఆవిర్భావ దినోత్సవం నాటికి సభ్యత్వనమోదు పూర్తి చేస్తామన్నారు. అరవ శ్రీధర్ వ్యవహారంపైనా చర్చించామని, కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని చెప్పారు.

అన్నిటిపైనా నేనే మాట్లాడాలా..?

▸▸ కల్తీ నెయ్యిపై రాద్ధాంతం జరుగుతుంటే మనోళ్లు మాట్లాడరేం?: జనసేనాని

పదవులిచ్చింది అనుభవించడానికి కాదు.. పని చేయడానికని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తేల్చిచెప్పారు. లడ్డూ వ్యవహారంపై ఇంత రాద్ధాంతం జరుగుతున్నా పార్టీ నేతలెవరూ మాట్లాడడం లేదని ఆక్షేపించారు. వైసీపీ దుష్ప్రచారాలను ఎందుకు తిప్పికొట్టడం లేదని నిలదీశారు. 'ప్రతి అంశంపై నేనే మాట్లాడితే ఎమ్మెల్యేలు, ఎంపీలు, పీఏసీ సభ్యులు ఎందుకు' అని ప్రశ్నించారు. వైసీపీ ట్రాప్‌లో పడొద్దని జనరల్ బాడీ సమావేశంలో స్పష్టం చేశారు. జనసేన.. చాలా మంది రక్తం చిందించి.. వారు తిన్న దెబ్బలపై నిలిచిన పార్టీ అని.. వారి త్యాగాలను మనం గుర్తుంచుకోవాలని సూచించారు. కొందరు నేతల పేర్లు ప్రస్తావించి మరీ క్లాస్ తీసుకున్నారు. పరోక్షంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ.. ప్రతిఒక్కరూ తమ వ్యక్తిగత వ్యవహారాలపై జాగ్రత్తగా ఉండాలని, వారి వల్ల పార్టీకి నష్టం కలిగిస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. 'ఎవరు ఏం చేస్తున్నారో నేనొచ్చి చూడను కదా! ఎవరి వ్యక్తిగత జీవితం వారిది. దానిని పార్టీకి ఆపాదించడం కరెక్టు కాదు. నాయకులు ఏదైనా తప్పు చేస్తే పార్టీపరంగా విచారణ చేస్తాం. తప్పుందని తేలితే యాక్షన్ తీసుకుంటాం. ఇలాంటి విషయాల్లో పార్టీకి చెడ్డ పేరు రాకుండా చూడాల్సిన బాధ్యత మీదే' అని చెప్పారు. జనసేన నాయకులు కూటమి ధర్మాన్ని పాటించాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కూటమి సమావేశాల్లో పాల్గొనాలన్నారు. టీడీపీ నాయకులు సమావేశాలకు పిలిస్తే వెళ్లి, అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవాలని.. కానీ ఆ పార్టీ నాయకుల వ్యక్తిగత సమావేశాల్లో పాల్గొనవద్దని.. దూరంగా ఉండాలని సూచించారు. మనం కేవలం పొత్తులోనే ఉన్నామన్నది గుర్తుంచుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ జోక్యం చేసుకుని.. ఆయా పార్టీల సోషల్ మీడియా టీమ్ బలంగా ఉందని చెప్పారు. పవన్ స్పందిస్తూ.. సోషల్ మీడియా పరంగా మనం కూడా బలంగానే ఉన్నామని.. మీరు గట్టిగా మాట్లాడితే అదే ప్రచారంలోకి వస్తుందని తెలిపారు.

అలాగైతే ఎమ్మెల్యేలు, ఎంపీలు, పీఏసీ సభ్యులు ఎందుకు: పవన్

'సోషల్ మీడియా గెలుపోటములను నిర్ణయించదు. మన పార్టీపై వచ్చిన నెగిటివ్ న్యూస్‌ను మనమే వైరల్ చేయడం వల్ల దానికి బలం చేకూరుతోంది. మనం ఆ పద్ధతి మార్చుకోవాలి' అని సూచించారు.

నాగబాబుపైనా సీరియస్

కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, తన అన్న, ఎమ్మెల్సీ నాగబాబుపై పవన్ కొంత సీరియస్ వ్యాఖ్యలు చేశారు. కాకినాడ ఎంపీని ఉద్దేశించి.. 'మీకు లండన్ టూర్లకు వెళ్లేందుకు సమయం ఉంది.. కానీ పవిత్రమైన తిరుపతి లడ్డూ అంశంపై మాట్లాడడానికి టైమ్ లేదా' అని నిలదీశారు. అమ్మాయిల వస్త్రధారణపై మాట్లాడడం, సోషల్ మీడియాలో స్పందిస్తున్న నాగబాబు.. తిరుమల లడ్డూ వ్యవహారంపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. 'సోషల్ మీడియాలో, బహిరంగంగా పార్టీ గురించి, నా గురించి అనేక ఆరోపణలు చేస్తున్నారు. కానీ ఎవరూ వీటిని సీరియస్‌గా తీసుకోవడం లేదు, కౌంటర్ చేయడం లేదు. ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలి' అని స్పష్టంచేశారు.

ఉద్యోగిని ఏకపక్షంగా తొలగించడం చట్టవిరుద్ధం

▸▸ ఇంటర్ బోర్డుకు హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ఉద్యోగిని ఏకపక్షంగా తొలగించడం చట్ట విరుద్ధమని హైకోర్టు ధర్మాసనం ప్రకటించింది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ఆ ఉద్యోగి వివరణ తీసుకోకుండా సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీ చేసిన ఉత్తర్వులు చెల్లుబాటుకావని స్పష్టం చేసింది. ఓ కాలేజీలో పనిచేస్తున్న ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, ఓ వాచ్‌మెన్‌ను తొలగిస్తూ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ 2005, ఫిబ్రవరిలో జారీచేసిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సమర్థించింది. సింగిల్ జడ్జి తీర్పులో జోక్యానికి నిరాకరించింది. సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా, ఆకివీడు మండలం, దుంపగడప గ్రామంలోని ఏకేపీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేవీఆర్ శ్రీనివాసు, జి. శ్రీనివాసాచార్యులు రికార్డు అసిస్టెంట్లుగా, ఐ. నాగరాజు నైట్ వాచ్‌మెన్‌గా చేస్తున్నారు. వీరిని ఉద్యోగాల నుండి తొలగిస్తూ 2005, ఫిబ్రవరి 7న ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ప్రొసీడింగ్స్ ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ 2005లో వీరు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. ఆ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేశారు. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ ఇంటర్మీడియట్ కమిషనర్, విద్యాశాఖ కార్యదర్శి ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. విచారణ జరిపిన ధర్మాసనం ఇంటర్‌మీడియట్ బోర్డు అధికారుల వైఖరిని తప్పుబట్టింది.

స్పష్టత ఇచ్చేనా.. ఫలితాలు వచ్చేనా?

▸▸ డీఎల్ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిలో తీవ్ర జాప్యం

▸▸ 15 వేల మంది అభ్యర్థుల ఎదురుచూపులు

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): డిగ్రీ లెక్చరర్ (డీఎల్) పోస్టుల నోటిఫికేషన్ విడుదలై రెండేళ్లు దాటింది! అభ్యర్థులు పరీక్షలు రాసి 7 నెలలు గడిచింది!! అయినా ఫలితాలు ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి. కళాశాల విద్యాశాఖను రోస్టర్‌పై చిన్న స్పష్టత కావాలని ఏపీపీఎస్సీ కోరగా... మూడు నెలలైనా స్పందన లేదు. కళాశాల విద్యాశాఖ వివరణ ఇచ్చాకే ఫలితాలు ఇవ్వగలమని కమిషన్ అంటోంది. దీంతో తాము ఎవరికి విన్నవించుకోవాలో కూడా అర్థం కాని పరిస్థితి నెలకొందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2023 డిసెంబరులో 290 పోస్టులతో డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. 15,380 మంది పరీక్షలు రాశారు. 2025 జూలైలో రాత పరీక్షలు పూర్తయ్యాయి. ఆ సమయంలోనే జూనియర్ లెక్చరర్, పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టుల భర్తీకి పరీక్షలు జరగ్గా.. వాటి ఫలితాలు విడుదలయ్యాయి. రోస్టర్‌పై స్పష్టత రావాలంటూ ఏపీపీఎస్సీ డీఎల్ పోస్టుల ఫలితాలను నిలిపివేసింది. కళాశాల విద్యాశాఖ నిర్వాకం వల్ల డిగ్రీ కాలేజీల్లోనూ బోధన కుంటుపడుతోందన్న విమర్శలు వస్తున్నాయి. నోటిఫికేషన్‌లో కామర్స్ 40, కంప్యూటర్ అప్లికేషన్స్ 49, కంప్యూటర్ సైన్స్ 48, గణితం 25, కెమిస్ట్రీ 23, బోటనీ 20, జువాలజీ 20 పోస్టుల ఖాళీలు భర్తీ అవుతాయి. త్వరగా ఫలితాలు ఇస్తే కాలేజీల్లో బోధనా సిబ్బంది కొరత తీరుతుంది.

వైసీపీ బాటలో వెళ్లొద్దు

▸▸ రాష్ట్రంలో అలజడులకు వైసీపీ కుట్రలు

▸▸ అందులో భాగమే బూతు పురాణం

▸▸ కవ్వింపు చర్యల పట్ల అప్రమత్తంగా ఉండండి

▸▸ చంద్రబాబు ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పమన్నారు

▸▸ పార్టీ నేతలతో పల్లా, అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్

▸▸ జుగుప్సాకర బూతులు తిట్టడంపై ఆవేదన ఉన్నా చట్టప్రకారం వెళ్లడమే సరైన మార్గమని విజ్ఞప్తి

చట్టాన్ని గౌరవించి, సంయమనం పాటించండి



అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో చట్టాలను కాలరాస్తూ, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అరాచక పాలన సాగించారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇప్పుడు మనమూ అదే బాటలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైన చర్య కాదని, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఈ విషయాన్ని పార్టీ నేతలందరికీ స్పష్టంగా చెప్పాలని ఆదేశించారని తెలిపారు. గత కొన్ని రోజులుగా టీడీపీ శ్రేణులు వ్యవహరిస్తున్న తీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారని పల్లా అన్నారు. సోమవారం పార్టీ నేతలతో పల్లా శ్రీనివాసరావు, సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అంతకుముందు పల్లా, అచ్చెన్నాయుడుతో ముఖ్యమంత్రి చంద్రబాబు టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చంద్రబాబు చెప్పిన విషయాలను వారిద్దరూ పార్టీ నేతలకు వివరించారు. పార్టీ నేతలతో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాష్ట్రం ప్రశాంతంగా ఉండటం వైసీపీ వారికి ఇష్టం లేదని, ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని వైసీపీ ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. అందులో భాగంగానే ఆ పార్టీ నేతలు బూతుపురాణం ఎత్తుకున్నారని, వైసీపీ వారి కవ్వింపు చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చంద్రబాబు ఈ విషయాన్ని స్పష్టంగా పార్టీ నేతలకు చెప్పాలని ఆదేశించారని తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా వైసీపీని ఛీదరించుకుంటున్నారని, డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే వైసీపీ నేతలు బూతులు మాట్లాడుతున్నారని వివరించారు. గత 20 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని, భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, దీన్ని వైసీపీ వారు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సమస్యను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న కథనాలతో ఆవేశాలకు లోను కావద్దని సూచించారు. టీడీపీకి స్పష్టమైన నిబద్ధత, ప్రజాస్వామ్య విలువలు ఉన్నాయని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు చట్టాన్ని గౌరవించే వారిగా సమాజంలో మంచి గుర్తింపు సంపాదించుకున్నారని, అదే మన పార్టీకి బలమైన బ్రాండ్ ఇమేజ్ అని పల్లా వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత కేటాయింపులు చేశారని, వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ఆ ఉచ్చులో పడొద్దు

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో గతంలో ఎన్నడూ చూడని పాలనను చూశామని, ఆ సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. టీడీపీని రాజకీయంగా అంతమొందించాలనే ఉద్దేశంతో కుట్రలు చేశారని, చంద్రబాబును జైలుకు పంపారని, అయినా పార్టీ శ్రేణులు ఎక్కడా వెనక్కి తగ్గలేదని అన్నారు. ఎట్టకేలకు విధ్వంస పాలన ముగిసి కూటమి అధికారంలోకి వచ్చిందని, గాడి తప్పిన రాష్ట్రాన్ని 20 నెలల్లోనే గాడిలో పెట్టామని తెలిపారు. స్కిల్ కేసులో చంద్రబాబుకు ఈడీ కూడా క్లీన్ చిట్ ఇచ్చిందని అన్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న సంఘటనలపై బాధ ఉన్నా, ప్రతి చర్య పేరుతో హింసకు దిగడం సరైనది కాదని అన్నారు. వైసీపీ నాయకులు వాడుతున్న భాష ప్రజలకు అసహ్యం కలిగిస్తోందని అన్నారు. సీనియర్ నాయకుడిని జుగుప్సాకరమైన బూతులతో తిట్టడంపై కార్యకర్తల్లో ఆవేదన ఉన్నా, చట్టప్రకారం చర్యలు తీసుకోవడమే సరైన మార్గమని తెలిపారు. దాడులు, హింస టీడీపీ సంస్కృతి కాదని, ప్రజాస్వామ్య విలువలతోనే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంలో అడ్డంగా దొరికిపోవడంతో దారి మళ్లించేందుకే వైసీపీ ఇలాంటి నీచమైన కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ ఉచ్చులో పడకుండా ప్రతి ఒక్కరూ ఓపికతో వ్యవహరించాలని, రాష్ట్రానికి నష్టం కలగకుండా జాగ్రత్త పడాలని కోరారు.

'స్త్రీ శక్తి' సేవల్లో రాజీపడొద్దు

▸▸ బస్టాండ్లలో మరుగుదొడ్లు శుభ్రపడాలి: ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ

▸▸ రాష్ట్రానికి ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయ్

▸▸ సమన్వయంతో చార్జింగ్ స్టేషన్లు, విద్యుత్ సరఫరా, వసతులు: కృష్ణబాబు

అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్లలో మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని.. ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం సరిగా లేదని ముఖ్యమంత్రి తరచూ నిర్వహించే ఐవీఆర్ఎస్ సమీక్షలో తేలింది.. రాష్ట్రంలోని అన్ని బస్టాండ్లలో ఈ సమస్యపై సమీక్షించి తక్షణమే పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీగా బాధ్యతలు చేపట్టిన ఎంటీ కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం 'స్త్రీ శక్తి' పథకాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, రాష్ట్రంలోని మహిళలకు ఉచిత ప్రయాణ సేవలు మెరుగ్గా అందించాల్సిన బాధ్యత ఆర్టీసీపై ఉందని చెప్పారు. సోమవారం విజయవాడలోని ఎన్టీఆర్ పరిపాలనా భవనంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం.. ఈడీలు కేఎస్ బ్రహ్మానందరెడ్డి, రవివర్మ, అప్పలరాజు, ప్రాంతీయ మేనేజర్లతో సంస్థ స్థితిగతులు, ప్రయాణ సేవలపై ఆయన సమీక్ష జరిపారు. స్త్రీ శక్తి అమల్లోకి వచ్చాక ఆర్టీసీ ఆక్యుపెన్సీ 90శాతానికి పెరగడంపై కృష్ణబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టేందుకు మార్గం సుగమమైందని, 'పీఎం ఈ-బస్ పథకంలో భాగంగా 1,050 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని.. మరో 1,450 విద్యుత్, సీఎన్‌జీ బస్సులను రాబోయే రోజుల్లో ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమైనట్లు వెల్లడించారు. వాటి సజావు నిర్వహణకు చార్జింగ్ స్టేషన్లు, విద్యుత్ సరఫరా వనరులు, మౌలిక వసతులన్నింటినీ సమన్వయంతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. సంస్థ ఆదాయాన్ని పెంచుకోవడానికి కార్గో సేవలతో పాటు బస్టాండ్లలోని స్థలాలను వాణిజ్యపరంగా వినియోగంలోకి తెచ్చుకోవడానికి గల అవకాశాలపై కసరత్తు చేయాలని సూచించారు. ఉద్యోగులు, సిబ్బంది సమస్యలపైనా చర్చించారు.

'పప్పుధాన్యాల'పై స్టీరింగ్ కమిటీలు

అమరావతి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): పప్పు ధాన్యాల సాగులో ఆత్మనిర్భరత కోసం ఉద్దేశించిన మిషన్ కార్యకలాపాలను పర్యవేక్షించడానికి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రభుత్వం స్టీరింగ్ కమిటీలను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన రాష్ట్ర పప్పు ధాన్యాల స్టీరింగ్ కమిటీ, కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్టీరింగ్ కమిటీలను నియమించింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల సమన్వయంతో ఆత్మనిర్భరత మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర వాటాలతో కార్యాచరణ ప్రణాళికలు తయారు చేసి, అమలు చేయడం, అపరాల పంటల సాగు, ఉత్పత్తి, ఉత్పాదకత, మార్కెటింగ్ తదితర అంశాలపై అధ్యయనం చేయడం వంటి బాధ్యతలు ఈ స్టీరింగ్ కమిటీలకు అప్పగించింది. ఆయిల్‌పామ్ ఉప ఉత్పత్తులపై అధ్యయనానికి ఉద్యానశాఖ డైరెక్టర్ అధ్యక్షతన ప్రభుత్వం రాష్ట్ర కమిటీ నియమించింది.

స్మార్ట్ మీటర్లను సరి చేయండి: ఈఆర్‌సీ

▸▸ రీడింగ్ లోపాలు సరిదిద్ది.. బిల్లులు సర్దుబాటు చేయాలని ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లతో విద్యుత్తు బిల్లులు భారీగా వస్తున్నా యన్న ఆరోపణలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) స్పందించింది. స్మార్ట్ మీటర్ల వల్ల ఎక్కువ మొత్తంలో బిల్లులు చెల్లించిన వారికి ఆ మొత్తాలను తదుపరి బిల్లుల్లో సర్దుబాటు చేయాలని డిస్కంలను ఆదేశించింది. ఇళ్లలో ఫ్యాను తిరగడం, లైటు వెలగడం కారణంగా విద్యుత్తు ఖర్చవుతుంది. దీన్ని 'యాక్టివ్ పవర్' అంటారు. నెలవారీగా ఉపయోగించిన విద్యుత్తును ఇన్ని యూనిట్లు అని లెక్కిస్తుంటారు. ఫ్యాను, లైటు వాడకపోయినా ఇంటిలో విద్యుత్తు సరఫరాలో వోల్టేజీని నియంత్రణలో ఉంచడానికి కొంత విద్యుత్తు ఖర్చవుతుంది. దీన్నే లీడింగ్ కేవీఏఆర్‌హెచ్(కిలోవాట్ యాంపియర్ రియాక్టివ్ హవర్) అంటారు. పాత మీటర్లలో యూనిట్లను మాత్రమే లెక్కించి, లీడింగ్ కేవీఏఆర్‌హెచ్‌ను లెక్కకట్టే వీలు లేకుండా ఏర్పాటు ఉండేది. స్మార్ట్ మీటర్లలో ఆ సౌకర్యం లేకపోవడంతో మనం విద్యుత్తును ఉపయోగించకపోయినా అధిక బిల్లులు రావడం, గతంలో కన్నా ఎక్కువ బిల్లులు రావడం జరిగేది. దీనిపై ఫిర్యాదులు ఎక్కువ కావడంతో.. స్మార్ట్ మీటర్లలో లీడింగ్ కేవీఏఆర్‌హెచ్‌ను లెక్కించవద్దని, ఈమేరకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశిస్తూ సోమవారం ఈఆర్‌సీ ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో వినియోగదారులు ఇప్పటి వరకు అదనపు రీడింగ్ వల్ల చెల్లించిన అధిక మొత్తాలను సర్దుబాటు చేయాలని ఆదేశించింది.

ఉన్నత విద్యలో మళ్లీ 'ఫీజుల కమిటీ'!

కీలక మార్పులకు ప్రభుత్వం చర్యలు

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖలో కీలక మార్పులు జరగనున్నాయి. 'ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్'ను 'ఫీజుల నియంత్రణ కమిటీ'గా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. త్వరలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుత విధానంలో ఉన్నత విద్య కోర్సుల ఫీజుల ఖరారు, అనంతరం కాలేజీల్లో సౌకర్యాలపై పర్యవేక్షణ అధికారాలు కమిషన్‌కు ఉన్నాయి. ఇందులో కొన్ని లోపాలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఫీజుల ఖరారు సమయంలో కమిషన్‌కు ఉన్న విస్తృత అధికారాల దృష్ట్యా ప్రభుత్వ పాత్ర పరిమితంగా మారింది. దీనిని కాలేజీ యాజమాన్యాలు తొలి నుంచీ వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. అసలు ఈ కమిషన్‌కు ఫీజుల ఖరారు అధికారమే లేదంటూ కొన్ని యాజమాన్యాలు హైకోర్టులో చాలెంజ్ చేశాయి. అలాగే, ఫీజుల ఖరారు సమయంలో కమిషన్ పెడుతున్న నిబంధనలు తలనొప్పిగా మారాయంటూ వాదిస్తున్నాయి. మరోవైపు ఫీజులు ఖరారు చేసేటప్పుడు ప్రభుత్వం ఏవైనా మార్పులు చేయాలంటే.. తిరిగి కమిషన్‌కు పంపడం తప్ప మరో మార్గం లేదు. అప్పుడు కూడా కమిషన్ మారిస్తేనే ఫీజుల్లో మార్పులు వస్తాయి. దీనిపై అన్నివైపుల నుంచి వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో కమిషన్ అధికారాలను కొంతమేర పరిమితం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ చర్యల ఫలితంగా పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. తెలంగాణతో సహా అనేక రాష్ట్రాల్లో 'అడ్మిషన్లు, ఫీజుల నియంత్రణ కమిటీ'లే ఉన్నాయి. గతంలో ఏపీలోనూ ఏఎఫ్ఆర్‌సీనే ఉంది. వైసీపీ ప్రభుత్వం ఏఎఫ్ఆర్‌సీని 'ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్'గా మార్చింది. ఈ కమిషన్ అన్నిరకాల ఉన్నత విద్య కోర్సులకు ప్రతి మూడేళ్లకు ఒకసారి ఫీజులు ఖరారు చేస్తుంది. ఫీజుల ఖరారుకు కొన్ని ప్రామాణికాలను నిర్దేశిస్తుంది. అయితే ఈ కమిషన్‌కు ఫీజులు ఖరారు చేసే అధికారమే లేదనేది కాలేజీ యాజమాన్యాల వాదన.

ఏజెన్సీలో డ్రోన్ల శకం!

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలోని ముంచంగిపుట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. ఇటీవల అక్కడకు ఓ డ్రోన్ వచ్చి వాలింది. సిబ్బంది వెంటనే తాము సేకరించిన రక్త నమూనాలను అందించగానే రివ్వున ఎగిరిపోయింది. మర్నాడు సరిగ్గా అదే సమయానికి ఆ డ్రోన్ మరోసారి వచ్చింది. ఈసారి తనవెంట రక్త నమూనాల రిపోర్టులతో పాటు ఆ పీహెచ్‌సీకి అవసరమైన మందులను కూడా మోసుకొచ్చింది.





చింతపల్లి మండలం తాజంగి పీహెచ్‌సీ ఆవరణలో వాలిన డ్రోన్, చిన్నపాటి విమానాన్ని పోలిన డ్రోన్

- కొండలు దాటుతూ.. మందులు అందిస్తూ...
- గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలకు వినియోగం
- పాడేరు నుంచి పీహెచ్‌సీలకు ఔషధాల సరఫరా
- వ్యాధి నిర్ధారణ కోసం రక్త నమూనాల సేకరణకూ
- భవిష్యత్తులో కేజీహెచ్‌కు అనుసంధానించే ఆలోచన

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీలో డ్రోన్ల శకం ప్రారంభమైంది. గిరిజన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. కొండలు, కోనలతో విభిన్న భౌగోళిక పరిస్థితులు కలిగిన అల్లూరి సీతారామరాజు జిల్లాలో వీటిని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. పాడేరు నుంచి వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు డ్రోన్ ద్వారా మందుల పంపిణీని 2 నెలల నుంచి ప్రయోగాత్మకంగా చేపట్టారు. భవిష్యత్తులో దీన్ని కేజీహెచ్‌కు అనుసంధానం చేసే అవకాశాలను పరిశీలిస్తున్నారు. దీనివల్ల గిరిజన ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ డి.హేమలతాదేవి పేర్కొన్నారు.

ఆధునిక సాంకేతికతతో...

ఏజెన్సీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు జిల్లా కేంద్రానికి దూరంగా ఉంటాయి. రహదారుల సదుపాయం కూడా లేని ప్రాంతాలు అనేకం ఉన్నాయి. దీంతో మందులు అందుబాటులో లేకపోవడం, వ్యాధి నిర్ధారణ పరీక్షల ఫలితాల్లో జాప్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. ఈ క్రమంలో టెక్నాలజీ సాయంతో గిరిజనులకు వేగంగా సేవలందించడానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగానే పాడేరులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులు పంపడంతో పాటు వ్యాధి నిర్ధారణకు సంబంధించిన నమూనాల రవాణా, ఫలితాలు అందజేత తదితరాలకు డ్రోన్‌లను వినియోగించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం 3 కిలోల బరువు మోసుకుంటూ 45నిమిషాల్లో 80 కి.మీ. ప్రయాణించే సామర్థ్యమున్న ఒక డ్రోన్‌ను వినియోగిస్తున్నారు. ముంచంగిపుట్టు, అరకులోయ మండలం సుంకరమెట్ట, చింతపల్లి మండలం తాజంగి పీహెచ్‌సీలకు పాడేరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నుంచి మందులు పంపించారు. మన్యంలో వైద్య రంగానికి డ్రోన్ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని వైద్య నిపుణులు, స్థానికులు పేర్కొంటున్నారు. అయితే విశాఖపట్నం పరిధిలో రక్షణ రంగ సంస్థలు ఉన్నందున, భారీ డ్రోన్ వినియోగానికి కేంద్రం అనుమతి ఇవ్వాల్సి ఉంది.

జగన్‌రెడ్డి డైరెక్షన్‌లోనే విమర్శలు

- వంగవీటికి, రాంబాబుకు పోలికే లేదు: మంత్రి కొల్లు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్ డైరెక్షన్‌లోనే అంబటి రాంబాబు, జోగి రమేశ్, పేర్ని నాని పరుష పదజాలం తో టీడీపీ నాయకులను తిడుతున్నారు.' అని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. 'సీఎం చంద్రబాబును సైతం ఇష్టారాజ్యంగా దుర్భాషలాడిన అంబటి రాంబాబును రెండో వంగవీటి రంగాగా పోల్చడం విడ్డూరంగా ఉంది. వంగవీటి రంగాకు, అంబటి రాంబాబుకు ఏవిధమైన పోలికా లేదు. పందికొక్కులా పేదల బియ్యాన్ని బొక్కేసిన పేర్ని నాని నీతులు వల్లిస్తున్నాడు. కల్తీ మద్యంతో వేలాది ప్రజల ప్రాణాలు తీసిన జోగి రమేశ్ తాను బీసీనని చెప్పుకోవడం సిగ్గుచేటు' అని మంత్రి కొల్లు అన్నారు.

కాపులపై దాడి చేసిన చరిత్ర వైసీపీదే: కలిశెట్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కాపుల మీద దాడులు జరుగుతున్నాయని వైసీపీ నేతలు చెప్పే మాటలు చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. సోమవారం ఢిల్లీలో ఆయన మాట్లాడారు. 'కాపులు, బీసీల మీద దాడిచేసిన ఘన చరిత్ర వైసీపీదే. ముద్రగడ పద్మనాభం తన గౌరవాన్ని మరింతగా దిగజార్చుకోవద్దని కోరుతున్నా. ముద్రగడ పద్మనాభం కాపు జాతి కోసం ఉన్నారా? జగన్ కోసం ఉన్నారా? ఆలోచించుకోవాలి.' అని కలిశెట్టి అన్నారు.

పద్మనాభరెడ్డికి ఆ అర్హత లేదు... : నిమ్మల

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'కాపుల అభివృద్ధి, సామాజిక గౌరవం, రాజకీయ భవిష్యత్తు అన్నీ టీడీపీతోనే ముడిపడి ఉన్నాయి. ఏపీ చరిత్రలో తొలిసారి బలిజ బిడ్డ రత్న సభాపతిని స్పీకర్‌గా కూర్చోబెట్టిన ఘనత టీడీపీది. టీటీడీ చైర్మన్ పదవిని ఆదికేశవుల నాయుడు, చదలవాడ కృష్ణమూర్తి వంటి కాపు నేతలకు ఇచ్చిన ఘనత టీడీపీది. ముద్రగడ పద్మనాభం తన పేరులో రెడ్డి అని తగిలించుకున్నాక, కాపుల గురించి మాట్లాడే అర్హత కోల్పోయారు.' అని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.

రాష్ట్రాభివృద్ధికి వైసీపీ వైరస్: మంత్రి అనగాని

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అల్లర్లు, అశాంతి సృష్టించేలా జగన్ సైకో ముఠా కుట్రలు చేస్తోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. 'రాష్ట్రాభివృద్ధికి వైసీపీ, జగన్ వైరస్‌లా మారారు. కులమతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందడమే జగన్ రాజకీయ సిద్ధాంతం. విద్వేషాలు, విధ్వంసాలతో రాజకీయం చేయడం వైసీపీ డీఎన్ఏలోనే ఉంటుంది.' అని మంత్రి అనగాని వ్యాఖ్యానించారు.

దమ్ముంటే అసెంబ్లీకి రావాలి: మంత్రి గుమ్మిడి

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'పవిత్రమైన తిరుమల లడ్డూ కల్తీ అంశాన్ని మళ్లించేందుకే వైసీపీ నేతలు దిగజారుడు భాష మాట్లాడుతున్నారు. జగన్... డైవర్షన్ పాలిటిక్స్ పక్కన పెట్టి దమ్ముంటే అసెంబ్లీకి రావాలి' అని మంత్రి సంధ్యారాణి సవాల్ విసిరారు. 'క్లీన్ చిట్ అంటే ఏమిటో చంద్రబాబును చూసి వైసీపీ నేర్చుకోవాలి.' అని మంత్రి గుమ్మిడి అన్నారు. కాగా, రాష్ట్రంలో ఉన్న గిరిజనులందరికీ విద్య, వైద్యం, ఉపాధి కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం పార్టీ ఎస్టీ సెల్ సమావేశంలో ఆమె మాట్లాడారు.

వారు అంతే.. అంతా మామూలే: హోం మంత్రి అనిత

వినుకొండటౌన్, జనవరి 2(ఆంధ్రజోతి): హోం మంత్రి వంగలపూడి అనిత శ్రీశైలం దేవస్థానానికి వెళ్తూ మార్గ మధ్యలో వినుకొండలో ఆగారు. అంబటి, జోగి వ్యాఖ్యలపై స్పందించమని కోరగా... 'అందరికీ తెలిసిందే. వారు అంతే... మామూలే' అంటూ కారెక్కి శ్రీశైలం వెళ్లి పోయారు.

వైసీపీ రద్దు కోరుతూ ఈసీకి లేఖ రాస్తా: గంటా

విశాఖపట్నం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'బూతుల సంస్కృతి వైసీపీ డీఎన్ఏలోనే ఉంది. సభ్య సమాజం తల దించుకునేలా ఆ పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నందున తక్షణమే ఆ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని కోరుతూ ఎన్నికల సంఘానికి లేఖ రాస్తున్నా' అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. 'దేశంలోనే సీనియర్ నాయకుడైన చంద్రబాబును ఉద్దేశించి జగన్ మాట్లాడుతున్న మాటలు చూసి ప్రజలంతా ఏవగించుకుంటున్నారు.' అని గంటా అన్నారు.

వైసీపీ నేతలవల్లే విఘాతం: సత్యకుమార్, కొండపల్లి

విజయనగరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలే శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని రాష్ట్ర మంత్రులు సత్యకుమార్, కొండపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. ఎస్‌కోట ఏరియా ఆసుపత్రి వద్ద రూ12.60 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి భవనాన్ని, అక్కడే డయాలసిస్ యూనిట్‌ను, దీంతో పాటు గజపతినగరం ఏరియా ఆసుపత్రి వద్ద రూ.17 కోట్లతో నిర్మించిన వంద పడకల ఆసుపత్రి భవనాన్ని మంత్రులు సోమవారం ప్రారంభించారు. అంబటి రాంబాబు వివాదాస్పద వ్యాఖ్యలను ఖండించారు.

అరాచక రాజకీయాలకు ఆద్యుడు జగన్: యనమల

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'కూటమి హయాంలో శాంతిభద్రతలు విఫలమయ్యాయని జగన్, అతని అనుచరులు ఆరోపిస్తూ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరడం హాస్యాస్పదం' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. 'అరాచక రాజకీయాలకు ఆద్యుడు జగన్‌రెడ్డి. అశాంతికి, నేర కార్యకలాపాలకు జగన్, ఆయన అనుచరులే సృష్టికర్తలు.' అని యనమల అన్నారు.

స్కిల్ కేసు కుట్రపూరితమని తేలిపోయింది: వర్ల

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో చంద్రబాబుపై పెట్టిన స్కిల్ కేసు కుట్రపూరితమని తేలిపోయింది. ఇప్పటికే సీఐడీ ఈ కేసులో చంద్రబాబుకు క్లీన్ చిట్ ఇవ్వగా, ఇప్పుడు ఈడీ కూడా క్లీన్ చిట్ ఇవ్వడంతో వైసీపీ కుట్ర బట్టబయలు అయింది' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు.

అంబటి కావాలనే అరెస్టు అయ్యాడు: సోము

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు కావాలనే అరెస్టు చేయించుకున్నాడు. సిట్ నివేదిక ఆధారంగా కొన్ని అంశాలు తెరపైకి రావడంతో ఏ విధంగా స్పందించాలో తెలియక అరెస్టు అయ్యాడు' అని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్న ఆరోపణల్లో నిజం లేదు. అసలు రెడ్‌బుక్ అంటే ఏమిటి? ఎక్కడుంది? అన్నారు.

బడ్జెట్‌లో ఏపీకి స్పష్టమైన దిశ: వల్లూరు జేపీ

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్... ఆర్థిక పునాదితో దేశ భవిష్యత్తును నిర్మించే బడ్జెట్. ఆంధ్రప్రదేశ్‌కు స్పష్టమైన దిశ చూపించే బడ్జెట్' అని ఏపీ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ వ్యాఖ్యానించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

జగన్ పాపాలకు మరో అధికారి బలి!

- నాడు అక్రమాస్తుల కేసుల్లో ఎందరో జైలుకు!
- నేడు కల్తీ నెయ్యి పాపానికి సింఘాల్‌పై వేటు
- శ్రీవారి భక్తుడు, నిజాయితీపరుడు కానీ... నెయ్యి కల్తీని అడ్డుకోగలిగీ మౌనం!
- వైవీ చైర్మన్‌గా ఉండగా నిబంధనల సడలింపు
- ఘోర అపచారానికి అదే కారణమన్న 'సిట్'
- దాని ఫలితమే... సింఘాల్ బదిలీ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైఎస్ జగన్ తప్పులకు బలైపోయిన అఖిల భారత సర్వీసు అధికారులెందరో! సస్పెన్షన్లతోపాటు కొందరు ఏకంగా జైలుకూ వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడు.. జగన్ హయాంలో టీటీడీలో జరిగిన 'కల్తీ నెయ్యి' దందా వల్ల ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్ సింఘాల్‌పై బదిలీ వేటు పడింది. ఆయన శ్రీవెంకటేశ్వర స్వామికి పరమ భక్తుడు. అవినీతికి ఆమడదూరంగా ఉంటారు. కానీ 'తప్పు చేయడం మాత్రమే కాదు! ఆ తప్పును అడ్డుకోగలిగిన స్థానంలో ఉండి మౌనంగా ఉండటమూ తప్పే!' అనే సూత్రం ప్రకారం ఆయన తప్పు చేసినవారైపోయారు. ఆయన అక్రమాలకు పాల్పడలేదుకానీ, కల్తీ నెయ్యి విషయంలో అక్రమాలు జరిగేందుకు ఆస్కారం కల్పించారని సుప్రీంకోర్టు నియమించిన 'సిట్' నిర్ధారించింది. ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలన్న సిఫారసు మేరకు... సింఘాల్‌ను ప్రభుత్వం టీటీడీ ఈవోగా తప్పించింది.



నాడు సస్పెన్షన్లు, జైలు జీవితాలు

తాను తప్పులు చేసి అధికారులను బలితీసుకునే వారి జాబితాలో జగన్ పేరే ముందుంటుంది. తండ్రి అధికారంలో ఉండగా జగన్ పోగేసుకున్న అక్రమాస్తులు, క్విడ్‌ప్రో కో కేసుల్లో ఇరుక్కొని అనేక మంది ఐఏఎస్‌లు బలయ్యారు. అరెస్ట్ అయి జైలుపాలయ్యారు. ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. నాడు తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకొని జగన్ వేలకోట్ల అవినీతి సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారని, ఇందుకు నాటి ప్రభుత్వంలో కీలక పాత్రలో ఉన్న ఐఏఎస్, ఐఆర్ఎస్ అధికారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించారని సీబీఐ 16 కేసుల్లో అభియోగాలు మోపింది. అంతా బాగుంటే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగానే కాదు, ఏకంగా కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ కూడా అయ్యే అవకాశమున్న 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మీ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. 1983 బ్యాచ్‌కు చెందిన బీపీ ఆచార్య కూడా అరెస్టయ్యారు. వీరు సర్వీసులో మంచి రికార్డ్‌తో సాగుతున్న సమయంలో జగన్ కారణంగా కేసుల్లో ఇరుక్కున్నారు. సీనియర్ ఐఏఎస్‌లు మరో ఆరుగురిపై కూడా తీవ్ర అభియోగాలు వచ్చాయి. వారిని జగన్ అక్రమాస్తుల కేసుల్లో అనేక దఫాలుగా సీబీఐ పిలిచి విచారించింది. తరచూ విచారణలకు హాజరు కావాల్సి రావడం, కోర్టుల చుట్టూ తిరగడం వారి సర్వీసు, ప్రతిష్ఠపై మచ్చలుగా మిగిలిపోయాయి. ఓబుళాపురం మైనింగ్ కేసుతోపాటు, జగన్ అక్రమాస్తుల కేసు (పెన్నా సిమెంట్స్) కేసులో శ్రీలక్ష్మిపై, ఎమ్మార్ ప్రాపర్టీస్, ఇందూ ప్రాజెక్టులు, లేపాక్షి హబ్ కేసుల్లో బీపీ ఆచార్యపై సీబీఐ అభియోగాలను నమోదు చేసింది. ఐఏఎస్‌లు ఎల్వీ సుబ్రహ్మణ్యం, శ్యామ్యూల్, సీవీఎస్‌కే శర్మ, మన్మోహన్‌సింగ్, రత్నప్రభ వంటి వారు కూడా విచారణ ఎదుర్కొన్నారు. నాటి గనుల శాఖ డైరెక్టర్ వీడీ రాజగోపాల్ పరిస్థితి చెప్పనక్కరలేదు. ఓబుళాపురం మైనింగ్ కేసుతోపాటు జగన్ అక్రమాస్తుల కేసులో ఆయన సుదీర్ఘకాలం విచారణను ఎదుర్కొన్నారు. ఓఎంసీ కేసులో అరెస్ట్ అయి జైలుకు వెళ్లి వచ్చారు.

తలలూపితే అంతే...

జగన్ అక్రమాస్తుల కేసుల్లో అనేక మంది అఖిల భారత సర్వీసు అధికారులూ నిందితులుగా మారడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సర్వీసు నిబంధనల ప్రకారం వ్యవహరించకుండా, నేతలు చెప్పినదానికల్లా తలూపి, వారు సూచించిన చోటల్లా సంతకాలు చేస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో చెప్పేందుకు ఇవి నిదర్శనాలుగా నిలిచాయి. 2019లో జగన్ అధికారంలోకి రాగానే... అధికారులను తన స్వార్థానికి వాడుకోవడం మొదలుపెట్టారు. గత అనుభవాలను మరిచిపోయిన కొందరు అధికారులు, ఆ తప్పులకు యథాశక్తి సహకరించారు. ఆ ఫలితం నేడు అనుభవిస్తున్నారు. ఆనాడు బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన ఐఆర్ఎస్ అధికారి వాసుదేవ రెడ్డి ఇప్పుడు అక్రమ మద్యం కేసులో విచారణ ఎదుర్కొంటున్నారు. జగన్ ప్రభుత్వంలో మరో సీనియర్ ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి ఈ కేసులో అరెస్టయి జైలుకు వెళ్లివచ్చారు. రక్షణ శాఖలో పని చేస్తూ రాష్ట్రానికి డిప్యుటేషన్‌పై వచ్చిన వెంకటరెడ్డిని నాడు జగన్ గనుల శాఖ డైరెక్టర్‌గా, ఏపీఎండీసీగా ఎండీగా నియమించారు. అక్రమ ఇసుక కేసులో వెంకటరెడ్డి కూడా అరెస్టయి జైలుకు వెళ్లి వచ్చారు.

ఇప్పుడు టీటీడీ వంతు..

జగన్ హయాంలో జరిగే తప్పులకు అధికారులు బలైపోతున్న విషయాన్ని అనిల్ కుమార్ సింఘాల్ మరిచిపోయారో, ఏమో! తాను శ్రీవారి లడ్డూ ప్రసాదం విషయంలో జరగబోయే ఘోరమైన తప్పిదాన్ని నివారించగలిగీ... మిన్నకుండిపోయారు. ఆయన 2015లోనే టీటీడీ ఈఓగా నియమితులయ్యారు. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక కూడా ఆయననే కొనసాగించారు. టీటీడీకి నెయ్యి సరఫరా టెండర్ల నిబంధనలను కఠినతరం చేస్తూ అంతకుముందు కమిటీ చేసిన సిఫారసులను ఆయనే ఆమోదించారు. ఆ తర్వాత... వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన పూర్తిస్థాయి పాలకమండలి ఏర్పడింది. నెయ్యి సరఫరా చేసే కంపెనీలు పాల సేకరణే చేయాల్సిన అవసరం లేదన్నట్లుగా నిబంధనలు సడలించారు. కార్యనిర్వహణాధికారి హోదాలో దీనిపై అభ్యంతరం వ్యక్తం చేయాల్సింది. ఎందుకంటే... అంతకుముందున్న నిబంధనలు, మరింత కఠినతరం చేయాలంటూ కమిటీ ఇచ్చిన సిఫారసులను ఆమోదించింది ఆయనే. ఆ నిబంధనలను సరళీకరిస్తే నాణ్యత దెబ్బతినే అవకాశముందని చెప్పాల్సిన బాధ్యత ఆయనదే. అభ్యంతరం వ్యక్తం చేసినా పాలకమండలి పట్టించుకోకుంటే... తన 'డిసెంట్'ను తెలియజేసి, ఆ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించే అవకాశమూ ఉంది. కానీ... సింఘాల్ మౌనంగా ఉండటంవల్లే 'నెయ్యి' పేరిత 'రసాయనాల మిశ్రమం' సరఫరా జరిగిందని 'సిట్' పేర్కొంది. సింఘాల్‌పై తగు చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. ప్రస్తుతం టీటీడీ ఈఓగా కూడా సింఘాల్‌నే ఉన్నారు. 'సిట్' నివేదిక నేపథ్యంలో ప్రభుత్వం ఆయనపై బదిలీ వేటు వేసింది. సింఘాల్ అనంతరం ఈఓగా వచ్చిన ధర్మారెడ్డి, అక్కడి ఆర్థిక సలహాదారులపై కూడా తగు చర్యలు తీసుకోవాలని సిట్ సిఫారసు చేసింది. ధర్మారెడ్డి ఇప్పటికే రిటైర్ అయ్యారు. కాబట్టి ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

వైవీని వదిలేస్తారా!?

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించడంలేదు. మౌలికమైన ఈ అంశాలను సీబీఐ, రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం విస్తుగొలుపుతోంది.

టీటీడీలో బోర్డు చైర్మన్ పాత్రే కీలకం...

తిరుమల తిరుపతి దేవస్థానానికి స్వయం ప్రతిపత్తి ఉన్నప్పటికీ అక్కడ పాలనా, నియంత్రణ అంతా ఆంధ్రప్రదేశ్ దేవదాయ చట్టం-1987 ప్రకారం జరుగుతుంది. దేవదాయ చట్టంలో 'టీటీడీ' కోసం ప్రత్యేక నిబంధనలను పొందుపరిచారు. ఇందులో సెక్షన్ 97బి ప్రకారం టీటీడీ పాలకమండలి(బోర్డు) అత్యంత శక్తిమంతమైనది. టీటీడీ పరిపాలన, పర్యవేక్షణ, నిర్ణయాలు, నియంత్రణ అంతా కమిటీ పరిధిలోనే ఉంటుందని ఈ నిబంధన చెబుతోంది. ముఖ్యంగా టీటీడీ లో అమలయ్యే విధాన నిర్ణయాలు, పాలసీ అంశాలన్నీ బోర్డే తీసుకొని అమలు చేసే అధికారాన్ని కట్టబెట్టింది. అందులోనూ... చైర్మన్‌దే కీలక పాత్ర. బోర్డు తీసుకునే తీర్మానాలపై అధ్యక్షుడి సంతకమే ఉంటుంది. టీటీడీలో బోర్డు, చైర్మన్ సూపర్ పవర్ అయితే అధికారులు ఏం చేస్తారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దేవదాయ చట్టం-1987 ప్రకారం... అధికారులు కేవలం బోర్డుకు సహాయకారులే అని ఇదే చట్టంలోని సెక్షన్ 109 చెబుతోంది. టీటీడీ బోర్డు తీసుకునే నిర్ణయాలు, ఇచ్చే ఆదేశాలను కార్యనిర్వహణాధికారి (ఈఓ), సంయుక్త కార్యనిర్వహణాధికారి (జేఈఓ), ఇతర అధికారులు పాటించాలని ఈ నిబంధన స్పష్టం చేస్తోంది. దేవస్థానం కోసం బోర్డు తీసుకునే నిర్ణయాల్లో ఈఓ కేవలం సహాయకారిగానే ఉంటారు. బోర్డు నిర్ణయాలను అమలుచేసే బాధ్యత మాత్రమే ఈవోది. బోర్డు నిర్ణయాలపై తన అభిప్రాయాలు, అభ్యంతరాలు చెప్పొచ్చు. కానీ, నిర్ణయాధికారం బోర్డుది, ముఖ్యంగా చైర్మన్‌దే!

నెయ్యి విషయంలో ఏం జరిగింది?

2019 ఏప్రిల్‌లో నెయ్యి సరఫరా నిబంధనలు కఠినతరం చేయాలని అప్పటి బోర్డు నిర్ణయించింది. ఆ మేరకు కమిటీ తన సిఫారసులు చేసింది. ఈలోపు ప్రభుత్వం మారిపోయింది. పూర్తిస్థాయి కమిటీ ఏర్పడకపోవడంతో... ఈవోగా ఉన్న అనిల్‌కుమార్ సింఘాల్ ఆ సిఫారసులను ఆమోదించారు. ఆ తర్వాత వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన పూర్తిస్థాయి బోర్డు ఏర్పడింది. 2020 ఫిబ్రవరిలో నెయ్యి కొనుగోలు నిబంధనలను సడలించాలని బోర్డులో ప్రతిపాదించి, దానిని ఆమోదించారు. దీనిపై సంతకం... వైవీ సుబ్బారెడ్డిదే. ఆ తర్వాత... టెండరు నిబంధనలను సడలిస్తూ మరో తీర్మానం చేశారు. దానిపైనా సంతకం సుబ్బారెడ్డిదే. నెయ్యి కొనుగోళ్లలో అక్రమాలకు, కల్తీ నెయ్యికి నిబంధనల సడలింపే రాచమార్గం ఏర్పాటు చేసిందని సిట్ నిర్ధారించింది. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేయకపోవడమే సింఘాల్ నేరమని తేల్చింది. కానీ... దేవదాయ చట్టం ప్రకారం టీటీడీలో అధికారులు నిమిత్త మాత్రులే! కల్తీ నెయ్యికి అసలు కారణం... టెండరు నిబంధనలను సడలిస్తూ వైవీ సుబ్బారెడ్డి సంతకం చేసిన తీర్మానమే! ఆయన సంతకాలున్న బోర్డు తీర్మానాలు, ఉత్తర్వుల అమలుకు ఇచ్చిన ఆదేశాలు ఉన్నాయి. అంటే, కల్తీనెయ్యి కొనుగోళ్ల వెనక జరిగిన కుట్రకు తెరలేపింది, అక్రమం, అవినీతి జరగడానికి ఆస్కారం కల్పించింది వైవీ సుబ్బారెడ్డే! మరి... సిట్ ఆయనను ఎందుకు వదిలేసింది? నేరం చేసిన వ్యక్తిని వదిలేసి, అందుకు సహకరించారన్న అభియోగాలపై అధికారులపై వేటు వేయడం సబబేనా?

ప్రభుత్వ పాలనలో రూల్స్ వేరు...

దేవదాయ చట్టం-1987 ప్రకారం టీటీడీలో పాలకమండలే సుప్రీం. కానీ... ప్రభుత్వ పాలనలో జరిగే తప్పులకు అధికారులే బాధ్యులవుతారు. మంత్రివర్గం ఆమోదించిన తీర్మానమైనా సరే... అది నిబంధనలకు విరుద్ధమైతే అధికారులు దానిని అడ్డుకోవాల్సిందే. కాదని అమలుచేసి క్యాబినెట్ మీదకు నెపం వేయడం చెల్లదు. మంత్రివర్గ నిర్ణయాలను తొలుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) తెప్పించుకుంటారు. తర్వాత వాటిని వాటిని ఆయా శాఖలకు పంపిస్తారు. ఆ తర్వాతే వాటిపై సంబంధిత కార్యదర్శులు ఉత్తర్వులు ఇస్తుంటారు. ఆ ఉత్తర్వులపై కార్యదర్శి సంతకాలే ఉంటాయి. ఇవి సచివాలయంలో అమల్లో ఉన్న పాలనా నిబంధనలు. కాబట్టి, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల ఏదైనా నేరం జరిగినప్పుడు, అందుకు మూలమైన ఉత్తర్వు ఇచ్చిన అధికారి ఎవరో ముందు వారినే బాధ్యులను చేస్తారు.

సీబీఐ సిట్‌ది ఏ దారి?

టీటీడీ కల్తీ నెయ్యిలో సిట్ విచారణ... సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జరిగింది. సుప్రీంకోర్టు ఆదేశానుసారం సీబీఐ నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారులను ఎంపికచేసి సిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ బృందం నెయ్యి కేసులో దర్యాప్తు చేసి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేసింది. అయితే... అసాధారణంగా రాష్ట్ర ప్రభుత్వానికీ ఒక నివేదికను అందించింది. అందులో సింఘాల్, ధర్మారెడ్డితోపాటు టీటీడీ ఆర్థిక సలహాదారు బాలాజీని తప్పుపట్టింది. వారు తప్పు చేసినట్లు భావిస్తే... ఆ విషయాన్ని చార్జిషీట్‌లోనే ప్రస్తావించాల్సింది. కానీ... ఇలా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం ఎందుకు? సింఘాల్ పేరు చార్జిషీటులో పెడితే నిబంధనలు సడలిస్తూ తీర్మానంచేసిన వైవీ సుబ్బారెడ్డి పేరు కూడా పెట్టాల్సి వస్తుందనే ఆగారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఏర్పడిన 'సిట్'లు... దర్యాప్తు చేసి కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేసేవి. కల్తీ నెయ్యిపై ఏర్పడిన సిట్ మాత్రం... అధికారులపై చర్యలకు సిఫారసు చేస్తూ నివేదిక ఇవ్వడంపై రాష్ట్ర ప్రభుత్వ వర్గాల్లోనూ విస్మయం వ్యక్తమవుతోంది.

కల్తీ నెయ్యిలో జగన్ జైలుకే!

- టీటీడీ సభ్యుడు జ్యోతుల నెహ్రూ స్పష్టీకరణ
- సిట్‌ను మించి మా వద్ద ఆధారాలు
- వాటితో సుప్రీం కోర్టుకు అప్పీల్ చేస్తాం



కాకినాడ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరుడి లడ్డూలో కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో జగన్‌ను కచ్చితంగా జైలుకు పంపుతామని తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) బోర్డు సభ్యుడు, జగ్గంపేట టీడీపీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పష్టంచేశారు. ఈ కేసులో ఆయన్ను వదిలేది లేదని స్పష్టంచేశారు. ఖబడ్దార్ జగన్ అంటూ హెచ్చరించారు. కాకినాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 'ఆయన హయాంలో తిరుమలలో నెయ్యి అనే పదార్థం లేకుండానే లడ్డూ ప్రసాదాలు చేయించి అపవిత్రం చేశారు. రూ.251 కోట్లకు కక్కుర్తిపడి కల్తీ నెయ్యి వాడారు. ఇందులో వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, జగన్‌లతోపాటు భూమన కరుణాకర రెడ్డి కీలకపాత్ర పోషించారు. ఒక విషపదార్థాన్ని తెచ్చి హిందువుల మనోభావాలు దెబ్బతీశారు. వెంకటేశ్వర స్వామి భక్తులను మోసం చేశారు. టీటీడీ బోర్డు సభ్యుడిగా చెబుతున్నా.. జగన్‌పై సిట్ దర్యాప్తును మించిన ఆధారాలు మా వద్ద ఉన్నాయి. వాటితో సుప్రీంకోర్టులో అప్పీల్ చేయబోతున్నాం. జగన్‌ను కచ్చితంగా జైలుకు పంపుతాం. ఈ నికృష్ట పనితో ఆయన పరువుప్రతిష్ఠలు మంట కలిశాయి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అంతో, ఇంతో కష్టపడి ప్రజల్లో సంపాదించుకున్న చిన్నస్థానం నేడు జగన్ తీరుతో సమూలంగా కూలిపోయింది' అని వ్యాఖ్యానించారు.

కాపు సోదరుల్లారా.. తస్మాత్ జాగ్రత్త!

అంబటి రాంబాబు తోలుబొమ్మ అని, వెనుక ఉండి ఆడించేవారు చెప్పినట్లుగా ఆడతాడని నెహ్రూ మండిపడ్డారు. 'అంబటిని వెనకుండి నడిపించేది జగనే. కులాల కుట్రలతో అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాపు సోదరుల్లారా.. తస్మాత్ జాగ్రత! ఇవాళ కాపు నాయకుడు అని అంబటికి నిన్నటి వరకు లేని తోక తగిలించి డ్రామాలు ఆడుతున్నారు. తన ఐదేళ్లలో జగన్ కాపులకు ఏం చేశారో గుండెలపై చేయి వేసుకుని చెప్పాలి. కాపులకు టీడీపీలో చంద్రబాబు నేతృత్వంలోనే న్యాయం జరిగింది. ఆయన 2014 నుంచి 2019 వరకు చేసిన పాలనలో ఈడబ్ల్యూఎస్ కింద కాపులకు ఐదుశాతం రిజర్వేషన్లు ఇచ్చారు. జగన్ వచ్చి వాటిని రద్దు చేశాడు. ఆయనా కాపుల గురించి మాట్లాడేది! కాపు సోదరులు తొందరపడక ఆలోచించాలి. కులాల పేరుతో జగన్ కుయుక్తులను గమనించాలి. అంబటి ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలి. జగన్ వేస్తున్న ఉరితాడుతో ఆయన రాజకీయ భవిష్యత్ సమాధి అవుతుంది' అని స్పష్టంచేశారు. 2029లో తాను జగ్గంపేట నుంచి కాకుండా వేరే చోట నుంచి శాసనసభలో అడుగుపెడతానని, జగ్గంపేట నుంచి తన తనయుడు జ్యోతుల నవీన్ బరిలోకి దిగుతారని నెహ్రూ వెల్లడించారు.

కులాన్ని టార్గెట్ చేస్తున్నారు!

- రాష్ట్రంలో ఎమర్జెన్సీ పెట్టాలి.. సీఎం చంద్రబాబుకు ముద్రగడ లేఖ

కిర్లంపూడి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గాడితప్పిన రాక్షస పాలనలో దహనకాండ చూస్తున్నామని వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి విమర్శించారు. ఈ మేరకు సోమవారం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు రాసిన లేఖను కాకినాడ జిల్లా కిర్లంపూడిలో మీడియాకు విడుదల చేశారు. 'ప్రధానిని అడిగి ఏపీలో ఎమర్జెన్సీ పెట్టాలి. దీని ద్వారా ప్రతిపక్షాన్ని మీ పదవీకాలం అయ్యేంత వరకు జైల్లో పెట్టడానికి ఉపయోగపడుతుందని నా అభిప్రాయం. మాజీ మంత్రులు రజనీ, అంబటి, జోగి రమేశ్‌లను ఘోరంగా అవమానించారు. ఎంతసేపూ కులాన్ని టార్గెట్ చేస్తున్నారు. గతంలో నా కుటుంబాన్ని, ఈరోజు అంబటి కుటుంబాన్ని అవమానాలకు గురిచేశారు. మీ మీద కోపం ఉన్నా డిప్యూటీ సీఎంపై ప్రేమతో మీకు మద్దతు ఇచ్చాం. అయినా ఈ కులం మీద ఎప్పుడూ మీరు రగలిపోతానే ఉన్నారు. దయచేసి ఈ కులాన్ని రాష్ట్రం నుంచి వేరే రాష్ట్రానికి కట్టుబట్టలతో పంపించే కార్యక్రమం చేయండి' అని లేఖలో ముద్రగడ పేర్కొన్నారు.

అవసరమైనప్పుడే కులం గుర్తొస్తుందా?

- అంబటి బూతులను ముద్రగడ సమర్థిస్తున్నారా?
- బుద్దా వెంకన్న బహిరంగ లేఖ



విజయవాడ అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): అవసరమైనప్పుడే కులం గురించి మాట్లాడతారా? ఇదేనా మీ తండ్రి మీకు చెప్పింది? అని వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభరెడ్డిని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న నిలదీశారు. ఆయన ముద్రగడకు సోమవారం బహిరంగ లేఖ రాశారు. 'కాపు సామాజిక వర్గానికి చెందిన పవన్‌కల్యాణ్ తల్లిని, భార్యను వైసీపీ నేతలు దూషించినప్పుడు మీకు కులం గుర్తుకు రాలేదా? కాపు నేత నారాయణపై తప్పుడు కేసులతో వేధించినప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారు?' అని నిలదీశారు. తనకు అండగా నిలిచింది గవర సామాజిక వర్గమని చెప్పే ముద్రగడ.. అదే వర్గానికి చెందిన తనపై మాచర్లలో హత్యాయత్నం జరిగినప్పుడు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. 'చంద్రబాబు సతీమణిని అసెంబ్లీలో అవమానించినప్పుడు, ఆయన ఇంటిపై జోగి రమేశ్ దాడి చేసినప్పుడు జగన్‌కు ఎందుకు లేఖ రాయలేదు' అని నిలదీశారు. అంబటి రాంబాబు వాడిన బూతులను సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు.

లండన్ అభివృద్ధిపై నారాయణ అధ్యయనం


సిటీ ఆఫ్ లండన్ కార్పొరేషన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ గిన్ రిచర్డ్స్ బృందంతో మంత్రి నారాయణ, అధికారుల బృందం

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): లండన్ పర్యటనలో ఉన్న మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ సోమవారం సిటీ ఆఫ్ లండన్ కార్పొరేషన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ గిన్ రిచర్డ్స్‌తో మంత్రి సమావేశమయ్యారు. లండన్ నగరం మాస్టర్ ప్లాన్, అభివృద్ధి ప్రణాళికలు, రవాణా సౌకర్యాల గురించి ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి బృందానికి వివరించారు. బాటర్సీ పవర్ స్టేషన్‌ను మంత్రి పరిశీలించారు. మూతపడిన పవర్‌స్టేషన్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా లండన్ అధికారులు తీర్చిదిద్దిన వైనం, పర్యాటలకును ఆకట్టుకునేందుకు పవర్‌స్టేషన్‌లో చేసిన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. మంత్రి వెంట మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్, అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ ఉన్నారు.

గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై టాస్క్‌ఫోర్స్

వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మున్సిపల్ శాఖ డైరెక్టరేట్ స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. సీడీఎంఏ పి.సంపత్‌కుమార్ చైర్‌పర్సన్‌గాను, కన్వీనర్‌గా జాయింట్ డైరెక్టర్ ఎస్.రవీంద్రబాబు, సభ్యులుగా డీటీసీపీ అడిషనల్ డైరెక్టర్ జీవీజీఎస్ వరప్రసాద్, పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ స్వామినాయుడు, ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ టెక్నికల్ ఎ.సుధాకర్, మెప్మా అడిషనల్ మిషన్ డైరెక్టర్ కేఎన్ వెంకటేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డి.దశరథరామిరెడ్డి, ఏపీ టిడ్కో డిప్యూటీ డైరెక్టర్ హరిప్రసాద్, ఏపీయూఐఏఎంఎల్ సీటీఓ బుర్రా శ్రీనివాస్ లక్ష్మి నారాయణలను నియమిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది.

అంగన్వాడీలకు అరకొర బడ్జెట్

- నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపు

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్ 2026-27లో అంగన్వాడీలకు వేతనాల పెంపు, స్కీం నిర్వహణకు సరిపోను బడ్జెట్ కేటాయించనందుకుగాను మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టు, మండల కేంద్రాల్లో నిరసనలు తెలపనున్నట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబిరాణి, సుబ్బరావమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్‌లో అంగన్వాడీలకు వేతనాల పెంపు, స్కీం నిర్వహణకు సరిపోను బడ్జెట్ కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. దీనికి నిరసనగా ఆలిండియా కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలిపి, బడ్జెట్ కాపీలను తగలబెట్టాలని పిలుపునిచ్చారు.

ఇలాగైతే 'పోలవరం' పూర్తికి దశాబ్దాలే: సీపీఎం

- కేంద్ర బడ్జెట్ కేటాయింపుల తీరుపై రాఘవులు నిరసన
- వచ్చే నెల 24న 'చలో ఢిల్లీ'

అమరావతి, గవర్నర్‌పేట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో కేటాయిస్తున్న అరకొర నిధులతో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలంటే కొన్ని దశాబ్దాలు పడుతుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు వ్యాఖ్యానించారు. ఎన్డీఏలో టీడీపీ, జనసేన భాగస్వామిగా ఉన్నప్పటికీ నిధుల కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేంద్ర ప్రజావ్యతిరేక విధానాలు, పార్లమెంటులో చేస్తున్న ప్రజావ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ మార్చి 9 నుంచి 20వ తేదీ వరకు దేశవ్యాప్త ప్రచారాన్ని నిర్వహించి, 24న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని, కానీ భౌతిక దాడులు అభ్యంతరకరమన్నారు. టీడీపీ, వైసీపీలు దాడుల సంస్కృతిని, అసభ్యంగా మాట్లాడటాన్ని విరమించుకోవాలని సూచించారు.

రైల్వే బడ్జెట్‌లో.. రాష్ట్రానికి 10,134 కోట్లు



(మొదటి పేజీ తరువాయి)


కేవలం రూ.886 కోట్లే కేటాయించగా.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు అందుకు 11 రెట్లు ఎక్కువగా కేటాయించామన్నారు. సోమవారం ఢిల్లీలోని రైల్వేభవన్‌లో వైష్ణవ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలకు రైల్వే శాఖ కేటాయింపులను వివరించారు. 'ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం రూ.92,649 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు పనులు కొనసాగుతున్నాయి. 2014 నుంచి రాష్ట్రంలో కొత్తగా 1,700 కి.మీ మేర రైల్వే ట్రాక్‌ను నిర్మించాం. ఇది శ్రీలంక రైల్వే నెట్‌వర్క్ కంటే ఎక్కువ. ఏపీలో 73 స్టేషన్లను 'అమృత్ స్టేషన్' పథకం కింద అభివృద్ధి చేస్తున్నాం. ఇందుకోసం రూ.3,418 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఇప్పటికే సూళ్లూరుపేట, రాయనపాడు, కాకినాడ టౌన్, మంగళగిరి, తుని స్టేషన్ల పనులు పూర్తయ్యాయి. రాష్ట్రంలో రైల్వే లైన్ల విద్యుదీకరణ 100శాతం పూర్తయింది. 2014 నుంచి 1,949 కి.మీ మేర రైల్వే లైన్లు విద్యుదీకరించాం. 805 ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 8 జతల వందే భారత్ రైళ్లు, 8 జతల అమృత్ భారత్ రైళ్లు నడుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశా మీదుగా వెళ్లే అత్యంత కీలకమైన కోల్‌కతా-చెన్నై రైల్వే లైన్‌ను నాలుగు లైన్లుగా విస్తరించబోతున్నాం' అని తెలిపారు. హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో మేలు జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన ఫైనల్ అలైన్‌మెంట్, డీపీఆర్ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు. 'ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్-చెన్నై మధ్య ప్రయాణ సమయం కేవలం 2 గంటల 55 నిమిషాలకు తగ్గిపోతుంది. ఈ ప్రాజెక్టు ఏపీకి అతిపెద్ద ఎకనామిక్ కారిడార్‌గా ఉపయోగపడుతుంది' అని తెలిపారు. ప్రయాణికుల భద్రత కోసం రైల్వే శాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కవచ్ రక్షణ వ్యవస్థను రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ శరవేగంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఏపీలో ఇప్పటికే 3,137 కి.మీ. మేర కవచ్ వ్యవస్థ మంజూరు కాగా.. 2,507 కి.మీ. పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. 130 కి.మీ. వరకు ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసికట్టుగా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు జమ చేయాల్సిన ప్రాజెక్టుల విషయంలోనూ చర్చిస్తూ, పనులు త్వరగా మొదలయ్యేలా చూస్తున్నామని తెలిపారు. రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు 5,454 కోట్లు కేటాయించామని చెప్పారు.

కొత్త జోన్ ఏర్పాటు సులభం కాదు

విశాఖపట్నం రైల్వే జోన్(దక్షిణ కోస్తా రైల్వే జోన్) ఏర్పాటుపై రైల్వే మంత్రి మాట్లాడుతూ.. జోన్ ఏర్పాటు ప్రక్రియ ఎక్కడా ఆగలేదన్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయని స్పష్టం చేశారు. రైల్వే జోన్ కార్యాలయ నిర్మాణ పనులను అతి త్వరలోనే ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. పరిపాలనా భవన నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయని, ఈ ప్రక్రియ అంతా సాఫీగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్త జోన్ ఏర్పాటు బయటకు కనిపించినంత సులభం కాదని వ్యాఖ్యానించారు. ఒక జోన్ నుంచి రైలు మరో జోన్‌కు మారినప్పుడు మొత్తం స్టాఫ్, కంట్రోల్ రూం మారతాయని.. కమాండ్ సిస్టమ్, రైళ్ల టైమ్ టేబుల్స్ అన్నీ మార్చాల్సి ఉంటుందని.. చెప్పారు. అందుకే దీనిపై లోతుగా కసరత్తు చేస్తున్నామన్నారు. గతంలో ఏదైనా కొత్త రైల్వే జోన్ ప్రకటిస్తే.. అది పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి 3-4 ఏళ్లు పట్టేదని.. కానీ విశాఖ జోన్ విషయంలో తామంత సమయం తీసుకోవడం లేదని తెలిపారు. జోన్ విషయంలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో తాను చర్చిస్తున్నట్లు చెప్పారు.

అమరావతి-బెంగళూరు బుల్లెట్ రైలు వయా చిత్తూరు!

- సీఎం చంద్రబాబు వ్యూహాత్మక ప్రతిపాదన
- బెంగళూరు-చెన్నై హై స్పీడ్ కారిడార్‌తో లింకు
- బడ్జెట్‌లో చిత్తూరు మీదుగా ఈ కారిడార్ ప్రకటన
- చిత్తూరు-తిరుపతి మధ్య బాబు ప్రపోజల్
- కేంద్రం ఓకే చేస్తే అమరావతికి 2 బుల్లెట్ రైళ్లు



గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రకటించినట్టు రాష్ట్ర రాజధాని అమరావతి మీదుగా హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలు పరుగులు పెడితే..! అలాగే అమరావతి నుంచి నేరుగా బెంగళూరుకు హై స్పీడ్ రైల్ కారిడార్ అనుసంధానం చేస్తే..! రాజధాని రూపురేఖలే మారిపోతాయి! కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన హై స్పీడ్ రైల్ కారిడార్‌కు సంబంధించి సీఎం చంద్రబాబు మరో వ్యూహాత్మక ప్రతిపాదన చేశారు. దీనివల్ల తక్కువ ఖర్చుతోనే అమరావతి రాజధానికి మరో హై స్పీడ్ రైల్ కారిడార్‌తో కనెక్టివిటీ లభించే అవకాశముంది. కేంద్ర బడ్జెట్‌లో అమరావతి రాజధాని మీదుగా హైదరాబాద్-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే హైదరాబాద్-బెంగళూరు, బెంగళూరు-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్లను ఏపీ మీదుగా వెళ్లేలా ప్రకటించింది. బెంగళూరు-చెన్నై కారిడార్ చిత్తూరు మీదుగా ఉన్నది. ఈ కారిడార్‌లో చిత్తూరు-తిరుపతి మధ్యన 75 కిలోమీటర్ల వ్యూహాత్మక కనెక్టివిటీని ఇస్తే అది బెంగళూరు-అమరావతికి ఎంతో మేలు చేస్తుందని సీఎం పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవకు కూడా తెలియజేశారు. కేంద్రం ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. దీనివల్ల రెండు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఇటు హైదరాబాద్-చెన్నై, అటు బెంగళూరు-చెన్నై అనుసంధానంగా ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్-అమరావతి-గుంటూరు-తిరుపతి-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్‌ను మంజూరు చేసింది. చిత్తూరు నుంచి తిరుపతి వరకు 75 కిలోమీటర్ల రైల్ కారిడార్ నిర్మాణంతో బెంగళూరు కనెక్టివిటీ కూడా ఉంటే అమరావతి మరింత వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని సీఎం భావిస్తున్నారు. కేంద్రం అంగీకరిస్తే హైదరాబాద్-చెన్నై బుల్లెట్ రైలుతో పాటు బెంగళూరు నుంచి నేరుగా అమరావతికి బుల్లెట్ రైలు వచ్చే అవకాశముంది. అంతేగాక హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, బెంగళూరు-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్లు దక్షిణాదిన ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలను ప్రాంతీయంగా ఏకీకృతం చేస్తాయి.

మేం జోక్యం చేసుకోం

- 'టెలికాం' ట్రైబ్యునల్‌లోనే తేల్చుకోండి
- ఏపీలో సాక్షి టీవీ ప్రసారాల నిలిపివేతపై సుప్రీంకోర్టు
- ఇందిరా టెలివిజన్ పిటిషన్ కొట్టివేత
- చట్టబద్ధ పరిష్కార మార్గాలు ఉన్నప్పుడు నేరుగా విచారణ చేయలేమన్న సుప్రీం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి టీవీ ప్రసారాల నిలిపివేతపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ వ్యవహారం ఇప్పటికే టెలికాం వివాదాల పరిష్కార, అప్పిలేట్ ట్రైబ్యునల్ (టీడీ శాట్) పరిధిలో ఉన్నందున, అక్కడే తేల్చుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. ప్రస్తుత దశలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. 'ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఏపీ ఫైబర్ నెట్ చానల్స్ ప్యాకేజీ నుంచి సాక్షి టీవీని తొలగించారు. మేజర్ ఎంఎస్‌వో ఆపరేటర్లను బెదిరించారు. రాష్ట్ర ప్రభుత్వమే మీడియా స్వేచ్ఛను హరిస్తోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1)(ఏ)ను ఉల్లంఘిస్తున్నారు. ఏపీ ఫైబర్ నెట్ నుంచి సాక్షి టీవీని తొలగించడం చట్టవిరుద్ధం. తిరిగి ప్యాకేజీ చానల్స్‌లో పెట్టేలా ఆదేశాలు జారీ చేయండి' అని 2025 జూలై 19న ఇందిరా టెలివిజన్ లిమిటెడ్(సాక్షి టీవీ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ పీఎస్ నరసింహం, జస్టిస్ అలోక్ ఆరాధేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఇందిరా టెలివిజన్ తరపున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 2024 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆంధ్రప్రదేశ్ అధికారులు, మల్టీ సిస్టమ్ ఆపరేటర్ల (ఎంఎస్‌వో) ద్వారా తమ ప్రసారాలను అక్రమంగా నిలిపివేశారని, బ్లాక్ అవుట్ చేశారని అన్నారు. ప్రసారాలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రసారాల నిలిపివేతకు ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ఆదేశాలు లేవని తెలిపారు. ఇది కేవలం ప్రైవేట్ ఆపరేటర్లకు సంబంధించిన అంశమని తెలిపారు. దీంతో ఈ కేసు ట్రైబ్యునల్ పరిధిలో ఉన్నందున అక్కడే తేల్చుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ క్రమంలో పిటిషనర్ తరపు న్యాయవాది మరికొన్ని అంశాలను ప్రస్తావిస్తూ విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేయాలని కోరారు. జస్టిస్ నరసింహ స్పందిస్తూ.. ఇప్పటికే ట్రైబ్యునల్‌ను ఆశ్రయించినందున, అక్కడ తీర్పు వచ్చిన తర్వాత హైకోర్టులో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. చట్టబద్ధమైన పరిష్కార మార్గాలు అందుబాటులో ఉన్నప్పుడు నేరుగా సుప్రీంకోర్టు విచారణ కొనసాగించడం సమంజసం కాదన్నారు. "ట్రైబ్యునల్ ఇప్పటికే ఈ వ్యవహారాన్ని విచారణకు స్వీకరించింది. కాబట్టి రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం దాఖలైన ఈ పిటిషన్‌ను ఇప్పుడు విచారించలేం. పిటిషనర్ తన వాదనలను ట్రైబ్యునల్ ముందు వినిపించేందుకు పూర్తి స్వేచ్ఛ ఉంది. ట్రైబ్యునల్ లేదా హైకోర్టు ఇచ్చే తీర్పుల పట్ల సంతృప్తి చెందని పక్షంలో మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు" అని ధర్మాసనం తెలిపింది.


వైద్యుడు నగేశ్ అపార్ట్‌మెంట్‌లో చిందరవందరగా వస్తువులు.. వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

రాజాంలో భారీ చోరీ

- జీఎంఆర్ఐటీ ప్రాంగణంలోని రెండు ఫ్లాట్లలో..

1541 గ్రాముల బంగారం, కిలో వెండి అపహరణ

రాజాం రూరల్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా రాజాంలో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. జీఎంఆర్ఐటీ ప్రాంగణంలోని రెండు ఫ్లాట్లలో బంగారం, వెండి దుండగులు ఎత్తుకెళ్లారు. జీఎంఆర్ఐటీ ప్రాంగణంలోని రస క్వార్టర్స్ మూడో ఫ్లోర్‌లో నివాసం ఉంటున్న జీఎంఆర్ కేర్ ఆస్పత్రి చిన్న పిల్లల వైద్యుడు నగేశ్ శనివారం విధులు ముగించుకుని కుటుంబంతో కలిసి విశాఖకు వెళ్లారు. సోమవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు తెరిచి, బీరువాలు పగలగొట్టి, ఆభరణాల బాక్సులన్నీ చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగేశ్ తన ఫ్లాట్‌లో కిలో వెండి, 1250 గ్రాముల బంగారం చోరీ జరిగినట్లు పేర్కొన్నారు. ఇదే ప్రాంగణంలో లయ అపార్ట్‌మెంట్ మూడోఫ్లోర్‌లో నివాసం ఉంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ మాధవకృష్ణ రెడ్డి కూడా శనివారం తన భార్యతో కలిసి పాలకొండ వెళ్లారు. క్యాంపస్‌లో భారీ చోరీ జరిగిందని తెలుసుకున్న ఆయన సోమవారం తిరిగి తన ఫ్లాట్‌కు చేరుకుని చూస్తే బీరువాతాళాలు తెరిచి ఉన్నాయి. అందులో 291 గ్రాముల బంగారం పోయిందని నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ చోరీకి గురైన రెండు ఇళ్లను సోమవారం సాయంత్రం పరిశీలించారు. సీసీ ఫుటేజీల ఆధారంగా చోరీలో ముగ్గురు వ్యక్తులు పాల్గొన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. రెండు ఘటనల్లో 1541 గ్రాముల బంగారం, కిలో వెండి అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు.

జగన్‌వి హింసా రాజకీయాలు

- కోడి కత్తి వైసీపీకి డ్రామాలు కొత్తకావు
- నాపై వైసీపీ దుష్ప్రచారం: ఎంపీ చిన్ని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కల్తీ మనుషులు, నకిలీ పార్టీ అయిన వైసీపీకి డ్రామాలు కొత్త కాదని టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని విమర్శించారు. సోమవారం ఏపీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఆనాడు బాబాయి హత్య కేసు సమయంలో, కోడి కత్తి డ్రామా, గులకరాయి డ్రామా ఆడారు. ఇప్పుడు రాష్ట్రంలో అలజడులు సృష్టించటానికి జగన్ డైరెక్షన్‌లో వారి పార్టీ నాయకులు తమ ఇళ్లను తామే తగలబెట్టుకుని నింద వేరే వాళ్లపై వేసే సరికొత్త డ్రామాకు తెరతీశారు. జగన్‌ది హింసాత్మక వైఖరి. లోకేశ్ నాయకత్వంలో నా ఆధ్వర్యంలో జోగి ఇల్లు తగలబెట్టారని వైసీపీ చేస్తున్నది దుష్ప్రచారం మాత్రమే. రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేందుకు రాజకీయంగా అశాంతి సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతీకార రాజకీయాలకు మేం దూరం' అని చిన్ని పేర్కొన్నారు.


ఓ వైపు చట్టాన్ని ఉల్లంఘిస్తూ.. మరోవైపు రక్షణ కోరుతున్నారు!

- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై జోగి రమేశ్ అసభ్యకర వ్యాఖ్యలు
- శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు
- ఉపశమన ఉత్తర్వులకు ఆయన అనర్హుడు
- అనుచిత వ్యాఖ్యలు చేయకుండా నియంత్రించండి
- హైకోర్టును కోరిన హోంశాఖ న్యాయవాది

అమరావతి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): తమ ఇంటిపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ వైసీపీ నేత జోగి రమేశ్ కుమారుడు రోహిత్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. హోంశాఖ తరఫున ప్రభుత్వ న్యాయవాది జయంతి వాదనలు వినిపిస్తూ.. జోగి రమేశ్ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తూ.. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని వివరించారు. ఓవైపు చట్టాన్ని ఉల్లంఘిస్తూ.. మరోవైపు రక్షణ కల్పించాలని పిటిషన్లు వేస్తున్నారని పేర్కొన్నారు. కోర్టు నుండి ఉపశమన ఉత్తర్వులు పొందేందుకు ఆయన అనర్హుడన్నారు. అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేయకుండా రమేశ్‌ను నియంత్రించాలని కోరారు. ప్రస్తుతం పిటిషనర్ నివాసం వద్ద 15 మంది పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశామని కోర్టుకు తెలిపారు. పిటిషనర్ చెబుతున్నట్లుగా ఆయన నివాసం వద్ద ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు లేవని, ప్రస్తుతం అక్కడ సాధారణ పరిస్థితి ఉందని నివేదించారు. ఆయన ఇంటిపై దాడికి పాల్పడిన వారిపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు.. పిటిషనర్ నివాసం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ కమిషనర్‌కు సూచిస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరించారు. తమ ఇంటిపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ జోగి రోహిత్ హైకోర్టులో అత్యవసరంగా పిటిషన్ వేశారు. సోమవారం విచారణ ప్రారంభమైన వెంటనే.. వ్యాజ్యంపై అత్యవసర విచారణ జరపాలని పిటిషనర్ తరఫు న్యాయవాది రామలక్ష్మణరెడ్డి అభ్యర్థించారు. దీంతో కోర్టు లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది. న్యాయవాది రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపిస్తూ.. రమేశ్ ఇంటిపై దాడి జరుగుతుంటే పోలీసులు చూస్తూ నిలబడ్డారన్నారు. రమేశ్‌పై కేసు నమోదు చేశారని, పోలీసులు ఆయనపై తొందరపాటు చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలన్నారు. న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. ముందస్తు బెయిల్ దాఖలు చేసుకోవాలని ఆ న్యాయవాదికి సూచించారు.

లోకేశ్ ఏమైనా పుడింగా?

- చిప్ దొబ్బిందంటే తప్పేంటి?
- రెడ్‌బుక్‌ను మడిచి పెట్టుకో
- మళ్లీ నోరు పారేసుకున్న జోగి రమేశ్
- నాకేమైనా జరిగితే లోకేశ్‌దే బాధ్యత
- పోలీసులు, కొన్ని పత్రికలది రాక్షసానందం: జోగి వ్యాఖ్యలు



విజయవాడ/ ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మంత్రి లోకేశ్, పోలీసులపై వైసీపీ నేత జోగి రమేశ్ మరోసారి నోరు పారేసుకున్నారు. "లోకేశ్‌కు చిప్ దొబ్బిందని అనకూడదా? అందులో ఏం తప్పుంది? ఆయనేమైనా పుడింగా? మర్యాద నేర్చుకోవాలి" అంటూ దురుసు వ్యాఖ్యలు చేశారు. రెడ్‌బుక్‌ను మడిచి పెట్టుకోవాలంటూ దూకుడు ప్రదర్శించారు. తనకేమైనా జరిగితే దానికి పూర్తి బాధ్యత లోకేశ్‌దేనన్నారు. సోమవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేశ్ ఆదేశాలతోనే విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని నేతృత్వంలో తన ఇంటిపై దాడి జరిగిందన్నారు. "లోకేశ్.. నీ ఇంటికి నా ఇల్లు ఎంత దూరమో.. నా ఇంటికి నీ ఇల్లు కూడా అంతే దూరం" అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. తన ఇంటిపై దాడి ఘటన పట్ల పోలీసులు, కొన్ని పత్రికలు రాక్షసానందం పొందుతున్నాయన్నారు. "రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ వందలమంది కార్యకర్తలను నా ఇంటిపైకి లోకేశ్ పంపారు. పథకం ప్రకారం నన్ను మట్టుబెట్టాలని చూశారు" అని ఆరోపించారు. కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. పోలీసులను దేవుడు ఏదో రూపంలో శిక్షిస్తాడంటూ శాపనార్థాలు పెట్టారు. చంద్రబాబుకు జై.. అనాలనుకుంటే డ్రస్ వదిలేసి పచ్చచొక్కాలు వేసుకోవాలన్నారు. పోలీసులు, టీడీపీ నేతలు కలిసే తన ఇంటిపై దాడి చేశారని ఆరోపించారు. ఆ సమయంలో ఒక్క పోలీస్ చేతిలో అయినా లాఠీ ఉందా అనిప్రశ్నించారు. ఈ సమావేశంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు.

మేం వచ్చాక రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం!

- చంద్రబాబు, లోకేశ్‌లపై కేసులు పెడతాం
- చిప్ దొబ్బింది అనడం కూడా తప్పేనా?: సజ్జల



అమరావతి/విజయవాడ (ఇబ్రహీంపట్నం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు, మంత్రి లోకేశ్ వ్యవస్థలన్నింటినీ తమ గుప్పిట్లో పెట్టుకుని నియంతల్లా వ్యవహరిస్తున్నారని వైసీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తామని, ఇచ్చే రిటర్న్ గిఫ్ట్‌లో చంద్రబాబు, లోకేశ్‌లపై కేసులు ఉంటాయని చెప్పారు. సోమవారం ఆయన పార్టీ నేతలతో కలిసి ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ ఇంటికి వెళ్లారు. ఆయన్ని పరామర్శించాక మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, లోకేశ్‌లు తుపాకులు పట్టుకున్న సైనికులను ప్రజలపైకి పురిగొల్పేలా నియంతల్లా వ్యవహరిస్తున్నారని అన్నారు. చిప్ దొబ్బింది అనడం కూడా బూతేనా అంటూ ప్రశ్నించారు. బాధితులైన అంబటి, జోగి రమేశ్‌లపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టారని అసహనం వ్యక్తం చేశారు. అంబటి, జోగి అంశాల్లో పోలీసులు నిష్పాక్షికంగా వ్యవహరించలేదని, దాడులు జరుగుతుంటే మౌన ప్రేక్షకుల్లా ఉన్నారని ఆరోపించారు. పోలీసులే దగ్గరుండి దాడులు చేయిస్తున్నారన్నారు. గత రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలతో వైసీపీ క్యాడర్ మరింత బలోపేతమైందన్నారు. వైసీపీ నేతలపై జరుగుతున్న దాడులను ప్రజాస్వామ్యయుతంగానే ఎదుర్కొంటామని అన్నారు.

ఆ ముగ్గురూ మోదీ తొత్తులు

- 'ఉపాధి' పథకానికి తూట్లు పొడిచారు
- బాబు.. పవన్.. జగన్‌పై షర్మిల ధ్వజం
- అనంతలో ఉపాధి పథకం పరిరక్షణ యాత్ర



నార్పల, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లి గ్రామంలో సోమవారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రను షర్మిల ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ, 'కాంగ్రెస్ హయాంలో దాదాపు 20 ఏళ్ల కిందట బండ్లపల్లి వేదికగా ఉపాధి హామీ పథకాన్ని సోనియాగాంధీ ప్రారంభించారు. ఈ పథకాన్ని మోదీ, చంద్రబాబు, జగన్ కలిసి భ్రష్టు పట్టించారు. రాష్ట్రంపై భారం వేసేలా వీబీజీ రామ్‌జీ పథకానికి చంద్రబాబు, జగన్ ఎందుకు మద్దతు ఇచ్చారు? ఉపాధి పథకాన్ని పునరుద్ధరించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలి' అని డిమాండ్ చేశారు.

దాడికి పవన్ కల్యాణ్‌దే బాధ్యత

- ఆయనను చూసుకునే మాపై దౌర్జన్యం
- మహిళలున్న ఇంటిపై దాడి ఎలా చేస్తారు?
- హోంమంత్రి అనితను ప్రశ్నించిన అంబటి కుమార్తె



గుంటూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై టీడీపీ శ్రేణుల దాడికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బాధ్యత వహించాలని ఆయన కుమార్తె మౌనిక డిమాండ్ చేశారు. గుంటూరులో తన తల్లితో కలసి ఆమె సోమవారం మీడియాతో మాట్లాడారు. "కాపులు పవన్ కల్యాణ్ వెంట ఉన్నారు. ఆయన బలం చూసుకొనే మా కుటుంబంపై దాడికి తెగబడ్డారు. దీనిపై పవన్ స్పందించాలి. మహిళల రక్షణ గురించి పవన్ చాలా సార్లు స్పందించారు. అలాగే మాపై జరిగిన దాడి పట్ల కూడా ఆయన స్పందించాలి. మా తండ్రి గొంతు నొక్కాలనే దాడులు చేశారు. అయితే, ఆయన ఇటువంటి దాడులకు భయపడబోరు. మా భద్రత గురించే ఆయన ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు" అని మౌనిక పేర్కొన్నారు. తాను తన తండ్రి వ్యాఖ్యలను సమర్థించటం లేదన్నారు. ఆడవాళ్లు ఉన్న ఇంటిపై ఎలా దాడి చేస్తారని ప్రశ్నించారు. హోం మంత్రి అనిత దీనికి సమాధానం చెప్పాలంటూ డిమాండ్ చేశారు.

అంబటి @ 5868

- అల్లుడు, వైసీపీ నేతల ములాఖత్.. నేడు బొత్స వస్తారని ప్రచారం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుపై బూతులతో రెచ్చిపోయిన కేసులో అరెస్టయిన వైసీపీ నేత అంబటి రాంబాబుకు రాజమహేంద్రవరం జైలులో స్నేహ బ్లాక్‌లోని బ్యారక్ కేటాయించారు. జైలు అధికారులు అంబటికి ఆర్పీ నంబర్ 5868 ఇచ్చారు. కోర్టు ఆదేశాలతో సెంట్రల్ జైలుకు సోమవారం తెల్లవారు జామున 4.15 గంటల సమయంలో ఆయనను రిమాండ్‌కు తీసుకొచ్చారు. జైలు బయట వైసీపీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో హల్‌చల్ సృష్టించాయి. అంబటి అల్లుడు ఉపేశ్, జక్కంపూడి రాజా రిమాండ్ ఖైదీ అంబటి రాంబాబుతో ములాఖత్ అయ్యారు. మంగళవారం రాంబాబుతో మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, వేణు, రాంబాబు న్యాయవాది ములాఖత్ అయ్యే అవకాశం ఉంది.

ఆ భాషను సభ్యసమాజం స్వాగతించదు: పురందేశ్వరి

అంబటి రాంబాబు వాడిన భాష సభ్యసమాజం స్వాగతించదని రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి అన్నారు. దూషించింది చంద్రబాబును కాదని, రాష్ట్ర ముఖ్యమంత్రిని అని అన్నారు. చంద్రబాబు తల్లిని దూషించడం మహిళాలోకంతో పాటు ఎవరూ క్షమించరని అన్నారు.

అంబటిని కొట్టలేక... మా చెప్పుతో మేమే కొట్టుకుంటున్నాం: రాయల్ మురళి



చెప్పులతో కొట్టుకుంటున్న మురళి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): 'అంబటి రాంబాబును సాటి కులస్థుడిగా చెప్పుతో కొట్టలేక.. మా చెప్పుతో మేమే కొట్టుకుంటున్నాం' అంటూ టీడీపీ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి తన చెప్పులతో తానే కొట్టుకున్నారు. అనంతపురం టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. 'అంబటి యూజ్‌లెస్ ఫెలో... బ్రోకర్ జగన్‌రెడ్డి అంబటిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి' అని రాయల్ మురళి డిమాండ్ చేశారు.

తిరుపతిలో జోగిపై కేసు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు జోగి రమేశ్, మరికొందరిపై తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన ఈశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చిన్నగోవింద్ వెల్లడించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.